www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★




సోషలిస్టు ఆదర్శాలను వ్యాప్తి చేసిన తమిళ ఆత్మగౌరవ ఉద్యమం 06


ట్రంప్ – ఇయు చర్యలతో పెరుగుతున్న ఉద్రిక్తత 02

కొలంబియా దేశాధినేత హత్యకు ట్రంప్ యత్నాలు!

సంపుటి 08, సంచిక: 324 | ఆదివారం | 26-10-2025 | ఖమ్మం    Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar    పేజీలు: 12+8 | వెల రూ. 5.00

# దూసుకువస్తున్న మోంతా తుపాను

## పలు రాష్ట్రాలకు భారీ వర్ష సూచన



**న్యూఢిల్లీ :** బంగాళాఖాతంలో ప్రస్తుతం కొనసాగుతున్న వాయుగుండం తుపానుగా మారి ఆంధ్రప్రదేశ్ వైపు వైపు దూసుకువచ్చే ప్ర మాదం ఉందని జాతీయ వాతావరణ శాఖ (ఐఎండి) ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. తెలంగాణపైన కూడా దీని ప్రభావం ఉండవచ్చని పేర్కొంది. ఐఎండి అందించిన వివరాలను అనుసరించి, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఇప్పటికే వాయుగుండంగా మారింది. ఇది ఆదివారం (అక్టోబర్ 26) నాటికి తీవ్ర వాయుగుండంగా మారి, ఆతర్వాత సోమావారం (అక్టోబ ర్ 27) నాటికి తుపానుగా రూపాంతరం చెందే అవకాశాలున్నాయి. ఈ తుపానుకు 'మోంతా' గా నామకరణం చేశారు. ఇది ఆంధ్రప్రదేశ్ లోనే తీరం దాటే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుం డం కొనసాగుతోంది. ఇది గంటకు 7కి.మీ వేగంతో కదులుతోందని ఆంధ్రప్రదేశ్ వాతావరణ శాఖ (ఎపిఎస్‌డిఎంఎ) తెలిపింది. ప్రస్తుతం ఈ వాయుగుండం పోర్ట్ బ్లెయిర్‌కి 440 కి.మీ, విశాఖపట్నానికి 970 కి.మీ, చెన్నైకి 970 కి.మీ, కాకినాడకి 990 కి.మీ, గోపాల్‌పూర్ కి 1040 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉందని తెలిపింది. ఇది పశ్చిమ వాయువ్య దిశ గా కదులుతూ ఆదివారం నాటికి తీవ్ర వాయుగుండంగా, సోమవారం ఉదయానికి తుపానుగా బలపడే అవకాశం ఉందని వివరించింది. సోమవారం ఏర్పడనున్న మోంతా తు పాను మంగళవారం (అక్టోబర్ 28) మరింత బలపడుతుందని ఎపిఎస్‌డిఎంఎ తెలిపింది. ఇదేరోజు రాత్రి ఈ తుపాను

తరువాయి 2లో

### తీవ్ర వాయుగుండం

గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు

ఐదు రోజులు భారీ వర్షాలు : ఐఎండి

ప్రజాపక్షం/హైదరాబాద్

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రాగల 24 గంటల్లో వాయుగుండం తీవ్ర వాయుగుండంగా మారనుందని చెప్పారు. తీవ్ర వాయుగుండం సోమవారం ఉదయానికి తుపానుగా మారే అవకాశం ఉందన్నారు. వాయవ్య దిశలో కదిలి ఈ నెల 28 నాటికి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందన్నారు. ఈ నెల 28న కాకినాడ సమీపంలో తీవ్ర తుపానుగా తీరం దాటే అవకాశం ఉందని చెప్పారు. తీవ్ర తుపాను తీరం దాటే సమయంలో బలమైన ఈదురు గాలులు వీస్తాయన్నారు. ఈ క్రమంలో తెలంగాణలో రాబోయే ఐదు రోజుల పాటు వర్షాలు కురిసే

తరువాయి 2లో

# ఫిట్‌నెస్ లేని ప్రైవేట్ బస్సులపై ఆర్‌టిఎ కొరడా

- కర్నూల్ బస్సు ప్రమాద ఘటనతో రవాణా శాఖ అప్రమత్తం
- జాతీయ రహదారులపై విస్తృత తనిఖీలు
- 8 ప్రైవేట్ బస్సులు సీజ్
- మరో 12 బస్సులపై కేసు



ప్రజాపక్షం/హైదరాబాద్

కర్నూలు బస్సు ప్రమాద ఘటనతో రవాణా శాఖ అప్రమత్తమైంది. కఆర్‌టిఎ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఫిట్‌నెస్ లేని ప్రైవేట్ బస్సులపై అధి కారులు కొరడా ఝులిపిస్తున్నారు. నిబంధనలు పాటించని 12 బస్సులపై కేసులు నమోదు చే యడంతో పాటు 8 బస్సులను సీజ్ చేశారు. విజయవాడ హైవే, బెంగళూరు హైవేపై ఆర్‌టిఎ బృందాలు విస్తృత తనిఖీలు చేపట్టాయి. రాజేంద్రనగర్ పరిధి గగన్ పహాడ్ వద్ద ఎపి నుంచి వ స్తున్న ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేశారు. వాహనాల్లోని ఫైర్ సేఫ్టీ, మెడికల్ కిట్లను పరిశీలించా రు. బస్సు అద్దం పగిలినా అలాగే నడుపుతున్న ట్రావెల్స్ బస్సును అధికారులు సీజ్ చేశారు. జడ్చర్ల వద్ద ఈ వాహనం రోడ్డుప్రమాదానికి గురైందని ప్రయాణికులు తెలిపారు. మరోవైపు ఎల్.బి. నగర్‌లోని చింతలకుంట వద్ద ఆర్‌టిఎ అధికారులు తనిఖీలు జరిపారు. నిబంధనలు ఉల్లంఘించిన ట్రావెల్స్ బస్సును సీజ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై తిరుగుతున్న మరో 4 బస్సులపై కేసు నమోదు చేసినట్లు అధికారులు చెప్పారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, రాష్ట్రాలతో పాటు బెంగళూరులో కూడా ఆర్‌టిఏ అధికారులు భారీగా బస్సులను సీజ్ చేస్తున్నా రు. తెలంగాణలో

తరువాయి 2లో

### బస్సు ప్రమాదంపై దర్యాప్తు

బస్సు ప్రమాద ఘటన దర్యాప్తులో భాగంగా బైక్ నడుపుతూ మృతి చెందిన శివశంకర్‌తో పాటు ఉన్న వ్యక్తిని ఎర్రి స్వామిగా గుర్తించామని, అతన్ని అదుపులోకి తీసుకుని పలు కోణాల్లో విచారించినట్లు కర్నూల్ జిల్లా ఎస్‌పి విక్రాంత్‌పాటిల్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎర్రిస్వామి, బైక్ నడుపుతున్న శివశంకర్ ఇద్దరు కలిసి కర్నూలు సమీపంలోని లక్ష్మీపురం గ్రామం నుండి అర్ధరాత్రి దాటిన తర్వాత 2 గంటలకు బయలు దేరినట్లు తెలిపారు. శివశంకర్ మిత్రుడైన ఎర్రిస్వామిని

తరువాయి 2లో

# కొద్ది నెలల్లో యాదాద్రి పవర్ ప్లాంట్



- అందుబాటులోకి 4000 మెగా వాట్ల విద్యుత్తు
- ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్



ప్రజాపక్షం/హైదరాబాద్

రానున్న రబీ, సమ్మర్‌లో రికార్డు స్థాయిలో నమోదయ్యే విద్యుత్ డిమాండ్‌కు తగినట్టుగా విద్యుత్ సంస్థలు సంసిద్ధంగా ఉండాలని ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ విద్యుత్ సంస్థల యాజమాన్యాలను ఆదేశించారు. మరి కొద్ది నెలల్లో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లోని అన్ని యూనిట్లు అందుబాటులోకి వస్తాయని, తద్వారా ప్లాంట్ నుండి మొత్తం 4000 మెగా వాట్ల విద్యుత్ అందుబాటులోకి వస్తుందని వెల్లడించారు. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ నగరానికి మాత్రమే పరిమితమైన స్కాడా తరహా సాంకేతికను గ్రామాలకు సైతం విస్తరింపజేయాలన్నారు. హైదరాబాద్, మింట్ కాంపౌండ్‌లో దక్షిణ

తరువాయి 2లో



# మరో భూ భాగోతాన్ని బయట పెట్టిన హైడ్రా

- కొండాపూర్ రాజరాజేశ్వరి కాలనీలో రూ.86 కోట్ల విలువైన 4300 గజాల స్థలం చుట్టూ ఫెన్సింగ్
- అక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు

ప్రజాపక్షం/శేరిలింగంపల్లి

శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని కొండాపూర్ డివిజన్ రాజరాజేశ్వరి కా లనీలో మరో పెద్ద భూకబ్జా ను హైడ్రా అధికారులు అడ్డుకున్నారు. రాజరాజేశ్వరి కాలనీలో ప్రజావసరాలకు ఉద్దేశించిన 4300 స్థలం దాదాపు 86 కోట్ల విలువైన స్థలాన్ని అక్రమణదారుల చెర నుండి విడిపించి ఫెన్సింగ్ వేశారు. రాఘవేంద్ర కాలనీలో శుక్రవారం 2000 గజాల స్థలాన్ని కాపాడిన హైడ్రా అధికారులు ఆ దగ్గరలోనే ఉన్న రాజరాజేశ్వరి కాలనీలో

తరువాయి 2లో



# ఎంజిఎంలో వైద్యం అధ్వానం

- వెంటాడుతున్న బెడ్లు, మందుల కొరత..
- పెద్దాసుపత్రికి వస్తే ప్రాణాలకు నో గ్యారంటీ
- సిబ్బంది నిర్లక్ష్యం... మారుతున్న మృతదేహాలు
- ఇద్దరు రోగులకు ఒక్కటే సిలిండర్
- గాడి తప్పిన పాలన, పర్యవేక్షణ

ప్రజాపక్షం/హనుమకొండ



ఉత్తర తెలంగాణకు పెద్ద దిక్కుగా ఉన్న మహాత్మ గాంధీ మెమోరియల్ ఆస్పత్రి (ఎంజిఎం) నిర్వహణ పూర్తిగా గాడి తప్పింది. ఆస్పత్రిలో రోగులకు వైద్య సేవలు రోజు రోజుకు మృగ్యంగా మారుతున్నాయి. పేదలకు పెద్ద దిక్కుగా ఉన్న ఎంజిఎం ఆసుపత్రి నిర్వహణను పర్యవేక్షించడంలో అధికారులు సైతం నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఆస్పత్రిలో సేవలు అరకొరగా అందుతుండటమే కాదు.. కనీసం పేషంట్లను చూసేందుకు కూడా వైద్యాధికారులు సమయ వేళలు పాటించడం లేదు. ఇక ఆస్పత్రికి నిత్యం వందలాది మంది ఒపి అవుట్ పేషంట్లు వైద్య సేవల కోసం వస్తుండగా.. వారికి సరిపోను బెడ్లను సమకూర్చకపోవడం ఆస్పత్రి వైద్యాధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. ఓవైపు ఎంజిఎంను అద్భుతంగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వం చెబుతుండగా.. వాస్తవ పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా కనిపిస్తున్నది. ప్రస్తుతం ఒకే బెడ్‌లో ఇద్దరు పేషెంట్లు ఉండటమే కాకుండా ఒకే సిలిండర్ ఇద్దరిద్దరికీ ఒకేసారి ఉపయోగించడం జరుగుతోంది. ఇద్దరి చిన్నారులకు ఆక్సిజన్ సిలిండర్‌తో తరలిస్తున్నటువంటి దృశ్యాలు శనివారం వెలుగులోకి రావడం ఎంజిఎంలో అత్యంత దారుణ పరిస్థితులను కళ్లకు కడుతున్నాయి. వాస్తవానికి వరంగల్ కలెక్టర్ సత్యశారద వరంగల్ ఎంజిఎంను గాడిలో పెట్టేందుకు అనేక మార్లు సమీక్షలు నిర్వహించారు. వైద్యాధికారులను కూడా మార్చారు. వీలున్నప్పుడల్లా కలెక్టర్ సందర్శిస్తున్నారు. అయితే కలెక్టర్ ఎన్ని రివ్యూలు చేసినా.. ఎన్ని ఆదేశాలు జారీ చేసినా ఎంజిఎం అధికారుల్లో మాత్రం పెద్దగా మార్పు ఉండటం లేదు. అంతేకాదు వారి పనితీరులో ఎలాంటి శ్రద్ధ కనిపించడం లేదు. వైద్య సేవలు అందకపోవడంతో ఎంజిఎంలో మృత్యుఘోష వినబడుతూనే ఉంద న్న విమర్శలున్నాయి. ఎంజిఎం ఆసుపత్రిలో కొద్దిరోజుల క్రితం విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగడంతో దాదాపు ఐదు గంటల పాటు అత్యవసర సేవలకు కరెంటు నిలిచిపోయింది. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనిపై రాష్ట్ర వైద్య,

తరువాయి 2లో

# హైదరాబాద్‌లో కాల్పుల కలకలం

- ఐపిఎస్ అధికారిపై రౌడీషీటర్ కత్తితో దాడి
- ఆత్మరక్షణ కోసం రౌడీషీటర్‌పై అధికారి కాల్పులు
- సెల్‌ఫోన్ లాక్కొని పారిపోతుండగా వెంబడించిన అధికారి





ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్‌లో మరోసారి కాల్పుల కలకలం చోటు చేసుకుంది.ఈ సారి సాక్ష్యాత్తు ఓ ఐపిఎస్ అధికారి దొంగతనం చేసి పారిపోతున్న రౌడీషీటర్‌పై కాల్పులు జరిపారు. చాదర్ ఘాట్ విక్టరీ ప్లే గ్రౌండ్ వద్ద జరిగిన ఈ ఘటన రాష్ట్రం వ్యాప్తంగా కలకలం రేపింది. ఇటీవలే నిజామాబాద్‌లో కానిస్టేబుల్‌ను ఓ దొంగ కత్తితో పొడిచి దారుణ హత్యకు పాల్పడిన ఘటన మరచిపోక ముందే తాజాగా ఛాదర్‌ఘాట్‌లో ఏకంగా ఐపిఎస్ అధికారిపైనే ఓ దొంగ కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ క్రమంలోనే సదరు ఐపిఎస్ అధికారి కాల్పులు జరపాల్సి వచ్చింది. ఈ ఘటనలో బుల్లెట్ గాయమైన రౌడీషీటర్‌ను మలక్‌పేట్ యశోదాఆసుపత్రిలో చేర్పించారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ప్రతి శుక్రవారం హైదరాబాద్ పోలీసు కమిషనర్ సజ్జనార్ బషీర్‌బాగ్‌లోని పాత కమిషనర్ కార్యాలయం నుంచి విధులు నిర్వహిస్తారు. ఈ క్రమంలోనే కమిషనర్ ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని సాయంత్రం 5 గంటల సమయంలో సౌత్ ఈస్ట్ డిసిపి చైతన్య తన గన్‌మెన్ హెడ్‌కానిస్టేబుల్ మూర్తితో కలిసి తన వాహనంలో సైదాబాద్‌లోని తన కార్యాలయానికి వస్తున్నారు. ఛాదర్‌ఘాట్‌లోని విక్టరీ ప్లే గ్రౌండ్ వద్దకు రాగానే ట్రాఫిక్ జామ్ కావడంతో డిసిపి వాహనం

తరువాయి 2లో



# ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు

- మార్చి 18 వరకు నిర్వహించనున్నట్టు ఇంటర్ బోర్డ్ వెల్లడి
- వచ్చే ఏడాది నుంచి కొత్త సిలబస్ : కృష్ణ ఆదిత్య
- మొదటి సంవత్సరంలోనూ ప్రాక్టికల్స్

ప్రజాపక్షం/హైదరాబాద్

ఇంటర్ పరీక్షలు 2026, ఫిబ్రవరి 25 నుండి మార్చి 18 వరకు నిర్వహించనున్నట్టు ఇంటర్మీడియట్ బోర్డ్ కార్యదర్శి కృష్ణ ఆదిత్య వెల్లడించారు. ఫిబ్రవరి మొదటి వారంలో పాత విధానంలోనే ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. హైదరాబాద్‌లోని ఇంటర్‌బోర్డ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్‌సిఇఆర్‌టి నిబంధనలకు అనుగుణంగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొత్త సిలబస్‌ను ప్రవేశపెడుతున్నామని, వచ్చే ఏడాది కోసం ఏప్రిల్ నెలఖారులోపు కొత్త పుస్తకాలు మార్కెట్ లోకి తీసుకొస్తామన్నారు. ఇంటర్ మొదటి

తరువాయి 12లో

'రైజింగ్ తెలంగాణ'లో భాగస్వామ్యం అవ్వండి 03

ఎల్ఐసిపై పార్లమెంట్ పిఎసి దర్యాప్తు చేయాలి 05

బిహార్ రైళ్లలో ప్రయాణం నరకప్రాయం


# ఎల్ఐసికి ఎసరు!

- 'మోదానీ' మరో భారీ కుంభకోణం
- అదానీకి జీవిత బీమా సంస్థ సొమ్ము కట్టబెట్టిన ఎన్‌డిఎ సర్కార్
- విదేశీ బ్యాంకులు రుణం నిరాకరించడంతో మిత్రుడ్ని ఆదుకున్న మోదీ
- ప్రజల పొదుపు కార్పొరేట్ల పాలు... వెల్లువెత్తుతున్న విమర్శలు




**న్యూఢిల్లీ :** దేశంలో మోదానీ కుంభకోణాల పరంపర కలకలం రేపుతోంది. కేంద్రంలోని ఎన్‌డిఎ సర్కార్... తన కార్పొరేట్ స్నేహితులకు ప్రజల పొదుపు సొమ్మును కట్టబెడుతున్న వైనాన్ని అమెరికా నుంచి వెలువడే వాషింగ్టన్ పోస్ట్ పత్రిక బట్టబయలు చేసింది. ప్రధాన విదేశీ బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు నిరాకరించడంతో భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసి) నుంచి అదానీకి కోట్లాది రూపాయల నిధులను మళ్లించే ప్రణాళికను మోదీ ప్రభుత్వం పర్యవేక్షించిందని ఆ నివేదిక పేర్కొంది. ప్రభుత్వ యాజమాన్యంలోని ఎల్ఐసి నుంచి డబ్బును మళ్లించడం ద్వారా అప్పుల ఊబిలో కూరుకుపోయిన గౌతమ్ అదానీ గ్రూప్‌ను రక్షించడానికి మోదీ ప్రభుత్వం నిశ్శబ్దంగా 3.9 బిలియన్ డాలర్ల ప్రణాళికను ఎలా రూపొందించిందో వాషింగ్టన్ పోస్ట్ దర్యాప్తు వివరించింది. గౌతమ్ అదానీకి ప్రభుత్వం బెయిలౌట్ ప్లాన్ వివరాలు అందించే అంతర్గ పత్రాలను పొందినట్లు పోస్ట్ పేర్కొంది. వాషింగ్టన్ పోస్ట్ రిపోర్టర్లు పొందిన అంతర్గత పత్రాల ప్రకారం, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ, దాని ఆర్థిక సేవల విభాగం (డిఎఫ్ఎస్), ఎల్ఐసి, విధాన మేథోమథన సంస్థ నీతి ఆయోగ్ సమన్వయంతో ఒక పెట్టుబడి వ్యూహాన్ని రూపొందించి... అదానీ గ్రూప్ బాండ్లు, ఈక్విటీలలోకి బిలియన్ల నిధులను మళ్లించాయని మే 2025లో పొందిన అంతర్గత పత్రాలు చూపిస్తున్నాయి. 'ఈ ప్రణాళికలో అదానీ పోర్ట్స్ కోసం 585 మిలియన్ డాలర్ల బాండ్ ఇష్యూ ఉంది. దీనికి ఎల్ఐసి మాత్రమే నిధులు సమకూర్చింది. అదానీ పోర్టుల అనుబంధ సంస్థ ప్రస్తుత రుణాన్ని తిరిగి చెల్లించడానికి బాండ్ జారీ ద్వారా దాదాపు 585 మిలియన్లను సేకరించాల్సిన అవసరం ఉన్న నెలలోనే ఈ ప్రణాళిక ఫలించింది. మే 30న అదానీ గ్రూప్ మొత్తం బాండ్‌కు ఒకే పెట్టుబడిదారుడు ఎల్ఐసి నిధులు సమకూర్చిందని ప్రకటించింది. ఈ ఒప్పందం ప్రజా నిధుల దుర్వినియోగమని విమర్శకులు వెంటనే ఖండించారు' అని ఆ నివేదిక పేర్కొంది. లక్షలాది మంది పేద, మధ్యతరగతి ఆదాయ భారతీయుల

తరువాయి 2లో



# లిక్కర్ షాపుల గడువు పెంపుపై హైకోర్టు తీర్పు రిజర్వ్

- షాపులు కేటాయిస్తే తీర్పుకు లోబడి ఉంటాయి
- హైకోర్టు స్పష్టీకరణ
- షాపుల కేటాయింపును నిలిపివేస్తూ స్టే ఇచ్చేందుకు నిరాకరణ

ప్రజాపక్షం/హైదరాబాద్

లిక్కర్ షాపులకు అప్లికేషన్ల గడువును ఈ నెల 18 నుంచి 23వ తేదీకి మార్పు చేయడాన్ని సవాలు చేసిన పిటిషన్లపై హైకోర్టులో శనివారం వాదనలు, ప్రతివాదనలు పూర్తయ్యాయి. తీర్పును తరువాత ప్రకటిస్తామని జస్టిస్ తుకారంజీ చెప్పారు. సోమవారంలోగా ఇరుపక్షాలు లిఖిత పూర్వక వాదనలు సమర్పించాలని ఆదేశించారు. తాము తీర్పు చెప్పేలోగా ప్రభుత్వం లిక్కర్ షాపుల కేటాయింపు చేస్తే ఆ కేటాయింపులు హైకోర్టు తీర్పుకు లోబడి ఉంటాయన్నారు. ఇదే సమయంలో గడువు పెంపు, షాపుల కేటాయింపు ప్రక్రియ

తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## చైనా–అమెరికా మధ్య ఆర్థిక,వాణిజ్య చర్చలు ప్రారంభం

**బీజింగ్ :** చైనా–అమెరికా మధ్య కౌలాలంపూర్‌లో ఆర్థిక, వాణిజ్య చర్చలు ప్రారంభమైనట్లు ఆ దేశ వాణిజ్యమంత్రిత్వశాఖ శనివారం ప్రకటించింది. రెండు దేశాల అధినేతల మధ్య జరిగిన ఫోన్ సంభాషణల నేపథ్యంలో ఈ సమావేశం ప్రారంభమైంది. చైనా ఉప ప్రధానమంత్రి హే లిఫెంగ్ నాయకత్వాన ఈ అధికార బృందం ఈ చర్చల్లో పాల్గొంటున్నది. హే లిఫెంగ్ చైనా కమ్యూనిస్టుపార్టీ సెంట్రల్ కమిటీ పొలిట్ బ్యూరో సభ్యుడు కూడా. మొన్న బీజింగ్‌లో ముగిసిన చైనా పంచవర్ష ప్రణాళిక ఖరారు సమావేశాలలో ఆయన కీలకపాత్ర వహించారు. ఇదిలా ఉండగా ట్రంప్ మొదటిపదవీకాలంలో ఉండగా చైనాతో జరిగిన వాణిజ్య యుద్ధాన్ని ముగించడానికి సంతకంచేసిన ఫేజ్–1 ఒప్పందాన్ని అమలు చేయడంలో చైనా విఫలమైందన్న పేరుతో అమెరికా వాణిజ్య కార్యాలయం కొత్త దర్యాప్తు ప్రారంభించింది. దీనిని చైనా తీవ్రంగా ఖండించింది. ఈ విధమైన తప్పుడు చర్యలు, తప్పుడు ఆరోపణలు మానుకోవాలని అమెరికాలోని చైనా రాయబార కార్యాలయం ట్రంప్ ప్రభుత్వాన్ని కోరింది.

## ట్రంప్–ఇయు చర్యలతో పెరుగుతున్న ఉద్రిక్తత

### ఉక్రేన్‌పై రష్యా దాడిలో ఇద్దరు మృతి



**మాస్కో:** ఉక్రేన్‌పై రష్యా శనివారం మరోసారి దాడి చేసింది. ఈ దాడుల్లో ఇద్దరు ఉక్రేనియన్లు మరణించారు. మరో ఎనిమిది మంది గాయపడ్డారు. కీవ్ ప్రాంత జిల్లా ల్లో అనేక చోట్ల రష్యా క్షిపణి దాడులతో మంటలు చెలరేగాయి. అనేకమందిని ఆసుపత్రులకు తరలించారు. డోనెట్స్క్ రీజియన్‌లో క్రాన్స్‌నోయార్‌మెస్కీ ప్రాంతంలో ఉక్రేన్ రక్షణ దళాలు కుప్పకూలాయని రష్యన్ డిఫెన్స్ వర్గాలు టాస్ వార్తాసంస్థకు తెలిపాయి. గడచిన ఇరవైనాలుగంటలలో ఉక్రేన్ మిలిటరీ, పారిశ్రామిక, ఇంధన కేంద్రాలపై దాడులు చేసిన ట్లు తెలిపాయి. గడచిన 24 గంటలలో నాలుగువైపులా జరుగుతున్న యుద్ధంలో దాదాపు 1,385 మంది ఉక్రేన్ సైనికులు మరణించారని తెలిపా యి. ఉత్తర ప్రాంతంలో 150 మంది సైనికులు మరణించారని, 230 యుద్ధ వాహనాలను ధ్వంసం చేశామని తెలిపాయి. రష్యన్ దళాలు ఈ ప్రాంతంలో ముందుకు ప్రయాణించడంలో పురోగతి సాధిస్తున్నాయి. రష్యాపై అమెరికా, యూరోపియన్ యూనియన్ కౌన్సిల్ వేరువేరుగా ఆంక్షలు విధించి లొంగదీసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసిన తర్వాత ఉక్రేన్‌పై రష్యా దాడులు ఉద్ధృతమవుతున్నాయి. అమెరికా, యూరప్‌దేశాలు ఎన్నిక ఆంక్షలు విధించినప్పటికీ రష్యా తన ఆర్థిక వ్యవస్థను నిలబెట్టుకుని నిలదొక్కుకోవడంలో స్వయంసమృద్ధి సాధించిందని క్రెమ్లిన్ వర్గాలు ఇప్పటికే ప్రకటించాయి.

**రష్యాను లొంగదీసేందుకు చైనా సహకారం**

రష్యాను లొంగదీసేందుకు చైనా సహకారాన్ని అడుగుతామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పారు. దక్షిణ కొరియాలో చైనా అధ్యక్షుడితో ఈనెలాఖరు తర్వాత సమావేశం, ఎపెక్ సదస్సులో భాగస్వామ్యం, జపాన్ కొత్త ప్రధానమంత్రి తకచి, జపాన్ చక్రవర్తితో సమావేశాల షెడ్యూలు నేపథ్యంలో ట్రంప్ మాట్లాడుతూ, ఉక్రేన్‌లో రష్యా యుద్ధం నిలిపివేసేందుకు చర్చల సందర్భంగా జిన్‌పింగ్ సహకారాన్ని అడుగుతానని అన్నారు. ఐతే జిన్‌పింగ్–పుతిన్ మధ్య స్నేహం కొనసాగే అవకాశం లేదని, కానీ తనకంటే ముందు అమెరికాను పాలించిన ఇద్దరి అధ్యక్షుల అసమర్థ నిర్ణయాలవల్ల పుతిన్–జిన్‌పింగ్ మధ్య మైత్రి పెరిగిందని ట్రంప్ ఇప్పటికే ఒక ప్రకటన చేశారు. పుతిన్ తనంతట తానుగా ఉక్రేన్‌తో శాంతి ఒప్పందానికి అనుకూల ప్రకటన చేసేవిధంగా పరిస్థితులను సృష్టించేందుకు రష్యాకు ఆర్థిక వనరులు లేకుండా కట్టడి చేయాలని అమెరికా–యూరప్ ప్రయత్నాలు చేస్తున్నాయి.

## థాయ్‌లాండ్ మాజీ మహారాణి మృతి



**బ్యాంకాక్:** అత్యంత ప్రభావశీలి, థాయ్‌లాండ్ మాజీ మహారాణి సిరికిట్ కన్నుమూశారు. యుద్ధానంతరం థాయ్‌లాండ్ పునరుజ్జీవంలో ముఖ్య పాత్ర పోషించడమేకాకుండా అప్పుడప్పుడు రాజకీయాలలో తన ప్రభావం చూపించి ఆ దేశానికి ఒక గాంభీర్యాన్ని, గ్లామర్‌ను సమకూర్చిన మహారాణి సిరికిట్ తన 93వ ఏట శుక్రవారం పొద్దుపోయాక మరణించారు. భర్త, దేశ చక్రవర్తి అదుల్యదేజ్‌తో కలిసి ఎన్నో దాతృత్వ కార్యక్రమాలు నిర్వహించి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారు. తన 17వ ఏట చక్రవర్తిని ఆమె వివాహం చేసుకున్నారు. దేశంలోని అన్ని గ్రామాలలో పర్యటించి గ్రామాల అభివృద్ధి కార్యక్రమాలను స్వయంగా పర్యవేక్షించారు. దేశ సంప్రదాయ కళలు, సంప్రదాయ వృత్తులు, సంప్రదాయ సిల్కు పరిశ్రమ అభివృద్ధి, సంరక్షణకు కృషి చేశారు.సిరికిట్ భర్త, రాజు భూమిబోల్ అదుల్యదేజ్ 1946 నుండి 70 సం.ల పాటు సింహాసనాన్ని అధిష్ఠించి సుదీర్ఘకాలం దేశాన్ని పాలించిన చక్రవర్తిగా రికార్డు సృష్టించారు. 2012లో గుండెపోటు వచ్చిన తర్వాత నుండి మహారాణి సిరికిట్ ప్రజాజీవితానికి దూరంగా ఉంటూ వచ్చారు. అనేక రకాల అనారోగ్యాలతో ఆమె 2019 నుండి చికిత్స పొందుతున్నారని రాయల్‌హౌస్‌హోల్డ్ బ్యూరో ప్రకటించింది. ఆమె మృతికి సంతాపసూచకంగా దేశంలో నెలరోజులపాటు విందులు, వినోద కార్యక్రమాలను అధికారికంగా రద్దుచేశారు. రాజకుటుంబీకులు, ప్రభుత్వ అధికారులు ఒక ఏడాదికాలంపాటు సంతాపదినాలు పాటిస్తారని బ్యూరో తెలిపింది. ఒక నెలరోజులు దేశ జాతీయ పతాకాన్ని సగం ఎత్తులో ఎగురవేసే ఏర్పాట్లు చేస్తారు. ఈ వారంలో కౌలాలంపూర్‌లో జరిగే ఏసియన్ శిఖరాగ్ర సమావేశానికి, వారం చివరిలో మొదలయ్యే ఎపెక్ శిఖరాగ్ర సదస్సు పర్యటనలను ప్రధానమంత్రి అనుతిన్ చార్న్‌విరాకుల్‌క్వెన్ మదర్ మరణం కారణంగా రద్దుచేసుకున్నారు.

## కొలంబియా దేశాధినేత హత్యకు ట్రంప్ యత్నాలు!

### గుస్తావో పెట్రో కుటుంబంపై ఆంక్షలు
### కరీబియన్‌లో కయ్యానికి కాలుదువ్వుతున్న అమెరికా








**వాషింగ్టన్:**కరీబియన్ సముద్రంలో కయ్యానికి కాలుదువ్వుతున్న అమెరికా, కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో (65)పై శనివారం ఆంక్షలు విధించింది. పెట్రో భార్య వెరోనికా అల్కోసెర్, కుమారుడు నికొలస్ పెట్రో, కొలంబియా దేశీయాంగమంత్రి అర్మండో బెనెడెట్టిలపై, వారి వీసాలపై నిషేధం విధించింది. అమెరికాలో ఉన్న ఆస్తులు తమ విదేశీమంత్రిత్వశాఖ పరిధిలోకి వస్తాయని ప్రకటించింది. కొలంబియాకు మద్దతు కొనసాగిస్తామని, ఆ దేశ నార్కోటిక్ విజిలెన్సు శిక్షణ ఇస్తామని చెబుతూ పెట్రోను మాత్రం వేరుచేసే ఒంటరిని చేసేవిధంగా ఆంక్షలు ప్రకటించింది. దీంతో పెట్రోకూడా తీవ్రంగా స్పందించారు. తన కుటుంబంపై తప్పుడు ఆరోపణలు చేసి తనను హత్య చేసేందుకు ట్రంప్ ప్రయత్నం చేస్తున్నారని ఎక్స్ వేదికగా పెట్రో ప్రకటించారు. గతంలో ఎన్నడూ లేనంతస్థాయిలో డ్రగ్స్ వ్యాపారంపై గడచిన మూడేళ్లుగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంది, ఈ ముఠాలను అణచివేసేందుకు తమ ప్రభుత్వ హయాంలో వారి కార్యకలాపాలు గణనీయంగా క్షీణించాయని గుస్తావో పెట్రో పేర్కొన్నారు. తమ కుటుంబాన్ని ఆస్తుల నియంత్రణ విభాగం(ఆఫీసు)జాబితాలో చేర్చారని కూడా ఆయన ధృవీకరించారు. దీంతో ఆ దేశంతో అమెరికా ద్వైపాక్షిక సంబంధాలు పూర్తిగా క్షీణించాయి.

కరీబియన్ జలాల్లో లాటిన్ అమెరికా వామపక్ష ప్రభుత్వాల కూల్చివేతే లక్ష్యంగా గడచిన ఆగస్టు నుండి ట్రంప్ ఉద్రిక్తతలు సృష్టించడం ప్రారంభించారు. కొలంబియా దేశంలో వినాశకర విధానాలు అనుసరించి కొకైన్ ఉత్పత్తులను గణనీయంగా పెంచారని, కరీబియన్ సముద్రంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా అరికట్టడంలో పెట్రో విఫలమయ్యారని, ఆయన ఒక డ్రగ్ లార్డ్ అని, మాదక ద్రవ్యాల ముఠాలను పెంచిపోషిస్తున్నారని ట్రంప్ ఆరోపించారు.

మాదక ద్రవ్యాల ముఠాలను అరికట్టడంలో అమెరికాతో కొలంబియా కీలక భాగస్వామిగా ఉంది. అమెరికా నుండి ప్రతి సంవత్సరం మిలియన్ల కొద్దీ డాలర్లు కూడా కొలంబియాకు సహాయంగా అందుతాయి. ఈ ధనాన్ని డ్రగ్స్ ముఠాలను అరికట్టేందుకు ఉపయోగించుకోవాల్సి ఉంది. కానీ లెఫ్ట్‌వింగ్ వ్యతిరేకి అయిన ట్రంప్ కొలంబియా వామపక్ష నేత పెట్రోపై తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. కొలంబియా దేశానికి మొట్టమొదటి వామపక్ష దేశాధినేతగా 2022లో అధికారం చేపట్టిన పెట్రోపై ట్రంప్ కక్ష కట్టారు.

**సరికొత్త యుద్ధం సృష్టిస్తున్న ట్రంప్ వెనిజులా అధ్యక్షుడు మదురో విమర్శ**

ఎంత సంయమనం పాటించినప్పటికీ ట్రంప్ ఉద్దేశపూర్వకంగా కరీబియన్ జలాల్లో యుద్ధాన్ని, సరికొత్త యుద్ధ పరిస్థితులను సృష్టిస్తున్నారని వెనిజులా అధ్యక్షుడు మదురో విమర్శించారు. దాదాపు 90కిపైగా యుద్ధ విమానాలను మోసుకు వెళ్ళగల మెగా 'యుఎస్ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డ్'నౌకను కరీబియన్ జలాల్లో మోహరించి బల ప్రదర్శన చేస్తున్నారని మదురో విమర్శించారు. డ్రగ్స్ బోట్లపై దాడుల పేరుతో ఇప్పటివరకూ పది బోట్లను అమెరికా సైన్యం ధ్వంసం చేసిందన్నారు. యుద్ధ వాతావరణాన్ని సడలించకపోతే తాము సొంత చర్యలు తీసుకుంటామన్నారు. దక్షిణ అమెరికా దేశాలను తాము సమీకృతం చేస్తామని, వాటిని ఏకతాటిపైకి తెస్తామన్నారు. దక్షిణ అమెరికా దేశాలు శాంతిని కోరుకుంటున్నాయని, యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్నాయని, కానీ ట్రంప్ యుద్ధం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

కరీబియన్ జలాల్లో అమెరికా సైన్యం డ్రగ్స్ వంకపెట్టి వామపక్ష ప్రభుత్వాలపై దాడులు చేస్తోంది. తాజా దాడుల్లో ఏడుగురు ప్రయాణికులను హతమార్చింది. దీంతో కరీబియన్ జలాల్లో డ్రగ్స్ అక్రమ రవాణా ఆరోపణలతో పడవలపై దాడులు చేసి 40 మంది వెనిజులా, కొలంబియా ప్రజలను అమెరికా హతమార్చింది. వెనిజులా నుండి తమకు తీవ్రమైన ముప్పు ఉందం టూ సైనికంగా బలహీనమైన ద్వీపదేశాలను దురాక్రమణచేసి ఆధిపత్యం చెలాయించాలనే సామ్రాజ్యవాద దృక్పథంతో కయ్యానికి కాలు దువ్వుతున్నారు.

## ఎల్‌ఐసికి ఎసరు!
(మొదటి పేజీ తరువాయి)

పొదుపులను నిర్వహించే ప్రభుత్వ యాజమాన్య బీమా సంస్థ అయిన ఎల్‌ఐసీ... అదానీ గ్రూప్ కార్పొరేట్ బాండ్లలో సుమారు 3.4బిలియన్ డాలర్లు, అదానీ గ్రీన్ ఎనర్జీ, అంబుజా సిమెంట్స్ వంటి అనుబంధ సంస్థలలో తన ఈక్విటీ వాటాలను పెంచడానికి మరో 507 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టాలని సూచించబడిందని నివేదిక పేర్కొంది. అయితే అదానీ బాండ్లు 10 సంవత్సరాల ప్రభుత్వ సెక్యూరిటీల కంటే 8.2 శాతం వరకు అధిక రాబడిని అందించాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ అధికారులు వాదించారు. ఈ ప్రణాళిక త్వరగా కార్యరూపం దాల్చింది. 30 మే 2025న, అదానీ పోర్ట్స్, ప్రత్యేక ఆర్థిక మండలి (ఏపీసెజ్) ప్రస్తుత రుణాన్ని తిరిగి చెల్లించడానికి రూ.5,000 కోట్ల (లేదా 585 మిలియన్ డాలర్లు) బాండ్ ఇష్యూను ప్రకటించింది. మొత్తం ఇష్యూను ఒకే పెట్టుబడిదారుడు ఎల్‌ఐసీ సబ్‌స్క్రైబ్ చేసుకున్నాడని వాషింగ్టన్ పోస్ట్ కథనం నివేదించింది. ఇది తక్షణ రాజకీయ వ్యతిరేకతను ఎదుర్కొంది. గత సంవత్సరంతో పోలిస్తే అదానీ గ్రూప్‌నకు చెందిన 20 శాతం రుణ పెరుగుదల, అలాగే కొనసాగుతున్న అమెరికా అవినీతి, మోసం ఆరోపణలు ఉన్నప్పటికీ, అదానీపై 'విశ్వాసాన్ని సూచించడం', ఇతర పెట్టుబడిదారులను ఆకర్షించడం ఈ ప్రతిపాదన పేర్కొన్న లక్ష్యాలలో ఉన్నాయి. ఇంధన కాంట్రాక్టులను గెలుచుకోవడానికి తప్పుడు ప్రకటనలు, 250 మిలియన్ డాలర్ల అక్రమ చెల్లింపులతో కూడిన బహుళ బిలియన్ డాలర్ల లంచం, మోసం పథకంలో అదానీ, అదానీ సహచరులపై అమెరికా న్యాయ విభాగం, సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ) అభియోగాలు మోపింది. అయితే ఈ ఆరోపణలు 'నిరాధారమని' అదానీ ఖండించారు. ఈ అక్టోబరులో అదానీ గ్రూప్ కార్య నిర్వాహకులకు సమన్లు, ఫిర్యాదులను అందించాలన్న తన అభ్యర్థనలపై భారత అధికారులు చర్య తీసుకోవడంలో విఫలమయ్యారని ఎస్ఈసీ తెలిపింది. అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ 2023 నివేదికలో అదానీ గ్రూప్ వాటాల తారుమారు, ఆర్థిక అవకతవకలకు పాల్పడిందని పేర్కొంది. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) జరిపిన దర్యాప్తులో ఈ ఏడాది సెప్టెంబరులో రెండు ఆరోపణలను తోసిపుచ్చింది. అయితే అప్పటి నుంచి హిండెన్‌బర్గ్ తన ఆరోపణలను నిలిపివేసింది. కానీ అదానీ గ్రూప్ పతనం ఇతరమార్గాల్లో స్పష్టంగా కొనసాగుతోంది. అదానీ రుణాల కోసం వెతుకుతున్న అనేక ప్రధాన అమెరికన్, యూరోపియన్ బ్యాంకులు ఈ పరిస్థితులలో సహాయం చేయడానికి వెనుకాడాయని వాషింగ్టన్ పోస్ట్ నివేదిక తెలిపింది. అదానీని 'దార్శనిక వ్యవస్థాపకుడు' గా అభివర్ణించిన భారతీయ అధికారులుకూడా ఈ అంతర్గత పత్రాల్లో ఉన్నారు. అదానీ ఓడరేవులు, విద్యుత్, మౌలిక సదుపాయాలను విస్తరించి ఉన్న వ్యాపారాలను జాతీయ ఆర్థిక లక్ష్యాలకు కీలకమైనవిగా భావించారని ఆ పత్రాలు పేర్కొన్నాయి.

**ఈ సర్కార్ అదానీకి హాని జరగనివ్వదు**

'ఈ ప్రభుత్వం అదానీకి మద్దతు ఇస్తుంది. దానికి ఎటువంటి హాని లేదా హాని జరగనివ్వదు' అని స్వతంత్ర కార్పొరేట్ ఫైనాన్స్ నిపుణుడు హేమింద్ర హజారీ వాషింగ్టన్ పోస్ట్‌తో అన్నారు. పేదల, గ్రామీణ పౌరులకు ఎక్కువగా జీవిత బీమాను అందించే ఎల్‌ఐసీ ఒక ప్రైవేట్ కంపెనీలో ఇంత పెద్ద మొత్తాలను పెట్టుబడి పెట్టడం 'అసాధారణం' అని హజారీ అన్నారు. 'ఎల్‌ఐసీకి ఏదైనా జరిగితే... ప్రభుత్వం మాత్రమే దానిని ఆదుకోగలదు' అని తెలిపారు. మోదీకి అదానీతో ఉన్న సన్నిహిత సంబంధాలే ప్రతిపక్ష నాయకులు, పౌర సమాజ సభ్యులతో సహా అనేక వర్గాల నుండి ఆరోపణలకు కేంద్రంగా ఉన్నాయి. కానీ అదానీ గ్రూప్ ఇటువంటి ఆరోపణలను 'భారతదేశానికి వ్యతిరేకంగా కుట్ర'గా అభివర్ణించింది. వాషింగ్టన్ పోస్ట్ ప్రకారం, పరిశీలకులు ఈ బెయిల్ అవుట్‌నుభారతదేశానికి చెందిన లోతయిన కార్పొరేట్‌ప్రభుత్వ సంబంధానికి రుజువుగా చూస్తున్నారు. ఇదిలా ఉండగా, హౌతీ తిరుగుబాటుదారుల నుంచి బెదిరింపులను ఎదుర్కొన్న ఇజ్రాయెల్‌లోని హైఫా ఓడరేవులో ఆయన వాటాతో సహా అదానీ వెంచర్‌లకు సంబంధించిన భౌగోళిక రాజకీయ నష్టాలను పోస్ట్ దర్యాప్తు ప్రత్యేకంగా ప్రస్తావించింది. రాజకీయ పరిణామాల గురించి భారత అధికారులకు తెలుసునని పేర్కొంది. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం వంటి ప్రతిపక్ష పార్టీలు మోదీ ప్రభుత్వం అదానీకి అనుకూలంగా ఎల్‌ఐసీ నిధులను దుర్వినియోగం చేస్తోందని చాలా కాలంగా ఆరోపిస్తున్నాయని నివేదిక వెల్లడించింది. అయితే ఎల్‌ఐసీ నిధులను పొందాలనే ప్రభుత్వ ప్రణాళికలలో తమ ప్రమేయం లేదని అదానీ గ్రూప్ స్పష్టంగా ఖండించింది. ఎల్‌ఐసీ బహుళ కార్పొరేట్ గ్రూపులలో పెట్టుబడులు పెడుతుందని, అదానీ కంపెనీలకు దాని ప్రదర్శన ద్వారా రాబడిని సంపాదించిందని కూడా పేర్కొంది. కాగా, ఎల్‌ఐసీ, డీఎఫ్ఎస్, ప్రధానమంత్రి కార్యాలయం ఈ వ్యవహారంపై ఇంతవరకు స్పందించలేదు. ఈ వ్యవహారం భారతదేశ 'ఆశ్రిత పెట్టుబడిదారీ విధానానికి' ఉదాహరణగా చూపుతుందని, ఇక్కడ ప్రభుత్వ మద్దతు రాజకీయంగా ప్రభావవంతమైన వ్యాపార సమూహాలను ఆర్థిక ప్రమాదం నుంచి కాపాడుతుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. 'అదానీ వేరే నియమాల ద్వారా పనిచేయడానికి అనుమతించబడింది' అని ఆస్ట్రేలియాకు చెందినమేథో మథన సంస్థ క్లైమేట్ ఎనర్జీ ఫైనాన్స్ డైరెక్టర్ టిమ్ బక్లీ వాషింగ్టన్ పోస్ట్‌తో అన్నారు. 'క్రోనీ క్యాపిటలిజం సజీవంగా, చురుకుగా ఉంది' అని తెలిపారు. భారతదేశంలోని అత్యంత శక్తివంతమైన, రాజకీయంగా అనుసంధానించబడిన వ్యాపారవేత్తలలో ఒకరి సంపదను స్థిరీకరించడానికి ప్రభుత్వ ఆర్థిక సంస్థలను ఎలా ఉపయోగిస్తున్నారో మోదీ ప్రభుత్వం ప్రదర్శిస్తోందని నివేదిక తేల్చింది. చివరికి పన్ను చెల్లింపుదారులు ఈ నష్టాన్ని భరిస్తున్నారు.

## యాదాద్రి పవర్ ప్లాంట్
(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ ప్రధాన కార్యాలయం లో టిజి ట్రాన్స్ కో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణ భాస్కర్, జెన్ కో చైర్మన్ ,మేనేజింగ్ డైరెక్టర్ హరీష్, సింగరేణి కాలరీ చైర్మన్,మేనేజింగ్ డైరెక్టర్ బలరాం, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్,మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ రెడ్డి,రెడ్ కో వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అనిలతో పాటు విద్యుత్ సంస్థల డైరెక్టర్లు, చీఫ్ ఇంజినీర్లు, సూపెరింటెండింగ్ ఇంజినీర్లతో నిర్వహించిన సమావేశంలో రబి,సమ్మర్ విద్యుత్ డిమాండ్ అంశాలపైన శనివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్ మిట్టల్ మాట్లాడుతూ ఈ ఏడాది గరిష్ట డిమాండ్ 17162 మెగావాట్లకు చేరినా, విద్యుత్ సంస్థలు ముందస్తుగా తీసుకున్న చర్యలతో విద్యుత్ సరఫరాలో ఎక్కడాఓవర్ లోడింగ్ సమస్యలు తలెత్తలేదన్నారు. వినియోగదారులకు మరింత మెరుగైన పారదర్శక సేవలు అందించేందుకుఎల్‌టి/11 కెవినెట్వర్క్ స్థాయిలో ట్రాన్స్ ఫార్మర్ల, ఫీడర్ల నిర్వహణలో ఆటోమేషన్ విధానం అమలులోకి తీసుకురావాలని సిఎండిలకు నవీన్ మిట్టల్ సూచించారు. దక్షిణ డిస్కం పరిధిలో నివహిస్తున్న ఫీడర్ ఔటేజ్ మేనేజ్మెంట్ మంచి ఫలితాలు ఇస్తున్నదని, ఇదే విధానం అన్ని స్థాయిల్లో అమలు చేయాలని ఆదేశించారు. పిఎం ఈ డ్రైవ్ లో భాగంగా ఎలక్ట్రిక్ వెహికల్ (ఇవి) ఛార్జింగ్ స్టేషన్‌లకు ఇస్తున్న రాయితీలను ప్రభుత్వ సంస్థలు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేలా అవగాహనా కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్‌ను ఎలక్ట్రిక్ వెహికిల్(ఇవి) హబ్‌గా మార్చ డంలో విద్యుత్ సంస్థలు, రెడ్ కో సంయుక్తంగా ముందుకు వెళ్లాలన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో భారీగా పెరుగుతున్న ఈ వాహనాల సంఖ్యకు తగినట్లు ఇవి ఛార్జ్ స్టేషన్లు ఏర్పాటు చేసి హైదరాబాద్ ను దేశానికి ఇవి వాహనాల రాజధానిగా మార్చాలని సిఎండిలకు సూచించారు.

వచ్చే ఏడాది 19వేల మెగావాట్లు పెరిగే అవకాశం

వచ్చే ఏడాది (2026) సమ్మర్/ రబి సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా గరిష్ట డిమాండ్ 19 వేల మెగావాట్లకు పెరిగే అవకాశం ఉన్నందున రబి ప్రారంభానికి ముందే తలపెట్టిన లైన్ల మరమ్మతులు, కొత్త ట్రాన్స్ ఫార్మర్లల ఏర్పాటుతో పాటు, ఇతర అభివృద్ధి పనులన్నీ డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని చీఫ్ ఇంజినీర్లకు, సూపెరింటెండింగ్ ఇంజినీర్లకు నవీన్‌మిట్టల్ దిశా నిర్దేశం చేశారు.

వచ్చే ఏడాది భారీగా డిమాండ్ పెరిగే నేపథ్యంలో దక్షిణ డిస్కం పరిధిలో 72, ఉత్తర డిస్కం పరిధిలో 31 నూతన సబ్ స్టేషన్ ల ఏర్పాటు, ట్రాన్స్ కో పరిధిలో 181 ఇహెచ్‌టి సబ్ స్టేషన్లలో ఉన్న పవర్ ట్రాన్స్ ఫార్మర్ల సామర్థ్యం పెంచుతున్నామన్నారు. అదనంగా దక్షిణ డిస్కం లో 8384, ఉత్తర డిస్కం లో 5280 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేయనున్నారు. ఇహెచ్‌టి/33/11 నూతన లైన్లు, 33/132/220/400 కెవిసబ్ స్టేషన్‌ల గల పిటిఆర్‌ల సామర్థ్యం పెంచే దిశగా చర్యలు ప్రారంభించామని ఆయన వివరించారు. తెలంగాణ జెన్ కో పరిధిలోని విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల ఓవర్ హాలింగ్ దాదాపు అన్ని యూనిట్లలో పూర్తయ్యిందని, బిటిపిఎస్, కెటిపిఎస్ 4 ప్లాంట్ల ఓవర్ హాలింగ్ త్వరలో పూర్తి చేయనున్నారని తెలిపారు.

దక్షిణ డిస్కం పరిధిలోని ఈ డ్రైవ్‌లో భాగంగా చేస్తున్న సర్వేలో అక్టోబర్ 25 నాటికి 3121 ప్రాంతాల్లో ఇవి ఛార్జింగ్ స్టేషన్‌ల ఏర్పాటుకు స్థలాలు గుర్తించామని, ఈ సంఖ్య మరింతగా పెరిగే అవకాశమున్నదని దక్షిణ డిస్కం సిఎండి ముషారఫ్ ఫరూఖీ వివరించారు.

సింగరేణి సిఎండి బలరాం మాట్లాడుతూప్రస్తుతం 1.80 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తున్నామని, నవంబర్ నాటికి ప్రతి రోజు 2.20 మిలియన్ టన్నుల ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. రబి, సమ్మర్ నాటికి, రాష్ట్ర జెన్ కో పరిధిలోని బొగ్గు ఆధారిత ప్లాంట్లకు బొగ్గు సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా తగు చర్యలు చేపడుతున్నామన్నారు.

## కాల్పుల కలకలం
(మొదటి పేజీ తరువాయి)

ఆగిపోయింది. అదే సమయంలో వీరి వాహనం ముందు ఆగివున్న ఒక ద్విచక్ర వాహనదారుడి జేబులోంచి ఓ దొంగ సెల్‌ఫోన్ లాక్కుని ఆటో ఎక్కి పారిపోతున్న దృశ్యం డిసిపి కంట పడింది. వెంటనే యూనిఫామ్‌లో ఉన్న డిసిపి, గన్‌మెన్‌లు కారు దిగి దొంగను వెంబడించారు. పోలీసులు వస్తున్నారని తెలుసుకున్న దొంగ ఆటో దిగి విక్టరి ప్లేగ్రౌండ్ పక్కనే ఉన్న బస్తీలోకి పరుగెత్తాడు. అతని వెనకాలే డిసిపి, గన్‌మెన్‌లు సుమారు 200 మీటర్ల దూరం వరకు పరిగెత్తారు. తప్పించుకునే అవకాశం లేకపోవడంతో తన వద్ద ఉన్న కత్తితో దొంగ ముందుగా గన్‌మెన్‌పై దాడికి దిగబడ్డాడు.. ఆ తరువాత డిసిపిపైకి కూడా కత్తితో దాడి చేయబోయాడు. ఇంతలో డిసిపి తన గన్‌మెన్ వద్ద ఉన్న 9ఎంఎం పిస్తోల్ తీసుకుని దొంగపై మూడు రౌండ్లు కాల్పులు జరిపాడు. దొంగ కుడి చేతికి, ఛాతి కుడివైపు పక్కటెముకలలో బుల్లెట్లు దూసుకుపోవడంతో కింద పడిపోయాడు. వెంటనే అతని వద్ద ఉన్న కత్తిని స్వాధీనం చేసుకుని చికిత్స నిమిత్తం మలక్‌పేట యశోద ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం అతనికి ప్రాణాపాయం లేదు. పక్కటెముకల్లో దూసుకుపోయిన బుల్లెట్‌ను తీసివేసేందుకు డాక్టర్లు ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**ఆ దొంగ రౌడీషీటర్ ఉమర్ అన్సారీ..**

డిసిపి కాల్పుల్లో గాయడిన దొంగ గురించి ఆరా తీయగా అతను కాలాపత్తర్‌కు చెందిన రౌడీషటర్ ఉమర్ అన్సారీ (30)గా తేలింది. పదేళ్ల నుంచి ఇతడు దొంగతనాలకు పాల్పడుతున్నాడని, పలు మార్లు అరెస్టు అయి జైలుకు కూడా వెళ్లి వచ్చాడని పోలీసుల దర్యాప్తులో తేలింది. ఇతనిపై మొత్తం 16 దొంగతనాల కేసులు ఉన్నాయని పోలీసులు చెబుతున్నారు.

**ఆత్మరక్షణ కోసమే కాల్పులు: సజ్జనార్**

హైదరాబాద్ చాదర్ ఘాట్లో జరిగిన కాల్పుల ఘటనపై సిటీ సీపీ వి.సి సజ్జనార్ స్పందించారు. ఇవాళ చాదర్ ఘాట్ విక్టోరియా గ్రౌండ్ సమీపంలో ఇద్దరు దొంగలు సెల్ ఫోన్ దొంగతనం చేస్తూ పారిపోతుండగా వారిని అక్కడే తన సిబ్బందితో ఉన్న సౌత్ ఈస్ట్ డిసిపి చైతన్య పట్టుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఒక దొంగ తన వద్ద ఉన్న కత్తితో కానిస్టేబుల్‌పై దాడికి ప్రయత్నించారని చెప్పారు. ఈ క్రమంలో ఆత్మరక్షణలో భాగంగా డిసిపి చైతన్య దొంగలపై రెండు రౌండ్లు కాల్పులు జరిపారని ఈ ఘటనలో ఓ దొంగకు గాయాలైనట్లు చెప్పారు. గాయపడిన దొంగను ఆసుపత్రికి తరలించామని ఈఘటనలో డిసిపితో పాటు మిగతా పోలీసు సిబ్బంది అంతా క్షేమంగా ఉన్నట్లు చెప్పారు. ఈ దొంగలు ఎవరు? వారి వెనుక ఉన్న ముఠా ఏమిటి అనేది తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నామన్నారు.

## ఆర్‌టిఏ కొరడా
(మొదటి పేజీ తరువాయి)

వారం రోజులు పాటు స్పెషల్ డ్రైవ్‌లు కొనసాగునున్నాయి. మరోవైపు కర్నూల్ ప్రమాదం తరువాత ప్రైవేట్ బస్సుల యాజమాన్యాలు అప్రమత్తమయ్యారు. లోటుపాట్లు పట్టించుకోకుండా బస్సులు నడిపితే సీజ్ అయ్యే అవకాశం ఉండటంతోఫిట్‌నెస్‌లేని బస్సులను పెద్ద ఎత్తున నిలిపివేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ఆర్‌టిఏ బృందాల విస్తృత తనిఖీలలో బస్సుల నిర్వహణలో నిర్లక్ష్యం వెలుగుచూసే అవకాశం ఉండటంతో యాజమాన్యాలు బస్సులు నడిపేందుకు జంకుతున్నాయి. తనిఖీల్లో లోసుగులు బయటపడితే బస్సులు సీజ్ అయ్యే అవకాశం ఉండటంతో పార్కింగ్ యార్డులకే పరిమితం చేస్తున్నారు. ముందుగా బుక్ చేసిన టికెట్లను కూడా ప్రైవేటు ట్రావెల్స్ రద్దు చేస్తున్నాయి. వీకేండ్ కావడంతో ప్రైవేటు ట్రావెల్స్‌లో ప్రయాణికులు భారీగా బుకింగ్ చేసుకున్నారు. అయితే ఫిట్‌నెస్ లేని బస్సులు, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బస్సులపై ఆర్‌టిఏ చర్యలకు ఉపక్రమించడంతో భారీగా బస్సులను యాజమాన్యాలు నిలిపివేస్తున్నాయి.

**ఆర్‌టిసి బస్సులకు ప్రయాణికుల తాకిడి..**

ప్రైవేట్ బస్సు సర్వీసులను యాజమాన్యాలు రద్దు చేయడంతో ప్రయాణికులు ఆర్‌టిసి బస్సులను ఆశ్రయిస్తున్నారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు పెద్ద ఎత్తున బుకింగ్‌లను రద్దు చేయడంతో ఆర్‌టిసికి ప్రయాణికుల రద్దీ పెరిగింది. దీంతో ఆర్‌టిసికి ఊహించని విధంగా గిరాకీ పెరిగింది. టిజిఎస్ ఆర్‌టిసి యాజమాన్యం రద్దీకి అనుగుణంగా బస్సులను సర్వీసులను నడిపించాల్సి ఉంటుంది. ప్రమాదాల నేపథ్యంలో ప్రయాణికులు సైతం ఆర్‌టిసి బస్సులలో ప్రయాణించేందుకే మొగ్గుచూపుతున్నారు.

## బస్సు ప్రమాదంపై దర్యాప్తు
(మొదటి పేజీ తరువాయి)

తుగ్గలిలో వదలటానికి బయలు దేరారన్నారు. మార్గ మధ్యంలో పల్సర్ బైక్ కియా షోరూం సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద 2.24 గంటలకు రూ.300 పెట్రోల్ పట్టించుకుని బయలు దేరాడని తెలిపారు. బయలుదేరిన కొద్ది సేపటికి చిన్నటేకూరు సమీపంలో శివశంకర్ బైక్ నడుపుతూ స్కిడ్ అయి రోడ్డుకు కుడి పక్కన ఉన్న డివైడర్‌ను ఢీ కొట్టాడంతో బైక్ నడుపుతున్న శివశంకర్ అక్కడికక్కడే మతి చెందాడని తెలిపారు. వెనుకాల ఉన్న ఎర్రిస్వామి చిన్న గాయాలతో బయట పడ్డాడన్నారు. ప్రమాద ఘటన స్థలం దగ్గర రోడ్డు మధ్యలో నుండి శివశంకర్‌ను ఎర్రిస్వామి బయటికి లాగి శ్వాస చూడగా మృతి చెందినట్లు అతను నిర్ధార్ధించుకుని రోడ్డుపై పడి ఉన్న బైక్‌ను తీద్దామనుకునే సమయంలో అంతలోనే బైక్‌ను బస్సు వచ్చి ఢీ కొట్టి కొద్ది దూరం ఈడ్చు కెళ్ళిందన్నారు. బస్సు కింద మంటలు రావడంతో అక్కడి నుండి ఎర్రిస్వామి బయపడి తన స్వంత ఊరైనా తుగ్గలికి వెళ్ళినట్లు తెలిపారన్నారు. ఈప్రమాద విషయంపై ఉలిందకొండ పోలీసులు కేసు నమోదు చేశారని, తదుపరి విచారణ దర్యాప్తును కొనసాగిస్తున్నామని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రకటనలో వెల్లడించారు.

## అధ్వానం
(మొదటి పేజీ తరువాయి)

ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులతో సమీక్షించారు. ఈ ఘటనలో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురికావడానికి బాధ్యులను గుర్తించి 24 గంటల్లో నివేదిక ఇవ్వాలని టీఎస్ఎంఎస్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ ను ఆదేశించారు. అయితే ఆ నివేదిక అందినా ఎంజీఎం వైద్యాధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ప్రభుత్వ ఉదాసీనత వైఖరిని స్పష్టం చేస్తోందన్న విమర్శలున్నాయి.

**గతంలో ఎంజీఎంలో శవాలు తారుమారు..!**

వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంమూలంగా మృతదేహాలు మారిన ఘటనలో బిగ్ ట్విస్ట్ చోటు చేసుకుంది. చనిపోయాడని అంత్యక్రియలకు సిద్ధమైన బంధువులకు పోలీసులు మరో ట్విస్ట్ ఇచ్చారు.చనిపోయాడని భావించిన కుమారస్వామి బతికే ఉన్నాడని తేల్చి చెప్పారు. ప్రస్తుతం ఆయన ఎంజీఎం ఆసుపత్రి లోనే చికిత్స పొందుతూ ఉన్నారని వెల్లడించారు. గతంలో ఎంజీఎం ఆస్పత్రిలో పేషంట్ల రిజిస్ట్రేషన్ల వివరాలు కూడా సరిగా పొందు పర్చకపోవడంతో శవాలు తారుమారయ్యాయి. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం వెలికట్టె గ్రామానికి చెందిన గోక కుమారస్వామి రోడ్డు ప్రమాదంలో గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. మూడు రోజులు చికిత్స పొందిన తర్వాత మరణించాడని ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి. పోస్టుమార్టం అనంతరం శవాన్ని బంధువులకుఅప్పగించారు. తర్వాత చివరి చూపు చూసేందుకు శవపై కప్పిన క్లాత్ ను తొలగించి చూశాక అంతా షాక్ అయ్యారు. అతను మా నాన్న కాదని కుమారస్వామి కూతురు స్పష్టంగా చెప్పడంతో తిరిగి శవాన్ని మార్చురీకి చేర్చారు. అక్కడి సిబ్బందితో వాగ్వాదానికి దిగడంతో పాటు అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## బయట పెట్టిన హైడ్రా..
(మొదటి పేజీ తరువాయి)

ప్రజావసరాలకు ఉద్దేశించిన 4300 గజాల స్థలాన్ని శనివారం కాపాడారు. కొండాపూర్ డివిజన్ పరిధిలోని రాజరాజేశ్వరి కాలనీలో 1978లో చింతల పోచయ్య గ్రామ పంచాయతీ లేఅవుట్‌లో మొత్తం 350 ప్లాట్లు ఏర్పాటు చేశారని ఇక్కడ పాఠశాల భవనంతో పాటు ఇతర అవసరాల కోరకు 4300 గజాల స్థలాన్ని కేటాయించారు. అ వెంచర్‌లో ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ వేల్ఫేర్ సోసైటీ ఆధ్వర్యంలో కోనుగోళ్ళు చేశారని తెలిపారు. తరువాత పోచయ్య కుటుంబ సభ్యులు రాజు 3 భాగాలుగా విడదీసి కొళ్ళ మాధవరెడ్డి కుటుంబానికి తప్పుడు డాక్యుమెంట్స్‌తో అమ్మేసారంటూ కాలనీ ప్రతినిధులు అప్పట్లోనే జిహెచ్‌యంసిలో ఫిర్యాదులు చేశారు. ఏన్ని సార్లు జిహెచ్‌యంసిలో ఫిర్యాదు చేసిన ఫలితం లేకపోవడంతో హైడ్రా కమీషనర్ రంగానాథన్ ను కలసి ప్రజావాణిలో కాలనీ ప్రతినిధులు ఫిర్యాదు చేశామని వేంటనే స్పందించిన రంగానాథన్ ఆదేశాల మేరకు సంబంధిత అధికారులతో హైడ్రా క్షేత్ర స్థాయిలో పరీశీలించి అక్రమణలు నిజమే అని నిర్ధారించుకున్నాక హైడ్రా కమీషనర్ రంగానాథన్ అదేశాలతో శనివారం అక్రమణలు తోలగించి అక్రమణదారులపై కేసులు నమోదు చేసి తమను కాపాడారని కాలనీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ వెల్ఫేర్ సోసైటీలో పాఠశాల భవనంతో పాటు ఇతర అవసరాల కోరకు 4300 గజాల స్థలాన్ని కాపాడిన హైడ్రా అధికారులకు కాలనీ వేల్ఫేర్ అసోసియేషన్ కృతజ్ఞతలు తెలిపారు.

## మోంతా తుపాను
(మొదటి పేజీ తరువాయి)

తీరం దాటుతుందని, ప్రస్తుతానికి మచిలీపట్నం–కళింగపట్నం మధ్య కాకినాడ సమీపంలో తీరాన్ని దాటే అవకాశాలు కనిపిస్తున్నాయని తెలిపింది. తీరందాటే సమయంలో గరిష్టంగా గంటకు 90 నుంచి110 కి.మీ వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని, కాబట్టి తీరప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా ఆంధ్ర ప్రదేశ్ (ఎపి)లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ వాయుగుండం, తుపాను ప్రభావంతో ఇవి మరికొన్నిరోజులు కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. మోంతా తుపాను ఏర్పడిన తర్వాత అత్యంత భారీ వర్షాలు మొదలవుతాయని, అక్టోబర్ 27 నుండి 29 వరకు కుండపోత తప్పదని పేర్కొంది.

## తీవ్ర వాయుగుండం
(మొదటి పేజీ తరువాయి)

అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపారు. కొన్నిచోట్ల భారీ వర్షాలు నమోదయ్యే సూచనలున్నాయన్నారు. ఈ మేరకు శనివారం సాయంత్రం విడుదల చేసిన ఒక ప్రకటనలో అధికారులు వెల్లడించారు. ఈనెల 26న ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి సహా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయన్నారు. ఈనెల 27 నుంచి వర్షాల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఉత్తర, ఈశాన్య జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశంఉందని అధికారులు హెచ్చరించారు. దక్షిణ తెలంగాణ జిల్లాలైన ఖమ్మం, మహబూబాబాద్, నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్‌లకు ఎల్లోహెచ్చరికలు జారీ చేశామన్నారు. ఈనెల 28, 29 తేదీల్లో పెద్దపల్లి, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్‌తో పాటు పలు ఉమ్మడి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఎసిబి వలలో డిప్యూటీ రిజిస్ట్రార్




ప్రజాపక్షం/మంచిర్యాల : సస్పెండైన ఉద్యోగికి అనుకూలంగా వ్యవహరించేందుకు లంచం డిమాండ్ చేసిన మంచిర్యాల జిల్లా సహకార సంఘాల డిప్యూటీ రిజిస్ట్రార్ రాథోడ్ భిక్కును అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అధికారులు పట్టుకున్నారు. శనివారం ఉదయం మంచిర్యాల పట్టణంలోని ఆయన అద్దె ఇంటిపై ఎసిబి బృందం దాడి నిర్వహించి, రూ.2 లక్షలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. ఎసిబి డిఎస్‌పి జి. మధు తెలిపిన వివరాల ప్రకారం... గతంలో సస్పెండ్ అయిన ఓ ఉద్యోగిని తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవడం, జీతాలు చెల్లించడం వంటి వాటి కోసం రాథోడ్ మొత్తం రూ.5 లక్షలకు ఒప్పందం చేసుకున్నాడు. తొలి విడతగా రూ.2 లక్షలు తీసుకుంటుండగా అధికారులు పట్టుకున్నారు. రాథోడ్ రసాయన పరీక్షలో పాజిటివ్‌గా తేలిందని అధికారులు స్పష్టం చేశారు. ఆయనను అరెస్టు చేసి కరీంనగర్ ఎసిబి ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. కేసు దర్యాప్తు కొనసాగుతున్నదని అధికారులు వెల్లడించారు.

# నిరుద్యోగులను నిండా ముంచిన బిఆర్‌ఎస్‌ను నిలదీయండి

‘నిరుద్యోగ కార్డ్’ పేరుతో నిరుద్యోగ రాజకీయ నాయకుల డ్రామాలు...

ప్రతి మండలాన్ని ఆదర్శమండలంగా ఎంపిడిఒలు తీర్చిదిద్దాలి : మంత్రి సీతక్క



ప్రజాపక్షం/హైదరాబాద్: పదవులు కోల్పోయి నిరుద్యోగులుగా మారిన కొందరు రాజకీయ నాయకులు ఇప్పుడు ‘నిరుద్యోగ కార్డులు’ అంటూ డ్రామాలు ఆడుతున్నారని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క విమర్శించారు. నిరుద్యోగులను నిండా ముంచిన బిఆర్‌ఎస్ నాయకులను నిలదీయాలని నిరుద్యోగులకు సూచించారు. ప్రతి మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పని చేయాలని, ప్రజలతో సత్సంబంధాలను కొనసాగిస్తూ, క్షేత్రస్థాయిలో పర్యటనలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపిడిఒలకు ఆమె సూచించారు. రాజేంద్రనగర్‌లోని తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (టిజిఐఆర్‌డి) ఆడిటోరియంలో డిపిఒ, ఎంపిడిఒ శిక్షణ ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రూప్1 పరీక్ష ద్వారా ఎంపికై, రెండు వారాల పాటు శిక్షణ పూర్తి చేసుకున్న డిపిఒ, ఎంపిడిఒలకు మంత్రి సీతక్క ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీధర్, డైరెక్టర్ సృజన, టిజిఐఆర్‌డి సిఇఒ నిఖిల పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధిలో ఎంపిడిఒల పాత్ర ఎంతో కీలకమని, మండల స్థాయిలో అన్ని శాఖలను సమన్వయం చేస్తూ అభివృద్ధి దిశగా నడిపించాల్సిన బాధ్యత ఎంపిడిఒలదేనని అన్నారు. ప్రజలను ముందుగా ప్రేమించాలని, వారి బాధలను అర్థం చేసుకోవాలని, అప్పుడు మాత్రమే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది సీతక్క తెలిపారు. మండల సమగ్ర స్వరూపం, శాఖల వారీగా పరిస్థితులు ఎంపిడిఒల చేతుల్లో ఉండాలని, ప్రగతి నివేదికలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎంతో కష్టపడి లక్షలాది మందితో పోటీ పడి గ్రూప్ 1 ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు అదే పట్టుదలతో ఉద్యోగ విరమణ వరకు ప్రజాసేవలో నిలబెట్టుకోవాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. మండలాభివృద్ధి ప్రదాతలు ఎంపిడిఒలని, చివరి మనిషికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరాలంటే ఎంపిడిఒలు ముందుండాలి. అసలైన అర్హులను గుర్తించి వారికి సహాయం చేయాలని సూచించారు. ఉద్యోగ బాధ్యత నెరవేర్చే క్రమంలో ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా తల్లిదండ్రుల ఆశయాలను నిలబెట్టాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటి గ్రూప్ 1 బ్యాచ్ అని, అందుకే తెలంగాణ చరిత్రలో ‘మీకు’ (ఎంపిడిఒలకు) ప్రత్యేక స్థానం ఉందని అభినందించారు. పదేళ్ల నిరీక్షణకు ఇప్పుడు ఫలితం దొరికిందని, ప్రజా ప్రభుత్వం ప్రతిభావంతులకు ఉద్యోగా అవకాశాలు కల్పించిందని వివరించారు. శ్రీధర్, సృజన మాట్లాడుతూ ఫ్లెక్సిబుల్ మైండ్‌తో, నిబద్ధతతో ప్రజలకు సేవ చేయాలని సూచించారు. రూల్ ఆఫ్ లా, చట్టాన్ని రాజ్యాంగాన్ని కాపాడుతూ విధులు నిర్వహించాలన్నారు.

## నవీన్ యాదవ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలి

కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశంలో మంత్రి జూపల్లి

ప్రజాపక్షం/హైదరాబాద్: జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎర్రగడ్డ డివిజన్ ఐఎ ప్యాలస్‌లో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు.. కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, సమిష్టిగా కష్టపడి పనిచేసి కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని దిశానిర్దేశం చేశారు. పార్టీ విజయానికి ప్రతి బూత్ స్థాయిలో పనిచేయడంతో పాటు ప్రతిపక్షాల నాయకుల ఆరోపణలు, సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే వాటిపై అప్రమత్తంగా ఉండాలని వివరించారు. గడపగడపకు తిరుగుతూ.. ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి ప్రజలకి వివరించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి ప్రతి ఒక్కరూ అహర్నిశలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ



సమావేశంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎంఎల్‌ఎలు డా.రాజేష్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, ఎంఎల్‌సిలు దండే విఠల్, డెయిరీ డెవలప్మెంట్ కార్పోరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి పాల్గొన్నారు.


**FORMAT C-2**

*(for political party to publish in website, newspapers, TV)*

**Declaration about criminal antecedents of candidates set up by the party**

*(As per the judgment dated 25th September, 2018 of Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of 2011 (Public Interest Foundation & Ors. Vs. Union of India & Anr.)*

**Name of Political Party : INDIAN NATIONAL CONGRESS**

**Name of Election : BYE ELECTION TO THE TELANGANA STATE LEGISLATIVE ASSEMBLY**

**Name of State/ UT : TELANGANA STATE**

**Name of the Constituency: 61-JUBILEE HILLS**

**Name of the candidate : NAVEEN YADAV. V**

**4 (A) Pending criminal cases**

| Sl. No. | Name of Court | Case No .and dated | Status of case(s) | Section(s) of Acts concerned and brief description of offence(s) |
|---|---|---|---|---|
| 1 | XVII ACMM, Nampally, Hyderabad | FIR No. 575/2021 C.C No. 12608/2021 dt: 26-11-2021 | Examination of accused | U/S. 109, 505(2) & 506 of IPC. Abatement of any Offence, Conducting to public mischief and criminal intimidation |
| 2 | XVII ACMM, Nampally, Hyderabad | FIR No. 95/2021 CC No. 11727/2021 dt: 27-10-2021 | Examination of accused | U/S. 506 of IPC. Criminal Intimidation |
| 3 | XVII ACMM, Nampally, Hyderabad | FIR No. 93/2021 C.C No. 10432/2021 dt: 01-09-2021 | Examination of accused | U/S. 420 & 506 of IPC Cheating and Criminal Intimidation |
| 4 | XVII ACMM, Nampally, Hyderabad | FIR No. 55/2021 C.C No. 8134/2021 dt: 30-06-2021 | Examination of accused | U/S. 341, 506, 509 r/w 143 of IPC Wrongful Restraint, Criminal Intimidation |
| 5 | III ACMM, Nampally, Hyderabad | FIR No. 395/2006, Jubilee Hills PS, Jubilee Hills, Hyderabad dt: 01-11-2006 | Summons to accused | Under section. 406, 420 & 506 of IPC. Criminal Breach of Trust, Cheating & Criminal Intimidation |
| 6 | XVII ACMM, Nampally, Hyderabad | FIR No. 340/2021, Jubilee Hills PS, Jubilee Hills, Hyderabad Dt: 2-7-2021 | Under investigation | Under Section. 188, 419, 420, 427, 447, 467, 468 & 471 of IPC and under Section 3 of PDPP Act. Trespass and deliberate disobedience of Order. |
| 7 | XIV ACMM, Nampally, Hyderabad | FIR No. 655/2025, Madhura Nagar Police Station, Hyderabad Dt: 06-10-2025 | Under investigation | 123(1), 123(2) Representation of People Act, 1951, 170,171,174 of BNS. Bribery, undue influence, or illegal inducements during elections |

**5 (B) Details about cases of conviction for criminal offences**

| Sl. No. | Name of Court & date(s) of order(s) | Description of offence(s) & punishment imposed | MaximumPunishment Imposed |
|---|---|---|---|
| 1 | NA | NA | NA |

**T.KUMAR RAO**
Vice President
Authorized Signatory


# యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనే ధ్యేయం

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



ప్రజాపక్షం/హుజూర్‌నగర్ : గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా హుజూర్‌నగర్‌లో మెగా జాబ్‌మేళాను నిర్వహించినట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. జాబ్‌మేళా విజయవంతమైనందుకు ఆయన సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణలో పట్టణ ప్రాంతాల కన్నా గ్రామీణ ప్రాంతాలలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం చాలా ముఖ్యమని భావించామన్నారు. అందుకే హుజూర్‌నగర్ లాంటి గ్రామీణ ప్రాంతంలో ఈ జాబ్‌మేళాను నిర్వహించినట్లు చెప్పారు. శనివారం ఆయన సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని పెర్ల్ ఇన్ఫినిటి ఇంటర్నేషనల్ స్కూల్లో ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాను ప్రారంభించి మాట్లాడారు. మెగా జాబ్‌మేళా ఇప్పటి వరకు ఎక్కడ నిర్వహించలేదని, తెలంగాణలోనే ఇది అతిపెద్ద జాబ్‌మేళా అన్నారు. దీనివల్ల హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాలతో పాటు, ఉమ్మడి నల్లగొండ జిల్లా నిరుద్యోగులకు ఎంతో మందికి ఉద్యోగ అవకాశాలు వచ్చాయని, కంపెనీలు అక్కడికక్కడే ఉద్యోగాలలో నియమిస్తూ ఆఫర్ లెటర్లు కూడా ఇచ్చాయని తెలిపారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే మూడు అంశాలపై తెలంగాణ వచ్చిందని, దానిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందని, అందులో భాగంగా ఇప్పటివరకు ప్రభుత్వ రంగంలో 75వేల ఉద్యోగాలు కల్పించామని, ప్రైవేట్ సెక్టార్లో సైతం పెద్ద ఎత్తున ఉద్యోగాలు ఇచ్చేందుకు ఈ జాబ్‌మేళాను చేపట్టినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ రెండు రోజులు పాటు నిర్వహించే మెగా జాబ్‌మేళాలో సుమారు 275 కంపెనీలు పాల్గొని గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయని అన్నారు. ముఖ్యంగా డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణ, సింగరేణి కాలరీస్ సహకారంతో ఈ జాబ్‌మేళా ఏర్పాటు చేశామని, ఐటి, సర్వీస్ సెక్టార్, మ్యాన్‌ఫ్యాక్చరింగ్, ఆటోమొబైల్, ఫార్మా, సిమెంట్ తదితర కంపెనీలన్నీ హుజూర్‌నగర్‌కు వచ్చి గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయని తెలిపారు. శుక్రవారం నాటికి జాబ్‌మేళాకు 40వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, దీన్ని దృష్టిలో ఉంచుకొని రెండు రోజులపాటు జాబ్ మేళా నిర్వహించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిర్ణయం మేరకు నిర్ణయించడం జరిగిందని అందుకు తగ్గట్టుగానే అభ్యర్థులకు భోజన, వసతి సౌకర్యాలు కల్పించామని చెప్పారు. అభ్యర్థులందరూ ప్రశాంతంగా జాబ్‌మేళాలో పాల్గొని ఉద్యోగాలని పొందాలని అన్నారు. డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణ డైరెక్టర్ రాజేశ్వర్ రెడ్డి, సింగరేణి కాలరీస్ సంస్థ హెచ్ఆర్ మేనేజర్ చంద్ర మాట్లాడారు. మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, సూర్యాపేట, నల్లగొండ, ఖమ్మం జిల్లాల ఎస్‌పిలు, అదనపు కలెక్టర్ సీతారామారావు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆయా కంపెనీల ద్వారా ఉద్యోగాలు పొందిన నిరుద్యోగులకు జాబ్ ఆఫర్ లెటర్‌లను అందజేశారు.

## బిజెపి డబుల్ ఇంజన్ సర్కార్ అన్ని రాష్ట్రాల్లో విఫలం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్.బోస్

ప్రజాపక్షం/హైదరాబాద్ : బిజెపి డబుల్ ఇంజన్ సర్కార్ కేంద్రంతో రాష్ట్రాల్లో పూర్తిగా విఫలమైందని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్ అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తమ అనుకూల రాష్ట్ర ప్రభుత్వాలకు అందిన కాడికి దోచిపెడుతూ బిజెపియేతర ప్రభుత్వాలకు మాత్రం రాజ్యాంగ పరంగా రావాల్సిన నిధులు, సౌకర్యాలు ఇవ్వదల్చుకోలేదని పరోక్షంగా బహిరంగంగానే చెప్పడం శోచనీయమన్నారు. దీనిని దేశంలోని ప్రజాస్వామ్యవాదులు అంతా ఖండించాల్సిన అవసరం ఉన్నదని ఆయన పేర్కొన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఎంత సహాయ నిరాకరణ పాటించినా, ఎన్ని అడ్డంకులు సృష్టించినా కేరళ రాష్ట్రంలోని వామపక్ష ప్రభుత్వం అన్ని రంగాలలో ముందంజవేస్తూ ఆ రాష్ట్రంలో పేదరికాన్ని అత్యల్ప స్థాయికి తీసుకురావటం హర్షనీయమన్నారు. . కేరళ రాష్ట్రం దేశంలోని ఇతర రాష్ట్రాలకు అన్ని విషయాలలో ఆదర్శంగా నిలబడటం వామపక్ష ప్రభుత్వ ప్రత్యేకతను తెలియజేస్తుందని, మోడీ ప్రభుత్వరంగ సంస్థలను మూసివేస్తామని ప్రతిపాదిస్తే ఆ సంస్థలను కేరళ రాష్ట్ర ప్రభుత్వమే నడుపుతామని కేంద్రానికి ప్రతిపాదించటం ప్రస్తుత కార్పొరేట్ పరిపాలనలో అత్యంత సాహసోపేతమైన నిర్ణయంగా భావించాలని బోస్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్నది డబుల్ ఇంజన్ సర్కారా లేక సింగిల్ ఇంజన్ సర్కారా అన్నది ప్రాధాన్యం కాదని కేరళలోని వామపక్ష ప్రభుత్వం లాగా నిజాయితీ, నిబద్ధత, ప్రజల పట్ల అంకిత భావం కల్గిన సర్కార్ ఉంటే రాష్ట్రానికి మేలు జరుగుతుందని కేరళ రాష్ట్ర ఉదాంత్తమే ఇందుకు నిదర్శనమన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ అని డంకా ఊదుతూ బీహార్ రాష్ట్రంలో ప్రచారం చేస్తున్న మోదీ, ఆ రాష్ట్ర విఫల ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఇద్దరు కలిసి ఆ రాష్ట్రాన్ని దేశంలో అన్ని రంగాల్లో అత్యంత వెనుకబడిన రాష్ట్రంగా తీర్చిదిద్దటంలో సఫలీకృతమయ్యారన్నారు. బీహార్ రాష్ట్రంలో ఉపాధి లేక లక్షలాది మంది కార్మికులు వలసలు వచ్చి తెలంగాణ రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లో పనిచేస్తున్న విషయం పరిశీలిస్తే బీహార్ రాష్ట్రం ఎంత వెనుకబడి ఉన్నదో ప్రజలకు అర్థమవుతుందని తెలిపారు. బీహార్ ఎన్నికల్లో డబుల్ ఇంజన్ సర్కార్‌ను ఆ రాష్ట్ర ప్రజలు ఓడించడం కాయమని, ఆ రాష్ట్రంలో రాజకీయ చరిత్రను తిరగరాయటానికి ప్రజలు సిద్ధమవుతున్నారని తెలిపారు.

# ‘రైజింగ్ తెలంగాణ’లో భాగస్వామ్యం అవ్వండి

పెట్టుబడులతో రాష్ట్ర పురోగతికి దోహదపడండి

‘ఇండియన్’ సిఇఒలకు మంత్రి శ్రీధర్ బాబు పిలుపు



ప్రజాపక్షం/హైదరాబాద్: ‘రైజింగ్ తెలంగాణ’ లక్ష్య సాధనలో భాగస్వామ్యం కావాలని ఆస్ట్రేలియాలోని పలు కంపెనీల ‘ఇండియన్’ సిఇఒలకు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. పెట్టుబడులు పెట్టి రాష్ట్ర పురోగతిలో పాలు పంచుకోవాలని కోరారు. ఆ దేశ పర్యటనలో భాగంగా శనివారం సిడ్నీలో ‘ది సెంటర్ ఫర్ ఆస్ట్రేలియా – ఇండియా రిలేషన్స్’ ఆధ్వర్యంలో నిర్వహించిన బిజినెస్ కాంక్లేవ్ లో వారితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలలో ‘తెలంగాణ‘ ముందు వరుసలో ఉందని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. తక్కువ సమయంలో పటిష్ఠమైన ఆర్థిక వ్యవస్థ, స్థిరమైన పాలన, సమర్థవంతమైన నాయకత్వం కారణంగా రాష్ట్రం అంతర్జాతీయ పెట్టుబడులకు అత్యంత సురక్షితమైన గమ్యస్థానంగా మారిందన్నారు. తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధికి అనుకూలించే అంశాలు, పెట్టుబడి అవకాశాలు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, ప్రగతిశీల విధానాలు, ఎకో సిస్టం, సింగిల్ విండో అనుమతుల వ్యవస్థ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అంతర్జాతీయ, జాతీయ దిగ్గజ సంస్థల భాగస్వామ్యంతో పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా ‘ఇండస్ట్రీ రెడీ వర్క్ ఫోర్స్’ను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా తీసుకుంటున్న చొరవను వివరించారు. ఏఐ, డేటా అనలిటిక్స్, మెషిన్ లెర్నింగ్, గేమింగ్, యానిమేషన్, వీఎఫ్ఎక్స్, సెమీకండక్టర్లు, ఏరోస్పేస్, డిఫెన్స్, అడ్వానడ్స్ మాన్యుఫ్యాక్చరింగ్, గ్రీన్ ఎనర్జీ, ఇవిల తయారీ తదితర రంగాల్లో తెలంగాణలో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ‘ది సెంటర్ ఫర్ ఆస్ట్రేలియా – ఇండియా రిలేషన్స్’ ఛైర్ పర్సన్ స్వాతి దవే, ‘ఆస్ట్రేలియా – ఇండియా’ బిజినెస్ కౌన్సిల్ నేషనల్ అసోసియేట్ ఛైర్మన్ ఇర్ఫాన్ మాలిక్, ఈటీపీఎల్ డైరెక్టర్ సౌరవ్ బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

# రైతులు మోసపోకుండా మద్దతు ధరకే అమ్మేలా చర్యలు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ప్రజాపక్షం/హైదరాబాద్ : పత్తి రైతులు దళారులు దగ్గర మోసపోకుండా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ)వద్ద మాత్రమే పత్తి అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఖరీఫ్ పంట కోతలు ఊపందుకుకోవడం, మరోవైపు అకాల వర్షాల నేపథ్యంలో తీసుకుంటున్న జాగ్రత్తలు, కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కి పత్తి కొనుగోలు, కోహెడా మార్కెట్ ప్రగతి స్థితి, కార్యాచరణ ప్రణాళిక, మార్కెటింగ్ శాఖలో కొత్తగా ఆమోదించిన పనుల స్థితి, సోయా, మక్కజొన్న కొనుగోళ్ల పురోగతి తదితర అంశాలపై సంబంధిత అధికారులలో సచివాలయంలో శనివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో పత్తి సేకరణలో సిసిఐ నిబంధనలలో 812 శాతం తేమ శాతం సడలించాల్సిందిగా సిసిఐ అధికారులను కోరారు. ఈఎన్ఎఎం సర్వర్‌లో ఏర్పడుతున్న సమస్య మూలంగా పలు జిల్లాల్లో రైతులు ఇబ్బంది పడ్తున్న విషయాన్ని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పత్తి కొనుగోళ్లకు సంబంధించి ఈ ఏడాది సిసిఐ ప్రవేశపెట్టిన మ్యాపింగ్ విధానం వల్ల రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా చూడాలని అధికారులకు సూచించారు. పత్తిలో తేమ శాతం పరీక్షించే పరికరాలు అందుబాటులో ఉంచాలని, మార్కెట్ యార్డులలో సరిపడా యంత్రాలు, పరికరాలు, సిబ్బంది ఉండేలా చూడాలని ఆదేశించారు. ఎల్1, ఎల్ 2 విధానంలో ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే సిసిఐ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఈవారం రైతు నేస్తంలో పత్తి పండించే రైతులకి పత్తి కొనుగోళ్లపై మరోసారి అవగాహన కార్యక్రమం నిర్వహించాలనితెలిపారు. ఉమ్మడి జిల్లాకు కేటాయించిన నోడల్ ఆఫీసర్స్ నిరంతరం పంటల కొనుగోళ్లు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఇప్పటికే పిఎస్ఎస్ స్కీమ్‌లో లేని మొక్కజొన్న పంటను కేంద్రం నుండి ఎటువంటి సహకారం లేకపోయనప్పటికీ రూ.2400 కోట్ల నిధులతో మద్దతు ధరకు రాష్ట్ర ప్రభుత్వమే సేకరిస్తోందన్నారు. మద్దతు ధరల పథకంలో భాగంగా సోయా చిక్కుడు, పెసర కొనుగోళ్లకు కూడా కేంద్రం నుంచి అనుమతులు రాని నేపథ్యంలో మరొక్కసారి ఈ విషయాన్ని కేంద్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ సంచాలకులు గోపి, మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీ భాయి తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
**పురపాలక సంఘం ఆర్మూర్, జిల్లా: నిజామాబాద్.**

E1/12/MCA/2025-26, టెండర్ నోటీస్ తేది: 25-10-2025

పట్టణములో సానిటేషన్ నిర్వహణ కొరకు ఒక్క మాసానికి గాను జె.సి.బి ఏంగేజ్ చేయుటకు, (01) నుండి (36) వార్డులలో అవసరమగు ప్రదేశంలో ఆర్.సి.సి పైపులు వేయుటకు మరియు వివిధ వార్డులలో అభివృద్ధి పనులు చేపట్టుటకు టెండర్లు కోరుచున్నాం. మిగితా వివరాల కొరకు తెలంగాణ ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారమ్ https://tender.telangana.gov.in లో లేదా పురపాలక సంఘ కార్యాలయము నందు పని వేళల్లో మున్సిపల్ ఇంజనీర్ గారిని సంప్రదించగలరు.

సం/- కమీషనర్
పురపాలక సంఘం, ఆర్మూర్.

DIPR R.O. No. : 9712-PP/CL/ADVT/1/2025-26, Date: 25-10-2025



**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, ఎల్‌బినగర్ సర్కిల్-4, ఎంఆర్‌ఓ కార్యాలయం ప్రక్కన, సరూర్‌నగర్, హైదరాబాద్. ఇ-మెయిల్: eec4.ghmc@gmail.com
GHMC

కొటేషన్ నోటీసు నెం. EE/LBNR/LBNZ/09/2025-26 కొటేషన్ నోటీసు తేది: 25.10.2025

ప్రముఖ సంస్థల నుండి సీల్డ్ కొటేషన్లు ఆహ్వానించడమైనది. వీటిని 29.10.2025న మధ్యాహ్నం 3.00 గంటల సమయము లోపు ఈ దిగువ సంతకం చేసిన వారికి అందజేయాలి మరియు అదే రోజు సాయంత్రం 4.00 గంటలకు కొటేషన్లను తెరిచిచూస్తారు. క్రింద ఇవ్వబడిన అంశాల పూర్తి వివరణలు మరియు స్పష్టత కోసం మీరు ఎల్‌బినగర్ సర్కిల్-4, జిహెచ్‌ఎంసి కార్యాలయ పనివేళల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వారిని సంప్రదించవచ్చు.

| క్ర.సం. | అంశాల వివరణ | పరిమాణం | యూనిట్ | మొత్తం |
|---|---|---|---|---|
| 1 | 4.5 మి.మీ. మందపాటి ఆకుపచ్చ రంగు బ్యాడ్మింటన్ మ్యాట్ సింథటిక్ ఫ్లోరింగ్ పని పూర్తిచేసి అందించడం. (అన్ని చార్జీలు ఇందులో కలిపి ఉంటాయి) | 1 | Sqm | |

షరతులు:
1. కొటేషన్లు 29.10.2025వ తేదీ మధ్యాహ్నం 3.00 గంటల వరకు స్వీకరించబడును మరియు వాటిని సాయంత్రం 4.00 గంటలకు O/o. జిహెచ్‌ఎంసి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, Cir-4, ఎల్‌బినగర్ సర్కిల్-4 కార్యాలయంలో తెరిచి చూస్తారు.
2. ఎటువంటి కారణం చెప్పకుండా కొటేషన్లను రద్దు చేసే హక్కు ఎల్‌బినగర్-4 కార్యాలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు ఉన్నది.

సంప్రదించవలసిన అధికారి చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎల్‌బినగర్ సర్కిల్-4, జిహెచ్‌ఎంసి, హైదరాబాద్.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎల్‌బినగర్ సర్కిల్-4, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 9735-PP/CL/ADVT/1/2025-26, Date: 25-10-2025

## కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

ప్రజాపక్షం/కొండమల్లేపల్లి : కుటుంబ కలహాలతో ఒరిస్సా రాష్ట్రానికి చెందిన సంగీత అనే మహిళ మండల పరిధిలోని దేవరోనితండాలోని ఒక పౌల్ట్రీ ఫామ్‌లో శనివారం ఉదయం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దేవరోనితండాలోని ఒక పౌల్ట్రీ ఫామ్‌లో పనిచేయుటకు ఒరిస్సా రాష్ట్రానికి చెందిన దీలిప్‌కుమార్ సంగీత అనే దంపతులు ఐదు రోజుల కిందట వచ్చి అక్కడే ఉంటూ పనిచేస్తున్నారు. శనివారం ఉదయం కుటుంబ విషయాల్లో గొడవ పడ్డారు. అనంతరం మృతురాలి భర్త దీలిప్‌కుమార్ కిరాణా సామాను కొనడానికి కొండమల్లేపల్లికి వచ్చి తిరిగి పౌల్ట్రీ ఫామ్‌కు వెళ్ళగా పౌల్ట్రీ ఫామ్ షెడ్డు పై కప్పుకు తాడుతో ఉరివేసుకొని ఉండగా చూసిన భర్త అక్కడే ఉన్న ఇస్లావత్ బక్కమ్మకు చెప్పి చూడగా అప్పటికే చనిపోయింది. పౌల్ట్రీ ఫామ్ యజమాని ఇస్లావత్ రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అజ్మీరా రమేష్ తెలిపారు.



## గుత్తాకు ఎమ్మెల్సీ శుభాకాంక్షలు

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : నార్త్ అమెరికా ఖండంలోని బార్బడోస్ దేశంలో జరిగిన 68 వ కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ కాన్ఫరెన్స్‌లో పాల్గొని అనంతరం స్టడీ టూర్‌లో భాగంగా ఇంగ్లాండ్, ఫ్రాన్స్, ఇటలీ దేశాలలో పర్యటించి నల్లగొండకు వచ్చిన రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని సిపిఐ జిల్లా కార్యదర్శి,ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం నెల్లికంటి సత్యం శనివారం గుత్తా క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలసి పుష్పచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురిజ రామచంద్రం, బోల్లురి నర్సింహా తీర్పాటి వెంకటేశ్వర్లు, శాంతి సంఘం జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య ఉన్నారు.



## క్వింటాల్ పత్తికి రూ.10వేలు ఇవ్వాలి

ప్రజాపక్షం/వలిగొండ : ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా వరి, ప్రత్తి రైతులు తీవ్రస్థాయిలో నష్టం వాటిలిందని సిపిఐ మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టపడి నోటికాడికి వచ్చిన పంట నీట మునగడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే మార్కెట్లోకి 30 శాతం పైగా వరి ధాన్యం వచ్చినప్పటికీ వ్యవసాయ అధికారులు మార్కెట్లోకి బార్దాన్, కాంటాలు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇప్పటికే సగానికి పైగా వరి ధాన్యం దళారుల చేతుల్లోకి వెళ్లిపోయింది. కొనుగోలు కేంద్రాలు త్వరగా ఏర్పాటు చేయకపోవడం వలన రైతులు ప్రైవేట్ వ్యాపారస్తులను ఆశ్రయించవలసిన పరిస్థితి నెలకొంది. ప్రైవేట్ వ్యాపారులు క్వింటాకు రూ.1800లకే కొనుగోలు చేయడం ద్వారా వరి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అదేవిధంగా పత్తి కొనుగోలు కేంద్రాలు సీసీఐ ప్రారంభించకపోవడం వలన దళారులు ఇదే అదునుగా భావించి క్వింటాకు రూ.5 వేలకు మించకుండా రైతులను మోసం చేయడం అనివార్యం అయ్యిందని అన్నారు. వ్యవసాయ, సిసిఐ అధికారులు తక్షణమే స్పందించి పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పత్తికి క్వింటాకి రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## విద్యా సంస్కరణలకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే



ప్రజాపక్షం/దేవరకొండ: దేవరకొండ పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యా సంస్థలు సమాజ అభివృద్ధికి పునాదులని పేర్కొన్నారు. కళాశాల ప్రతిష్టను, మౌలిక సదుపాయాలను మరింత అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం తరుపున పూర్తి సహకారం అందిస్తామన్నారు. కళాశాల పేరును ఆధునిక నమూనా విద్యా సంస్థగా తీర్చిదిద్దుతూ ప్రజలకు ప్రత్యేక సేవలందించిన మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి పేరుతో అభివృద్ధి చేసే విషయంపై చర్యలు జరిపినట్లు తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించేందుకు, శిక్షణా ప్రమాణాలను పెంచేందుకు అవసరమైన వాటిని తక్షణమే గుర్తించి అమలు చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పూర్వ విద్యార్థులు పాల్గొని తమ విద్యా కాలపు జ్ఞాపకాలను తలుచుకున్నారు. కళాశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించేందుకు ముందుకు రావాలని పూర్వ విద్యార్థులను ఎంఎల్‌ఏ కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీశైల దేవస్థాన ట్రస్ట్ మెంబర్ చిలువేరు కాశీనాథం, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, ఆలంపల్లి నర్సింహా, కళాశాల ప్రిన్సిపాల్ రమేష్, రాము పాల్గొన్నారు.

## చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



ప్రజాపక్షం/యాదాద్రి : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. శనివారం భువనగిరి పట్టణంలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో 69 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 19 బాలుర స్టేట్ లెవెల్ వాలీబాల్ పోటీలను ముఖ్య అతిథిగా తీన్మార్ మల్లన్న, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రమణి ప్రారంభించారు. ఈ పోటీలలో ఉమ్మడి 10 జిల్లాలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమములో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ క్రీడలు శరీర మానసికోల్లాసానికి ఎంతగానో తోడ్పడుతాయని తెలిపారు. విద్యార్థులు అందరు ఇలాంటి పోటీలలో పాల్గొని ఆరోగ్యంగా ఉండాలని, క్రీడారంగంలో జిల్లాను ప్రథమస్థానములో నిలపాలని, క్రీడాకారులకు తనవంతు సహకారమునకు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జాబ్‌మేళాలో భద్రతా ఏర్పాట్లు భేష్



ప్రజాపక్షం/హుజూర్‌నగర్ : తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు చేసిన భద్రతా ఏర్పాట్లు భేష్ అని డిఐజి చౌహాన్ పోలీస్ అధికారులను అభినందించారు. హుజూర్‌నగర్‌లోని పెరల్ ఇన్ఫినిటి ఇంటర్నేషనల్ స్కూల్లో, స్వర్ణ వేదిక ఫంక్షన్ హాల్ సమీపంలోని భద్రత ఏర్పాట్లు డిఐజి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగా జాబ్‌మేళాలో నిరుద్యోగ యువత పాల్గొని వారి సామర్థ్యానికి తగిన ఉద్యోగాలు పొందాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు కల్పించిన ఈ సదవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మెగా జాబ్‌మేళాను ఆదివారం కూడా కొనసాగించడం జరుగుతుందని తెలిపారు. ఆయన వెంట ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్‌దత్, సూర్యాపేట జిల్లా ఎస్‌పి నరసింహ, నల్లగొండ జిల్లా ఎస్‌పి చరత్‌చంద్ర పవార్‌లు ఉన్నారు.

## పోలీస్ కళాబృందం అవగాహన

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా పోలీస్ కళాబృందం సభ్యులు శనివారం జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ సెంటర్, కొత్త బస్టాండ్ వద్ద సాంస్కృతిక కార్యక్రమాలతో అమరవీరులను స్మరిస్తూ వారి త్యాగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కళాబృందం సభ్యులు, స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# మునుగోడు నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యం

రూ.45 కోట్ల 90లక్షల అభివృద్ధి పనులు

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



ప్రజాపక్షం/చండూరు: మునుగోడు నియోజకవర్గం అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ జోడెద్దుల్లాగా ముందుకు సాగుతున్నామని ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం , ఎంఎల్‌ఏ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం నియోకవర్గంలోని చండూరు మండలం ,చండూరు మున్సిపాలిటీ కేంద్రంలో రూ.45 కోట్ల 90లక్షల రూపాయల విలువ కలిగిన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. మండలంలోని ఇడికూడ నుండి గట్టుప్ప ల మండలం తేరట్‌పల్లి వరకు 30కోట్ల వ్యయంతో నిర్మించనున్న రోడ్డు వెడల్పు పనులకు ఇడికూడ గ్రామంలో, చండూరు టౌన్ నుండి తాస్కానిగూడెం వరకు 13కోట్ల వ్యయంతో నిర్మించనున్న రోడ్డు వెడల్పు పనులకు తాస్కానిగూడెం ఎక్స్ రోడ్డ్ వద్ద శంకుస్థాపన చేశారు. అదే విధంగా రూ.2కోట్ల 90 లక్షల రూపాయలతో మంజూరైన చండూరు మున్సిపల్ పట్టణ కేంద్రంలోని శనిగ చెరువు సుందరీకరణ పనులకు ఎంఎల్‌సి సత్యంతో కలిసి ఎంఎల్‌ఏ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి శంకు స్థాపన చేశా రు. స్థానిక నాయకులతో కలిసి చెరువు కట్టను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. అనంతరం చండూరు పట్టణంలో జరుగుతున్న ప్రధాన రహదారి నిర్మాణంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద అడ్డుగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌ను, అక్కడ జరుగుతున్న డ్రైనేజీ పనులను పరిశీలించారు. రోడ్డు నిర్మాణానికి అడ్డుగా ఉన్న షాపులను వెంటనే తొలగించాలని అధికారులు ,స్థానిక నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బి నల్లగొండ జిల్లా కార్యనిర్వాహక అధికారి కె.శ్రీధర్‌రెడ్డి, ఛీఫ్ ఇంజనీర్ బి. వెంకటేశ్వర్ రావు, డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ శ్రీదేవి, చండూరు ఏఎంసి చైర్మన్ దోటి నారాయణ, తహసీల్దార్ చంద్రశేఖర్ , మున్సిపల్ కమిషనర్ మల్లేశం , ఏఈ పబ్లిక్ హెల్త్ నల్లగొండ నాగ ప్రసాద్ , డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పబ్లిక్ హెల్త్ నల్లగొండ బి. మనోహర, ఎంపిడిఓ యాదగిరి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్, దోటి వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు.

# రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

ఎకరాకు రూ.20వేల చొప్పున చెల్లించాలి

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్



ప్రజాపక్షం/హుజూర్‌నగర్ : అకాల వర్షాలతో వరిపంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారంగా ఎకరాకు రూ.20వేల చొప్పున చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంబాల శ్రీనివాస్, కౌలు రైతుల రాష్ట్ర కార్యదర్శి ఒకరోజు సూర్యనారాయణ, పట్టణ సిపిఐ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, మహిళా సమైఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లేశ్వరి, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు జడ శ్రీనివాస్, రైతు సంఘం పట్టణ కార్యదర్శి మామిడి నర్సయ్యలు డిమాండ్ చేశారు. శనివారం హుజూర్‌నగర్ పట్టణంలోని మఠంపల్లి రోడ్డులో అకాల వర్షాలకు వరిపంట నష్టపోయిన పంట పొలాలను తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో వారు పరిశీలించి మాట్లాడారు. రైతులు ఆరుగాలం పండించిన పంట చేతికొచ్చే దశలో అతివృష్టి, అనావృష్టితో నష్టపోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ఇటీవల కాలంలో అకాల వర్షాలు కురియడంతో అనేక మంది రైతులు పంట పొలాలు నేలకు పడిపోవడం జరిగిందన్నారు. వడ్డీలకు తెచ్చి పెట్టుబడి పెట్టి, కౌలు తీసుకున్న రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వారు పరిశీలించిన పంట పొలాల్లో ఎక్కువ మంది కౌలు రైతులే ఉన్నారని వారి పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. తక్షణమే ప్రభుత్వం వ్యవసాయ అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలింపజేసి వారికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పొనుగుపాటి వాసుదేవరావు, ఇందిరాల వెంకటేశ్వర్లు, అంజిరెడ్డి, మామిడి వెంకయ్య, దేవరం రవీందర్ రెడ్డి, దేవరం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాపక్షం/ఆలేరు : భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పార్టీ కార్యాలయంలో శనివారం తెలంగాణ రైతు సంఘం సమస్యల పైన సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామ్రేడ్ కొల్లు రాజయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలేరు మండలమే కాకుండా జిల్లా వ్యాప్తంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఐకెపి సెంటర్ల ద్వారా కొనుగోలు చేయాలని ఆలస్యం కావడం వల్ల అకాల వర్షాలతో రైతులకు చాలా ఇబ్బందులు జరుగుతున్నాయి. ధాన్యం తడవకుండా ఉండడానికి తాడిపత్రి రైతులు ఇబ్బందికి గురి అవుతున్నారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ మాట్లాడుతూ అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని ప్రభుత్వం డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ పార్టీ పట్టణ కార్యదర్శి గొట్టిపాముల శ్రీనివాసరాజు, సహాయ కార్యదర్శి బొడ్డ ఆంజనేయులు, తట్టు ఆంజనేయులు, నరసింహులు, మల్లయ్య, సామి పాల్గొన్నారు.



# మోతె రైతు ఉత్పత్తిదారుల సొసైటీలో అక్రమాలు



అందినకాడికి దండుకుంటున్న చైర్మన్

ప్రశ్నించిన డైరెక్టర్‌పై కేసు నమోదు

ప్రజాపక్షం/మోతె : రైతు ఉత్పత్తిదారుల సొసైటీలో అక్రమాలు జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రైతులు తెలిపిన వివరాల ప్రకారం అక్రమంగా సొసైటీ ఆదాయం దండుకుంటున్న చైర్మన్ బొక్క ఉపేందర్ రెడ్డిని నిలదీసిన డైరెక్టర్‌పై కేసు నమోదు చేయడంతో రైతు ఉత్పత్తిదారుల సొసైటీలో జరిగిన అవినీతి బాగోతం బట్టబయలైందని సొసైటీ సభ్యులు ఆరోపించారు. గడిచిన సంవత్సరం క్రితం మండల కేంద్రంతోపాటు వివిధ గ్రా మాలకు చెందిన సుమారు 300 మందితో రైతు ఉత్పత్తిదారుల సొసైటీని ఏర్పాటు చేసుకొని 10 మందితో ఆఫీస్‌బేరర్లు ఎన్నుకొని సొసైటీని నడిపిస్తున్నప్పటికి గడిచిన సంవత్సరంలో పెట్టిన పెట్టుబడి వచ్చినా ఆదాయంలోని అయిన ఖర్చులు వివరాలు చెప్పాలని చైర్మన్‌ను నిలదీశారు. కమిటిలో మీరు లేరంటూ బుకాయిస్తూ మీకు దిక్కున్న చోట చెప్పుకొమ్మని అడిగిన వారిపై కేసులు పెడుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులందరి భాగస్వామ్యం తో ఏర్పాటు చేసిన సొసైటీలో ఒక్కరి పెత్తనంతో సుమారుగా రూ.9లక్షల 50 వేలకు పైగా లెక్కలు చెప్పకుండా దర్జాగా సొసైటీ సొమ్మును దోచుకోవడం జరుగుతుందని రైతులు, డైరెక్టర్లు చెప్పారు. లెక్కలు చెప్పాలని కోరినా పట్టించుకోవడం లేదని సంస్థ అధికారులు స్పందించి మోతె రైతు ఉత్పత్తిదారుల సొసైటీ రైతులు, డైరెక్టర్లు మాకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

### లావాదేవీల లెక్కలు చూపించడం లేదు

అండెం నారాయణ, సొసైటీ డైరెక్టర్



సొసైటీలో రైతులందరి భాగస్వామ్యంతో పెట్టుబడి పెట్టి సొసైటీ నడిపించడం జరుగుతుందన్నారు. చైర్మన్ ఉపేందర్ రెడ్డి గడిచిన సంవత్సర కాలం నుండి జరిగిన లావాదేవీల లెక్కలు చూపించడం లేదని ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయాలని కోరారు.

### ఏ ఒక్క సభ్యులు కానీ డైరెక్టర్ కానీ ఒక్క రూపాయి ఇవ్వలేదు

బొక్క ఉపేందర్ రెడ్డి, సొసైటీ చైర్మన్ వివరణ



సొసైటీ చైర్మన్‌ను ఈ విషయమై వివరణ కోరగా సంస్థ ప్రారంభించిన నాటి నుండి ఏ ఒక్క సభ్యులు కానీ డైరెక్టర్ కానీ ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. సుమారు 300 మంది సభ్యులకు సభ్యత్వం నమోదుకు ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున రూ.6లక్షలు ఖర్చు చేసి సొసైటీని నిలబెట్టానని స్పష్టం చేశారు.

## రైస్ మిల్లర్లు బ్యాంక్ గ్యారంటీలను సమర్పించాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ధాన్యం సేకరణలో భాగంగా ఈ వానాకాలానికి సంబందించి జిల్లాలోని రైస్ మిల్లర్లు తక్షణమే బ్యాంక్ గ్యారంటీలను సమర్పించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శనివారం ఆమె పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఇంకా బ్యాంక్ గ్యాంరెటీలు సమర్పించిన మిల్లర్లు తక్షణమే బ్యాంక్ గ్యారెంటీలను సమర్పించాలన్నారు. ధాన్యం సేకరణలో భాగంగా ఈ వానాకాలం ధాన్యాన్ని మిల్లర్లు ఎప్పటికప్పుడు వారి మిల్లుల్లో దిగుమతి చేసుకోవాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించవద్దని అన్నారు. అకాల వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసే అవకాశం ఉన్నందున నాణ్యత ప్రమాణాలతో కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని దిగుమతి చేసుకోవడంలో జాప్యం చేయకూడదని, మిల్లుల యాజమాన్యాలు ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకొని రైతులకు సహకరించాలని ఆమె కోరారు. అనంతరం ఆమె అవంతీపురంలోని సూర్యతేజ రైస్ మిల్లును సందర్శించి అక్కడ ధాన్యం ప్రాసెసింగ్ ప్రక్రియను, బాయిల్డ్ రైస్, డ్రైయర్స్ తదితర అంశాలను మిల్లు యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆమె సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేష్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ గోపికృష్ణ, మిర్యాలగూడ రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ బాబి, అధికారులు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదులు నిరంతర విద్యార్థులు

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : నిరంతర పఠనంతోనే న్యాయవాదులు కేసులను సరిగా వాదించగలుగుతారని వరంగల్ సీనియర్ న్యాయవాది జి. విద్యాసాగర్ రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ బార్ అసోసియేషన్ లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఇండియన్ అసోసియేషన్ అఫ్ లాయర్స్ జిల్లా అధ్యక్షుడు కట్టా అనంత రెడ్డి అధ్యక్షతన న్యాయవాదులకు చట్టాలపట్ల అవగాహనా పెంచేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అయన హాజరై ఆర్ట్ అఫ్ క్రాస్ ఎక్సమినేషన్ భారతీయ సాక్ష్య అధినియం పై అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ మారుతున్న చట్టాలపట్ల న్యాయవాదులు అబగాహన పెంచుకోవాలని సూచించారు. అదేవిదంగా హై కోర్ట్ న్యాయవాది బి. భరత్ ఆర్టిఫిషయల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి న్యాయవాదులు మంచి ఫలితాలు పొందవచ న్నారు. ఈ కార్యక్రమం లో బార్ అసోసియేషన్ కార్యదర్శి మంద నగేష్, ఐ ఏ యల్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్, బార్ కౌన్సిల్ సభ్యుడు దుస్స జనార్ధన్, సీనియర్ న్యాయవాదులు మునగాల నారాయణ రావు, గుండె వెంకటేశ్వర్లు, మల్లేపల్లి అది రెడ్డి, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు జి. జవహర్లల్, జి. వెనత రమణా రెడ్డి, ప్రభుత్వ న్యాయవాది నాంపల్లి నర్సింహా, ఐ ఏ యల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. వెంకన్న పాల్గొన్నారు.




## రోడ్డెక్కిన రైతన్నలు

అద్దంకి - నార్కట్‌పల్లి రహదారి పై భారీగా ట్రాఫిక్ జామ్




ప్రజాపక్షం/మాడుగులపల్లి: ఐకెపి కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లు జరగడంలేదని అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదని ఆవేదన చెంది అద్దంకి, నార్కట్ పల్లి రహదారిపై రైతులు బైటాయించి ధర్నా చేశారు. దీంతో రహదారిపై ఇరువైపులా వాహనాలు ఎక్కడి అక్కడ ఆగిపోయి భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది. నెలరోజులు కావస్తున్న కాంటాలు వేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలకు ధాన్యం పూర్తిగా తడిసి మొలకలు వస్తున్నాయని,ఐకెపి సిబ్బందిని కాంటాలు వేయమని అడిగితే ఎవరు కూడా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యం కుప్పలను ఆరబెట్టినప్పటికీ కూడా కొనుగోలు కొనసాగించకపోవడంతో రైతుల ఆగ్రహం కట్టలు తెంపుకుంది.దీంతో ఒక్కసారిగా రైతులందరూ రోడ్డుపై బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది.స్థానిక తహసిల్దార్ తక్షణమే మా వద్దకు వచ్చి మా సమస్యకు పరిష్కారాన్ని చూపాలని లేకుంటే ఈ ధర్నాను విరమించేది లేదని రైతులు డిమాండ్ చేశారు. అనంతరం తాసిల్దార్ సరోజ పావని ధర్నా వద్దకు చేరుకుని నేను చొరవ తీసుకొని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి ధాన్యం కాంటాలు వేపిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నాను విరమించారు.

## బంగారు నగల, బైక్ దొంగ అరెస్ట్ రిమాండ్‌కు తరలింపు




ప్రజాపక్షం/నార్కట్‌పల్లి: ఒంటరి మహిళలను టార్గెట్ చేసి మెడలో ని బంగారు నగలను ఎత్తుకెళ్తు, బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని నార్కెట్ పల్లి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నల్గొండ డి ఎస్ పి కె శివరాం రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్‌పి కె.శివరాం రెడ్డి మాట్లాడుతూ వరుస బంగారు నగల దొంగతనాలకు పాల్పడ్డ నిందితుని నుండి 15 లక్షల విలువ గల 9.5 తులాల బంగారు ఆభరణాలు, 02మోటారు సైకిళ్ళ ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మునుగోడు మండలం పులిపలుపులకు చెందిన ఆటో డ్రైవర్ బొలుగూరి శివ ఈ నెల 18 రోజున నార్కెట్ పల్లి మండలం దాసరిగూడెం గ్రామానికి చెందిన ఉప్పుల సునీత పత్తి చేనులో పనిచేసుకుంటూ ఉండగ ఆమె దగ్గరికి ఒక గుర్తు తెలియని వ్యక్తి బైక్ పై వచ్చి, బైక్ దిగి ఆమెను మాటల్లో పెట్టి, మెడలో ఉన్న 03 తులాల పుస్తెల తాడును లాక్కొని వెళ్లడానికి ప్రయత్నిస్తుండగా అమె గట్టిగా అరుస్తూ అతనిని పట్టుకొనే ప్రయత్నం చేస్తున్న సమయం లో అటుగా వెళ్తున్న పొలగాని సైదులు, ఉప్పుల మోహన్ రెడ్డి లు అతనిని పట్టుకొని పోలీసులకు సమాచారం అందుంచడంతో వెంటనే స్పందించిన పోలీస్‌లు అతన్ని అదుపులోకి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారించగా దొంగతనం చేసినట్లు వెల్లడించాడు. ఆ క్రమంలోనే నల్లగొండ మండలంలో మీరులోని గూడెం, చర్లపల్లి, మునుగోడు మండలంలో కల్వలపల్లిలో, నార్కెట్ పల్లి మండలంలో, చెరువుగట్టు జాతర సందర్భంగాచెరువుగట్టు జాతరలో, పోతినేనిపల్లి గ్రామములో గొలుసు దొంగ తనాలకు పాల్పడినట్లు డిఎస్‌పి తెలిపారు.గతం లో కూడా ఇట్టి నేరస్తుని పైన చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైనదని తెలిపారు. .నేరస్తుని వద్ద నుండి 9.5 తులాల దొంగతనం చేయడానికి ఉపయోగించిన 02 మోటార్ సైకిళ్ళ లను పోలీస్ లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఇట్టి కేసును నార్కెట్ పల్లి సిఐ కె. నాగరాజు ఆధ్వర్యంలో, సమగ్ర విచారణ చేపట్టి నిందితుని వద్ద నుండి బంగారు ఆభరణాలు రికవరీ చేసిన ఎస్ఐ డి.క్రాంతి కుమార్, వారి సిబ్బంది ఏఎస్ఐ ఆంజనేయులు, హెచ్ సి జవహర్, బి రమేష్,ఎస్ డి. జానీ పాషా,కె. సత్యనారాయణ, బండి గిరి బాబు, సి హెచ్. శ్రీ క్రిష్ణ, కె. సురేష్ గౌడ్ లను జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ అభినందించారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## లాలూ, రబ్రీ ప్రభుత్వం వస్తే మళ్లీ ఆటవిక పాలనే : అమిత్ షా

బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో సీనియర్ బీజేపీ నాయకుడు, కేంద్రహోంమంత్రి అమిత్ షా తన మాటల జోరును పెంచారు. శనివారం ఖగారియాలో ఎన్నికల ప్రచార సభలో మాట్లాడిన షా.. ప్రతిపక్ష కూటమిపై దుమ్మెత్తిపోశారు. ప్రతిపక్ష మహాఘట్బంధన్‌కు ఓటువేస్తే ఆటవిక పాలనను కొనితెచ్చుకున్నట్లేనని ఓటర్లను షా హెచ్చరించారు.ఎన్డీయే సర్కారు బీజేపీని అభివద్ధిపథంలో నడిపించిందని అమిత్ షా అన్నారు. మళ్లీ అధికార కూటమినే గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో ఆటవిక పాలన కావాలో, అభివద్ధి పాలన కావాలో మీరే తేల్చుకోవాలన్నారు.లాలూ, రబ్రీదేవీల సర్కారు వచ్చిందంటే.. దాంతోపాటు జంగిల్‌రాజ్ కూడా వస్తుందని వ్యాఖ్యానించారు. ఎన్డీయేని గెలిపిస్తే అభివద్ధి చెందిన బీహార్‌ను చూస్తారని చెప్పారు.ఎన్డీయే కూటమి ఐదుగురు పాండవులతోకూడినకూటమిఅని,ఈకూటమిని గెలిపిస్తే రాష్ట్రంలో అన్నీ విజయాలేనని షా అన్నారు. ఈ మహాఘట్బంధన్, లఠ్బంధన్‌లు రికార్డు స్థాయిలో అవినీతికి పాల్పడ్డాయని ఆరోపించారు. 'వాళ్లు బీహార్‌ను అభివద్ధి చేస్తారా..?' అని ప్రశ్నించారు.

### అదానీ గ్రూప్స్ సెక్యూరిటీలలో భారీ పెట్టుబడులు పెట్టిన ఎల్ఐసిపై...

# పార్లమెంట్ పిఏసి దర్యాప్తు చేయాలి



**కాంగ్రెస్ డిమాండ్**

**'వాషింగ్టన్ పోస్ట్' నివేదిక వెల్లడి నేపథ్యంలో స్పందించిన కాంగ్రెస్**

**న్యూఢిల్లీ:** అదానీ గ్రూప్స్‌కు అనుకూలంగా వ్యవహరించి పెట్టుబడులు పెట్టిన తీరుపై కాంగ్రెస్ పార్టీ ధ్వజమెత్తింది. మార్కెట్లు పతనమైన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థ జీవిత బీమా కార్పొరేషన్ (ఎల్ఐసి) అదానీ గ్రూప్స్ సెక్యూరిటీలలో భారీ పెట్టుబడులు పెట్టిందని 'వాషింగ్టన్ పోస్ట్' తాజా నివేదిక వెల్లడించింది. ఈ నేపథ్యంలో ఎల్ఐసి సెక్యూరిటీ మార్కెట్లలో నష్టపోయిన తర్వాత ఆ సంస్థపై పార్లమెంట్ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ దర్యాప్తు చేయాలని శనివారం కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అయితే కాంగ్రెస్ పార్టీ చేసిన ఈ ఆరోపణలను ఎల్ఐసి ఖండించింది. కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు 'తప్పుడుది, నిరాధారమైనవి, సత్యదూరమైనవి' అని తిరస్కరించింది. అదానీ గ్రూప్‌కు ప్రయోజనం చేకూర్చేందుకు ఎల్ఐసి 30 కోట్ల మంది పాలసీదారుల పొదుపును క్రమపద్ధతిలో 'దుర్వినియోగం చేశారు' అని కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి ఇన్‌చార్జి కమ్యూనికేషన్స్ జైరాం రమేష్ ఆరోపించారు. మోదానీ జాయింట్ వెంచర్ వ్యవస్థ ఎల్ఐసి దాని 30 కోట్లమంది పాలసీదారులను ఎలా దుర్వినియోగం చేసిందనే విషయమై మీడియాలో కలవరపెట్టే వార్తా కథనాలు వచ్చాయని జైరాం రమేష్ శనివారం ఇక్కడ విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. 2025 మేలో అదానీ గ్రూప్ కంపెనీలకు చెందిన ఎల్ఐసి నిధుల నుండి దాదాపు రూ.33,000 కోట్లు పెట్టుబడులు పెట్టడానికి భారత అధికారులు ఒక ప్రతిపాదనను రూపొందించినట్లు అంతర్గత పత్రాలను ఉటంకిస్తూ వాషింగ్టన్ పోస్ట్ నివేదిక వెల్లడించిన అనంతరం ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ ఆరోపణల దాడికి దిగింది.అదానీ గ్రూప్ కంపెనీల మధ్య నిధుల బదిలీ నిబంధనలు ఉల్లంఘన కాదని పేర్కొంటూ, మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ అమెరికా షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ చేసిన తారుమారు ఆరోపణలను తొలగించింది. సుప్రీంకోర్టు జోక్యం తర్వాత సెబీ దర్యాప్తు ప్రారంభించబడింది. జైరాం రమేష్ తన ఎక్స్ పోస్ట్‌లో ఎల్ఐసి తన పెట్టుబడి నర్ణాయలు బాహ్యాకారకాలచే ప్రభావితం అయ్యాయని వాష్టింగ్టన్ పోస్ట్ చేసిన ఆరోపణ 'తప్పుడుది, నిరాధారమైనది, సత్యదూరమైనది' అని పేర్కొంది.

**కాంగ్రెస్ ఆరోపణలపై స్పందించని అదానీ గ్రూప్, కేంద్రం**

అదానీ గ్రూప్‌లో విశ్వాసాన్ని కలిగించడం, ఇతరుల పెట్టుబడిదారుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం అనేవి 'నివేదించబడిన లక్ష్యాలు' అని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థిక మంత్రిత్వ శాఖ, నీతి ఆయోగ్ అధికారులు ఎవరి ఒత్తిడితో తమ పని తీవ్రమైన నేరారోపణల కారణంగా నిధుల ఇబ్బందులను ఎదుర్కొంటున్న ఒక ప్రైవేట్ కంపెనీకి బెయిల్ ఇవ్వాలని నిర్ణయించుకున్నారు?. ఇది మొబైల్ ఫోన్ బ్యాంకింగ్ యొక్క టెక్స్ట్ బుక్ కేసు కాదా? అనే 'ఈ ప్రశ్న తలెత్తుతుంది' అని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరాం రమేష్ అన్నారు.

**ఆరోపణలపై ఎల్ఐసి ప్రతిస్పందన**

కాంగ్రెస్ పార్టీ చేసిన ఆరోపణలపై ఎల్ఐసి శనివారం ప్రతిస్పందించింది. అదానీ గ్రూప్ కంపెనీలలో తన పెట్టుబడులు స్వతంత్రంగా, బోర్డు ఆమోదించిన విధానానికి అనుగుణంగా వివరణాత్మకమైన జాగ్రత్తల ప్రకారం జరిగాయని తెలిపింది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ఆర్థిక సేవల విభాగం లేదా మరే ఇతర సంస్థకు అటువంటి (పెట్టుబడి నిర్ణయాలలో) ఎటువంటి పాత్ర లేదు అని ఎల్ ఐసి తన 'ఎక్స్'లో చేసిన ఒక ప్రకటనలో తెలియజేసింది. భారతదేశంలోని అతిపెద్ద బీమా సంస్థ కొన్ని సంవత్సరాలుగా ప్రాథమిక అంశాలు వివరణాత్మక శ్రద్ధ ఆధారంగా కంపెనీలలో పెట్టుబడి నిర్ణయాలు తీసుకుంది. భారతదేశంలోని టాప్ 500 కంపెలలో దాని పెట్టుబడి విలువ 2014 నుండి 10 రెట్లు పెరిగింది. బలమైన విధినిర్వహణను ప్రతిబింబిస్తూ రూ.1.56 లక్షల కోట్ల నుండి రూ.15.6లక్షల కోట్లకు పెరిగింది. బోర్డు ఆమోదించిన పాలసీల ప్రకారం వివరణాత్మకమైన శ్రద్ధ తర్వాత పెట్టుబడి నిర్ణయాలను ఎల్ఐసి స్వతంత్రంగా తీసుకుంటుందని ఎల్ఐసి తెలిపింది. ఎల్ఐసి తన పెట్టుబడి నిర్ణయాలలో ఆర్థిక సేవల విభాగం లేదా ఏదైన సంస్థకు ఎలువంటి పాత్ర లేదని స్పష్టం చేసింది. ఎల్ఐసి బాగా స్థిరపడిన నిర్ణయం తీసుకునే ప్రక్రియను పక్షపాతంతో, భారతదేశంలో ఎల్ఐసి ఖ్యాతిని, బలమైన ఆర్థిక రంగ పునాదులను దెబ్బతీసే ఉద్దేశ్యంతో ప్రకటనలను కలిగి ఉన్నారని ఎల్ఐసి పేర్కొంది. ఈ బీమా సంస్థ ఒక చిన్న ప్రయోజన నిధి కాదని తెలిపింది. రూ.41లక్షల కోట్లకు పైగా (యుఎస్‌డి కంటే ఎక్కువ)ఆస్తులను కలిగి ఉన్న భారత సంస్థాగత పెట్టుబడిదారు. ఇది దాదాపు ప్రతీ ప్రధాన వ్యాపార సమూహం, రంగంలో విస్తరించి ఉన్న 351 పబ్లిక్‌గా జాబితా చేయబడిన స్టాక్‌లలో (2025నాటికి) పెట్టుబడి పెడుతుందని వివరించింది. అదానీ స్టాక్‌లలో ఎల్ఐసి 4శాతం (రూ.60,000కోట్లు) వాటాను కలిగి ఉందని తెలిపింది. ఈక్విటీ వైపు అదానీ ఎల్ఐసియొక్క అతిపెద్ద హోల్డింగ్‌రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కాదని, ఐటిసి, టాటా గ్రూప్ అని వెల్లడించింది.

## మా ప్రకటనతో బిజెపి భయపడుతున్నది

**డిప్యూటీ సిఎంగా ఇబిసి అభ్యర్థిని ఎంపిక చేయడంపై తేజస్వీ యాదవ్**



**పాట్నా:** అత్యంత వెనుకబడిన (ఇబిసి) వర్గాలకు చెందిన వ్యక్తిని డిప్యూటీ సిఎంగా 'ఇండియా' కూటమి ప్రకటించడంతో బిజెపి భయపడుతున్నదని బిహార్ ముఖ్యమంత్రి అభ్యర్థి, ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్ వ్యాఖ్యానించారు.
పాట్నాలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా అనేక మంది బిజెపి నేతలు మైనారిటీలను అక్రమణదారులుగా పేర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇండియా' కూటమి డిప్యూటీ సిఎం అభ్యర్థిగా ముస్లిం నేతను ఎందుకు ప్రకటించలేదని తమను అడుగుతున్నారని, దీనిని బట్టి వెనుకబడిన వర్గాల పట్ల బిజెపికి ఎంత ద్వేషం ఉన్నదనే విషయం బయటపడుతున్నదని తేజస్వీ అన్నారు. ముఖేశ్ సాహ్నిని ఉప ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించడాన్ని బిజెపి నేతలు పదేపదే ప్రశ్నిస్తున్నారని, ఇబిసి పట్ల వారికి సానుకూల అభిప్రాయం లేదని విమర్శించారు. ఒక ఇసిబి నేతను ఉపముఖ్యమంత్రిగా ప్రకటిస్తే ఎందుకు అసహనానికి గురవతున్నారంటూ అమిత్ షాను ప్రశ్నించారు. బిజెపి నేతలు పదే పదే మైనారిటీలను ద్వేషిస్తున్నారని, అంతటితో ఆగకుండా, పాకిస్థాన్‌కు తిరిగి పంపిస్తామంటూ బెదిరిస్తున్నారని తేజస్వీ అన్నారు. మరోవైపు మైనారిటీలకు డిప్యూటీ సిఎం అవకాశం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. అన్ని మతాలు, వర్గాలకు ఈ దేశంలో నివసించే అధికారం ఉందని, దానిని కాదనే హక్కు బిజెపికి లేదని అన్నారు. గుజరాత్‌కు చేసిన దానిలో బిహార్‌కు ఒక శాతం కూడా పనులు చేయలేదని తేజస్వీ ఆరోపించారు. బిహార్ ప్రజలు అమాయకులు కాదని, వారు ప్రతీ విషయాన్ని అర్థం చేసుకుంటారని తెలిపారు. కాగా 'ఇండియా' కూటమి బిహార్ ఉపముఖ్యమంత్రి అభ్యర్థిగా ఇబిసికి చెందిన వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ (విఐపి) వ్యవస్థాపకుడు ముఖేశ్ సాహ్నీ పేరును ప్రకటించింది. ముఖ్యమంత్రి అభ్యర్థిగా తేజస్వీ యాదవ్ పేరును వెల్లడించిన విషయం తెలిసిందే. మహాఘట్‌బంధన్ అధికారంలోకి వచ్చిన 20 రోజుల్లోనే బిహార్‌లో ప్రతి కుంటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చేలా చట్టాన్ని తీసుకువస్తామని తేజస్వీ ప్రకటించారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి మాత్రమే కాదని, బిహార్‌ను నిర్మించేందుకు తాను ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని ఆయన చెప్పారు. ఖగారియా జిల్లాలోని గోగ్రిలో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న తేజస్వీ యాదవ్ బిహార్‌ను నంబర్‌వన్‌గా మారుస్తానని చెప్పారు. ఇందుకోసం రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడం, విద్యను ప్రోత్సహించడం, సరైన ఆరోగ్య సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు.

# బిహార్ రైళ్లల్లో ప్రయాణం నరకప్రాయం



**న్యూఢిల్లీ:** బిహార్‌లోని రైళ్లల్లో ప్రయాణం నరకప్రాయంగా మారిందని కాంగ్రెస్‌పార్టీ నాయకుడు, లోక్‌సభలోప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ విమర్శించారు. బీహార్‌లో డబుల్ ఇం జన్ ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారంలో విఫలమైందని విమర్శించారు. రాష్ట్రంలో ఉపాధి కొరవడినందువల్లే ప్రయాణాలు పెరిగి, రైళ్ళ న్నీ 200 శాతం ఓవర్‌లోడుతో వెళుతున్నాయ ని, టిక్కెట్లు తీసుకోవడం అసాధ్యంగా మారిందని ఎన్‌డిఏ మోసపూరిత విధానాలకు బీహార్‌లో నిస్సహాయ రైలు ప్రయాణికులే ఒక నిదర్శనమన్నారు. ముఖ్యంగా పండుగ సమయాల్లో బీహార్ రైళ్ళల్లో సాధారణ ప్రయాణం అసాధ్యమైపోతోందన్నారు. రైళ్ళన్నీ కిక్కిరిసి, ప్రయాణం అ మానవీయంగా మారడంతో ప్ర యాణికులు నిస్సహాయస్థితిలో ఉండిపోతున్నారన్నారు.ఎక్స్‌వేదికగాఈమేరకు శనివారం ఒక పోస్టింగ్ పెట్టడమే కాకుండా కిక్కిరిసి వెళుతున్న రైలు, రైల్వేస్టేషన్‌లో కిక్కిరిసిన ప్రయాణికుల వీడియోను ఆయన షేర్ చేశారు. మరోవైపు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒక రైలుకు జెండా ఊపుతున్న దృశ్యాన్ని కూడా షేర్ చేశారు. "ఇది పండుగుల నెల, దీపావళి, భాయ్ దూజ్,ఛాత్‌వంటి ఎన్నో పండుగలు ఈ నెలలో ఉన్నాయి. బీహార్‌లో ఈ పర్వదినాలకు ఎంతో ప్రాధాన్యం ఉంది, పండుగ అంటే ప్రజల విశ్వాసం మాత్రమే కాదు, సంపాదించిన సొమ్మును ఇంటికి తీసుకువెళ్ళడం కూడా, తమ సొంత ఊరు గాలి పీల్చుకుని, కుటుంబంతో గడిపి వారి ప్రేమాభిమానాలు పొందడం ద్వారా గ్రామాలలో ఆనందంగా తిరిగి మళ్ళీ వారంతా ఉత్సాహం పొందుతారు, అలాంటప్పుడు సొంత ఊరుకు వెళ్ళడానికి సౌకర్యంగా, స్వేచ్ఛగా సురక్షితంగా ప్రయాణం చేయడం వారి హక్కు, అదేమీ ప్రయాణికులుకు మేలు చేసినట్లు కాదు" అని ఎన్‌డిఏ విధానాలపై విమర్శలు కురిపించారు."సంపాదనకోసం వారెంతో కష్టపడుతున్నారు, పోరాటం చేస్తున్నారు, తీరా ఇంటికి వెళదామనుకునేసరికి రైళ్ళన్నీ కిక్కిరిసిపోతున్నాయి, టిక్కెట్లు తీసుకోవడం ఎంతో అసాధ్యంగా మారుతోం ది. ఇక ప్రయాణం చేయ డం అమానవీయంగా, నరకతుల్యంగా మారింది. అనేక రైళ్ళు 200 శాతం మేరకు మితిమీరినస్థాయిలో ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. ప్రభుత్వం చేసిన వాగ్దానాలన్నీ వట్టిబూటకంగా మారాయని విమర్శించారు. "12000 ప్రత్యేక రైళ్ళు ఎక్కడికెళ్ళాయి? అవన్నీ ఏమైపోయాయి? ఏటేటా పరిస్థితి ఎందుకు దిగజారుతోంది? బీహార్‌లో ప్రజలు ఎందుకని విషాదకరమైన పరిస్థితుల్లో ఏటేటా భారీ సంఖ్యలో తిరిగి ఇళ్ళకుచేరుకుంటున్నారు?" అని రాహుల్ గాంధీ ప్రశ్న వర్షం కురిపించారు. ఉపాధి,మర్యాదపూర్వకమైన జీవితం బీహార్‌లో నిజంగా దొరికినట్లయితే, ప్రజలు ఇలా లక్షలమంది వేలాది కిలోమీటర్లు తిండి, పని వెతుక్కుంటూ తిరగాల్సినఅవసరంఏముంటుందని ప్రశ్నించారు. "ఇదంతా కేవలం రైళ్ళలో ప్రయాణికులు నిస్సహాయ స్థితిలోప్రయాణంచేయడానికి మాత్రమే పరిమితం కాదు, ఎన్‌డిఏమోసపూరితవిధానాలకుఒక ప్రత్యక్షనిదర్శనం, సురక్షితమైనప్రయాణంచేయడంవారి హక్కు, అది వారికి మేలుచేసినట్లుకాదు,ఆహక్కు లభించడంలేదు" అన్నారు.

## అందరి ఫోన్లపై నిఘా ఉంది..

**మహారాష్ట్ర మంత్రి కీలక వ్యాఖ్యలు**

మహారాష్ట్రలో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో మహారాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి చంద్రశేఖర్ బవంకులే చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. చంద్రశేఖర్ మాట్లాడుతూ.. అందరి ఫోన్లు, వాట్సప్ ఖాతాలపై నిఘా ఉంచామని వ్యాఖ్యానించారు. దీనిపై పలువురు నేతలు విమర్శలు వ్యక్తం చేయడంతో మంత్రి నాలుక్కరుచుకున్నారు. తాను భాజపా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడానని.. ప్రజలను ఉద్దేశించి కాదని స్పష్టతనిచ్చారు.ఇటీవల జరిగిన ఓ భాజపా కార్యక్రమంలో మహారాష్ట్ర రెవెన్యూ మంత్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. అందరి ఫోన్లపై తాము నిఘా ఉంచామని.. ఇకనైనా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దీనిపై శివసేన ఎంపీ సంజయ్‌రౌత్ స్పందిస్తూ తీవ్ర విమర్శలు చేశారు. తమ పార్టీ ప్రజల ఫోన్‌లను నిఘాలో ఉంచినట్లు పేర్కొన్న చంద్రశేఖర్‌ను అరెస్టు చేసి.. ఈ విషయంలో దర్యాప్తు చేపట్టాలని అధికారులను కోరారు. దీనిపై మంత్రి తాజాగా స్పష్టతనిచ్చారు. తాను ప్రజలందరినీ ఉద్దేశించి ఆ వ్యాఖ్యలు చేయలేదని.. తమ పార్టీ కార్యకర్తల గురించి మాట్లాడానన్నారు. భాజపా బూత్ చీఫ్‌ల లక్ష వాట్సాప్ గ్రూపులు పార్టీ వార్ రూమ్‌కు అనుసంధానించి ఉంటాయని.. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఈ విషయంపై వారికి హెచ్చరికలు చేశానని తెలిపారు.పార్టీ కార్యకర్తలు చేసే పనులు, వ్యాఖ్యలు, వాట్సాప్‌లో వచ్చే ప్రతిచర్యలను తమ వార్ రూమ్ సమీక్షిస్తుందనే ఉద్దేశంతో అందరి ఫోన్లు నిఘాలో ఉంటాయని వ్యాఖ్యానించినట్లు వెల్లడించారు. వాటి ఆధారంగానే పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తుందన్నారు.

# 'పిఎంశ్రీ' ఎంఒయుపై కేరళ సంతకం...

**సిపిఐ నాయకుల నిరసన గళం**

**తిరువనంతపురం :** ప్రధానమంత్రి శ్రీ పథకం ఎంఒయుపై కేరళ ప్రభుత్వం భాగస్వామ్యపక్షాలను ఒప్పించకుండానే సంతకం చేయడంపై రాజకీయ దుమారం రేగుతోంది. ఈ ఏకపక్ష ధోరణిని వ్యతిరేకిస్తూ అధికార భాగస్వామ్యపార్టీయైన సిపిఐ నాయకులు మరికొందరి నుంచి తీవ్రస్థాయిలో నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వం కేంద్రం యొక్క ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పిఎం శ్రీ) పథకం ఎంఒయుపై సంతకం చేయడాన్ని ఆక్షేపిస్తూ ఆ ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని సిపిఐ నాయకులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. కేరళ రాష్ట్రంలో అధికార ఎల్‌డిఎఫ్‌లో కీలక భాగస్వామియైన సిపిఐ ఇప్పటికే సిపిఐ(ఎం) పార్టీ సహా రాష్ట్ర ప్రభుత్వానికి తన అసమ్మతిని తెలియజేసింది. సిపిఐ కేంద్ర కమిటీ సభ్యుడు ప్రకాశ్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం తప్పకుండా మెమోరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్ (ఎంఒయు)ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇది ఒక రాజకీయ డిమాండ్ కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం తప్పకుండా పిఎంశ్రీ నుండి ఉపసంహరించుకోవాల్సిందేనని ఆయన అన్నారు. జాతీయ విద్యా విధానం (ఎన్‌ఇపి) అమలు చేయబడదని విద్యా శాఖ మంత్రి ప్రకటన జారీచేయడం అనేది తప్పు అన్నారు. పిఎం శ్రీలో ఎన్‌ఇపి అమలు చేయడం అనేది మొట్టమొదటి షరతు అని ప్రకాశ్‌బాబు చెప్పారు. కాగా సిపిఐ మంత్రి జె.చించురాణి మాట్లాడుతూ రాష్ట్ర మంత్రివర్గంలో పిఎం శ్రీ పథకంపై రెండు సార్లు చర్చించామని, సిపిఐ మంత్రులు వ్యతిరేకించారని జె.చించురాణి తెలిపారు. ఆ తర్వాత దీనిని ఎలా చేపట్టారో, ఆ ఒప్పందంపై ఎవరు సంతకం చేశారో మాకు తెలియదని, ఈ నెల 27న మా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తదుపరి నిర్ణయం తీసుకుంటారని ఆమె చెప్పారు.సిపిఐ మంత్రులు, నాయకులు ఈ అవగాహన ఒప్పందంపై సంతకం చేయడం గురించి మీడియా ద్వారానే తెలుసుకున్నారని చెప్పారు. ఆర్‌ఎస్‌ఎస్ ఆలోచనను పాఠ్యాంశాలలో చేర్చడం వల్ల పిఎం శ్రీ పథకాన్ని అమలు చేయకూడదని మేం ఇంతకుముందే చెప్పాం. మేం దానితో ఏకీభవించడం లేదు అని సిపిఐ మంత్రి జె.చించురాణి వివరించారు.

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వంను కలిసి చర్చలు జరిపిన కేరళ విద్యా శాఖ మంత్రి శివన్‌కుట్టి**

కేంద్రం యొక్క పిఎం శ్రీ పథకం కోసం ఎంఒయుపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై రెండు ఎల్‌డిఎఫ్ భాగస్వామ్య పార్టీల మధ్య ఉద్రిక్తతలను తగ్గించడానికి కేరళ సాధారణ విద్యా శాఖ మంత్రి వి.శివన్‌కుట్టి తిరువనంతపురంలోని సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వంను కలిసి చర్చలు జరిపారు. మంత్రి శివన్‌కుట్టి శనివారం మధ్యాహ్నం సిపిఐ రాష్ట్ర కార్యాలయం ఎంఎన్ స్మారకానికి చేరుకుని బినోయ్ విశ్వంతో చర్చలు జరిపారు. గంటకు పైగా జరిగిన ఈ సమావేశంలో సిపిఐ మంత్రి జి.ఆర్.అనిల్‌కుమార్ పాల్గొన్నారు. సమావేశం తర్వాత మంత్రి శివన్‌కుట్టి విలేకరులతో మాట్లాడుతూ పిఎం శ్రీ సమస్య విషయమై చర్చ ప్రధానంగా దృష్టి సారించిందన్నారు.'నేను కామ్రేడ్ విశ్వంను కలవడానికి వచ్చాను. మంత్రి జి.ఆర్.అనిల్ కూడా అక్కడ ఉన్నారు. పిఎం శ్రీ ఎంఒయుపై సంతకానికి సంబంధించిన విషయాలపై మేం చర్చించాం' అని చెప్పారు. ఈ ఒప్పందంపై సంతకం చేయడం విషయం గురించి శుక్రవారంనాడు కేరళ రాష్ట్ర సిపిఐ కార్యదర్శి బినోయ్ విశ్వం మాట్లాడుతూ దీనిని 'లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ సమిష్టి క్రమశిక్షణను ఉల్లంఘించడమే' అని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.

**కేవలం సిపిఐనే కాదు...యావత్తు కేరళ రాష్ట్రాన్నే అంధకారంలో ముంచారు : కేరళ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత వి.డి. సతీషన్**

ప్రధానమంత్రి శ్రీ స్కూల్స్ ఎంఒయుపై సంతకం చేసే సమయంలో సిపిఐ(ఎం), ముఖ్యమంత్రి పినరయి విజయన్ కేవలం తన భాగస్వామ్య పార్టీ సిపిఐనే కాదు, యావత్తు కేరళ రాష్ట్రాన్నే అంధకారంలోకి నెట్టేశారని కాంగ్రెస్ పార్టీకి చెందిన కేరళ శాసనసభలో ప్రతిపక్షనేత వి.డి.సతీషన్ ఆరోపించారు. అక్టోబర్ 10న ఎంఒయు ఒప్పందంపై సంతకాలు చేశారని, అక్టోబరు 22న ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసిన వారం రోజులకు ముందే ఇది జరిగిందన్నారు. అక్టోబరు 22న రాష్ట్ర మంత్రివర్గం సమావేశమైనప్పుడు దానికి సమాచారం ఇవ్వలేదని కాంగ్రెస్ పార్టీ నేత, కేరళ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత కూడా అయిన వి.డి.సతీషన్ తెలిపారు.
ముఖ్యమంత్రి పినరయి విజయన్‌పై సంఘ్‌పరివార్ శక్తులు ఒత్తిడి తెస్తున్నాయని సతీషన్ ఆరోపించారు.


**BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL**

**ABR. NO. 331 OF 2025**

Between:-

**M/s. Shriram chits (India) Pvt Ltd., Hanamkonda Branch, Rep by its GPA Holder cum Legal Managar,**

**.....Disputant**

VERSUS

**A.SRIDHAR & OTHERS**

**......Opponents**

1. Anchuri Sreedhar S/O Mogilaiah Aged About 45 Years Occ:Pvt Lecturer. R/O. H.No. 38, Phase-II, Aparna plam Groves, Kompally, Hyderabad.

2. Kondooru Ashwini W/O Narender Aged About 40 Years Occ: Asst. Div. Eng/TSPGCL. R/O. H.No. 6-3-609 to 612/408, Apex Residency, Anand Nagar Colony, Khairathabad, Hyd.

3.Kondooru Narennder S/O Narasimha Aged About 44 Years Occ: Manager/BHEL-Hyd. R/O. H.No. 6-3-609 to 612/408, Apex Residency, Anand Nagar Colony, Khairathabad, Hyd.

4. Chanda Ramya D/O Satyanarayana Aged About 44 Years Occ: TGT/TSWREIS-Palaku rthi. R/O. H.No. 32-3-245,II Floor, Durganagar, ar, Roa Road No.3, Palivelpula Road, Hanamkonda.

5. Anchuri Vamshikrishna S/O Mogilaiah Aged About 34 Years Occ:Software Employe .R/O. H.No.202,129,130,MK Residency, Rajeshwaranagar, Kondapur, Rangareddy.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on. **07.11.2025** for your appearance. On that day you have you appear i person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.

**CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**


## పాదచారులపై దూసుకెళ్లిన కారు.. 5గురు మృతి

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ కారు అతివేగంగాదూసుకొచ్చి డివైడర్‌ను ఢీకొట్టి ఆ తర్వాత పాదచారులపైకి దూసుకెళ్లింది.అయిదుగురు మృతి చెందారు.మరో ఇద్దరు గాయపడ్డారు. గాయపడిన వారిని సరోజిని నాయుడు మెడికల్ కాలేజీలో చేర్చినట్లు ఎసీపీ శేషమణి ఉపాధ్యాయ తెలిపారు. ఆగ్రాలోని నాగ్లా బుది వద్ద ఈ దుర్ఘటన జరిగింది. మృతులను గుర్తించారు. బబ్లీ, భాను ప్రతాప్, కమల్, కష్ణ, బంటేశ్‌గా గుర్తించారు. భాను ప్రతాప్ అనే వ్యక్తి ఓ ప్రైవేటు కంపెనీలో పార్సిల్ డెలివరీ ఏజెంట్‌గా పని చేస్తున్నాడు. హై స్పీడ్‌తో కారు దూసుకువచ్చినట్లు ప్రత్యక్షసాక్షులు తెలిపారు.

## కోక్రాఝర్‌లో మావోయిస్టు కాల్చివేత

**కోక్రాఝర్:** అసోం కోక్రాఝర్‌జిల్లాలో మావోయిస్టును ఎన్‌కౌంటర్‌లో పోలీసులు కాల్చి చంపారు. కోక్రాఝర్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ పుష్పరాజ్ సింగ్ శనివారం పత్రికా గోష్ఠిలో మాట్లాడుతూ, ఇటీవల రైల్వే ట్రాక్‌పై ఐఇడి పేలుడు జరిగిందని, ఆ కేసులో అనుమానితుడుగా భావిస్తున్న మావోయిస్టును కాల్చి చంపామని చెప్పారు. ఐతే ఎన్‌కౌంటర్ జరిగిన సమయంలో దాదాపు 10 మంది మావోయిస్టులు అక్కడి ఉండి ఉంటారని, మిగిలిన తొమ్మిదిమందీ పారిపోయి ఉంటారని అంచనావేస్తున్నట్లు చెప్పారు. గురువారం కోక్రాఝర్‌లో పేలుడుకు సంబంధించిన కేసు వెనుక ఉగ్రవాదుల జాడ కనిపెట్టేందుకు నందగురిలో పోలీసులు గాలింపు చేపట్టారని, ఈ సందర్భంగా ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టును రోహిత్ ముర్ము (40)గా గుర్తించినట్లు చెప్పారు. అతడికి అసోం,జార్ఖండ్ వ్యాప్తంగా అనేక పేలుడు ఘటనలు, ఉగ్రవాద కార్యకలాపాలతో సంబంధాలు ఉన్నాయని చెప్పారు. "మావోయిస్టులు దాక్కున స్థావరంపై మా పోలీసులు దాడి చేయడానికి అక్కడికి చేరుకున్నారు. వెంటనే వారు కాల్పులు జరిపి అక్కడి నుండి పరారయ్యేందుకు యత్నించారు, మా పోలీసులు తిరిగి కాల్పులు జరిపారు, వారు పారిపోయారు, ఆ ప్రాంతాన్ని గాలించినప్పుడు గాయపడిన తీవ్రవాది కనిపించాడు, అతడిని ఆసుపత్రికి తరలించాం, కానీ అప్పటికే అతడు మరణించినట్లు వైద్యులు ప్రకటించారు" అని ఎస్‌పి పుష్పరాజ్ సింగ్ చెప్పారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో ఒక పిస్తోలు, రెండు గ్రెనేడ్స్, ఓటరు కార్డు, ఆధార్ కార్డు లభించాయని చెప్పారు. హతుణ్ణి అపిల్ ముర్ము అలియాస్ రోహిత్ ముర్ముగా గుర్తించామని చెప్పారు. 2015 నుండి రోహిత్ ముర్ము క్రియాశీల కార్యకలాపాలలో నిమగ్నమై ఉన్నాడని చెప్పారు. గత ఏడాది అక్టోబరులో రైలు పేలుడు ఘటనలో కూడా ఇతడు నిందితుడని చెప్పారు.


**SHRIRAM Finance** వాహనముల బహిరంగ వేలం ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | AP15BA-3459 | Parasharamulu Maddula | Indica Vista VX Tech BS4 Diesel EL 5 Seat | 2012 |
| 2 | TS02FJ8661 | Arepalli Shiva Krishna | New Holland 4710 | 2023 |
| 3 | TS03UA3476 | Durgam Sampath | John Deere 5042 | 2014 |
| 4 | TS27T4478 | SAGAR PANJALA | Sonalika DI 740 | 2019 |
| 5 | TS03UC1404 | KARTHIK BIOINI | Tata Ace | 2018 |
| 6 | TS03EP7727 | KEERTHI RAKESH | John Deere 5310 Harvester | 2017 |
| 7 | TS22T7365 | Sayyad Gorebee | Swarah 843 XM | 2019 |

**AUCTION DATE: 28-10-2025**

VENUE : SHRIRAM AUTOMALL, KARIMNAGAR, ALUGUNURU, HYDERABAD ROAD, KARIMNAGAR

గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును

**SHRIRAM FINANCE LIMITED**
H.No :12-209/1,1st floor, Upstairs of Telangana Grameena Bank, Warangal Road, Huzurabad. Cell : 7702785091



**BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL**

**ABR. NO. 330 OF 2025**

Between:-

**M/s. Shriram chits (India) Pvt Ltd., Hanamkonda Branch, Rep by its GPA Holder cum Legal Managar,**

**.....Disputant**

VERSUS

**M.KARTHIK & OTHERS**

**.....Opponents**

1. Muppidi Karthik S/O M.Janardhan Aged About 36 Years Occ: Police Constable. R/O. H.No. 25-8-196, Bapujinagar, Kazipet, Hanamkonda.

2. Praveen Sulthana W/O Manzoor Ahmed Aged About 48 Years Occ:Tech-I/SCR/KZPT. R/O. Q.No. 295/3, Type-II, Rly Qters, Shanthinagar, Kazipet, Haanmkonda.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on. **07.11.2025** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.

**CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS WARANGAL.**



**BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ABR. NO. 328 OF 2025**

Between:-

**M/s. Shriram chits (India) Pvt Ltd., Hanamkonda Branch, Rep by its GPA Holder cum Legal Managar,**

**.....Disputant**

VERSUS

**K.R.PRATHUSHA & OTHERS**

**......Opponents**

1. K.R.Prathusha W/O K.R. Srujan Kumar Aged About 32 Years Occ:Pvt.Teacher. R/O H.No. 25-8-8/3, Bapujinagar, Bhavaninagar, Kazipet, Hanamkonda.

2. K.R.Srujankumar S/O K.R.Janardhan Aged About 41 Years Occ:Jr.Asst.Agricluture Reserch Station. R/O. H.No.25-8-8/3,Bapujinagar, Bhavaninagar, Kazipet, Hanamkonda.

3. Kottem Agaiah S/O Lachaiah Aged About 54 Years Occ:Teacher P.S.Danthalapally. R/O. H.No. 2-61, Vill:Macharla,Mdl:Gudur, Mahabubabad.

4. Dasharathi Neeraja W/O Srinivasulu Aged About 57 Years Occ: MPHA(F) PHC Banojipet. R/O. H.No.6-77, Ashoknagar, Khanapuram, Warangal.

5. Bommakanti Sudeerbabu S/O B.N.Ramaiah Aged About 58 Years Occ:Teacher MPP S.Maddelakunta.R/O.H.No.23-6-135/1.Durgadevi Colony, Hunter Road, Hanamkonda.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on. **07.11.2025** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.

**CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS WARANGAL.**



**BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL**

**ABR. NO. 329 OF 2025**

Between:-

**M/s. Shriram chits (India) Pvt Ltd., Hanamkonda Branch, Rep by its GPA Holder cum Legal Managar,**

**...Disputant**

VERSUS

**G.VENU & OTHERS**

**......Opponents**

1. Godishala Venu S/O Komuraiah Aged About 49 Years Occ: Business. R/O. H.No. 17-1- 294/B, Kareemabad, Warangal.

2.Azmeera Mitya S/O Azmeera Veerya Ahmed Aged About 49 Years Occ: Business.R/O. H.No.29-1-54/A, Peerla Gutta, Chinthagattu Camp, Hanamkonda.

3. Yedlapelli Radhakrishna S/O Chowdharaiah Aged About 54 Years Occ: Business. R/O. H.No. 16-7-244, Dayanand Colony, Near Venkatramana Theater, Warangal.

4. Poojari Shobha D/O Sammaiah Aged About 46 Years Occ: Staff Nurse/MGM Hospital warangal R/O. H.No. 16-8-51/15, Abbanikunta, Mills Colony, Warangal.

5. Patti Vishnu Vardhan Reddy S/O Satyanarayana Aged About 48 Years Occ: Business. R/O. H.No. 2-7-1103/5A, Kankadurga Colony, Subedari, Hanamkonda.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on. **07.11.2025** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.

**CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS WARANGAL.**



**BEFORE THE HON'BLE CHIT ARBITRATOR THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL**

**ABR. NO. 327 OF 2025**

Between:-

**M/s. Shriram chits (India) Pvt Ltd., Hanamkonda Branch, Rep by its GPA Holder cum Legal Managar,**

**...Disputant**

VERSUS

**J.SRINIVAS & OTHERS**

**......Opponents**

2.Puchakayala Krishna S/O Venkataiah Aged About 37 Years Occ: Tech-I (Mechanical) R/O. H.No. 1-2-74. Hanumanthuni Gadda, Harizana wada, Mahabubabad.

4. Pesaru Vinay S/O Ravinder Aged About 30 Years Occ:PLF-III/Rly/KZT. R/O. H.No. 8-106, 8th Ward, Kadipikonda, Hanamkonda.

Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on. **07.11.2025** for your appearance. On that day you have you appear in person at **11-00 a.m** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.

**CHIT ARBITRATOR/ DEPUTY REGISTRAR OF CHITS WARANGAL.**





## అతిచిన్న అణు బ్యాటరీ..




అత్యంత శక్తివంతమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చైనా చేసిన ఓ ఆవిష్కరణ అందరినీ సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తున్నది. చైనా శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన ఒక నాణెం పరిమాణంలో ఉన్న అణు బ్యాటరీ ఏకంగా 50 సంవత్సరాల పాటు నిరంతర శక్తి ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఇందుకు ఎలాంటి రీచార్జింగ్ అవసరం లేదు. మూల రేడియోధార్మిక ఐసోటోప్స్, అధునాతన సెమీకండక్టర్లుని ఉపయోగించి, ఈ బ్యాటరీ అణు వికిరణాన్ని సురక్షిత విద్యుత్తుగా మారుస్తుంది. ఫలితంగా పర్యావరణానికి హాని లేకుండా, నిరంతర, స్థిర శక్తి ఉత్పత్తి సాధ్యమవుతుంది. ఈ బ్యాటరీని ముఖ్యంగా చిన్న ఎలక్ట్రానిక్ పరికరాలు, ఉపగ్రహాలు, అలాగే వైద్య పరికరాల ఇంప్లాంట్స్ కోసం రూపొందించారు. భవిష్యత్తులో ఇది సెన్సర్లు, గాడ్జెట్లు, లేదా ఎలక్ట్రిక్ వాహనాలకూ నిరవధిక శక్తినందించగల స్థాయికి చేరుకోనుంది. సాంప్రదాయ బ్యాటరీలతో పోలిస్తే, ఇందులో ఎటువంటి కదిలే భాగాలు ఉండవు. కెమికల్ రసాయన మార్పులు జరగవు. అలాగే కాలుష్య ఉద్గారాలు వెలువడవు. శాస్త్రవేత్తల ప్రకారం, ఇందులోని రేడియేషన్ పూర్తిగా కప్పబడి ఉంటుంది. కాబట్టి దీని వాడకం వినియోగదారులకు సురక్షితం. ఈ టెక్నాలజీ వాణిజ్యపరంగా విస్తరిస్తే, ఛార్జింగ్ వైర్లు, పవర్ అవుట్‌లెట్స్ లేదా బ్యాటరీ మార్పులు అవసరం లేకుండా మనం గాడ్జెట్లను, వాహనాలను అనేక దశాబ్దాల పాటు ఉపయోగించగల కాలం వస్తుంది. ఈ ప్రయోగాన్ని శక్తి వినియోగంలో విప్లవాత్మక దిశగా చైనా వేసిన మరొక ముందడుగుగా శాస్త్రవేత్తలు అభివర్ణిస్తున్నారు. భవిష్యత్తులో మన పరికరాలు దశాబ్దాల పాటు ఒక్క ఛార్జ్‌తోనే నడవగలవు అనే ఆలోచన ఇప్పుడు విజ్ఞానకల్పన కాదు... చైనా చేసి చూపిస్తున్న ఓ అద్భుతం. ఇది చైనా శక్తి సాంకేతికతలో కొత్త యుగానికి సంకేతం.

## ప్రకృతి సృష్టించే అద్భుతం..



దక్షిణ కొరియాలో 'జిండో సీ పార్టింగ్' అని పిలిచే ప్రకృతి అద్భుతం ఏటా రెండు పర్యాయాలు ఆవిష్కృతమవుతుంది. జిండో, మోడో ద్వీపాల మధ్య సముద్రం ఆ సమయంలో విడిపోతుంది. నీటి మధ్య నుంచి ఒక మార్గం ఏర్పడుతుంది. ఏటా మార్చి లేదా ఏప్రిల్ నెలల్లో ఒకసారి, సెప్టెంబర్ లేదా అక్టోబర్ నెలల్లో మరోసారి ఈదారి కేవలం గంట సేపు మాత్రమే కనిపించడం మరో వింత. ఈ విచిత్రాన్ని చూడడానికి ప్రజలు వేలాదిగా అక్కడికి చేరుకుంటారు. సముద్రంపై నడిచే అవకాశాన్ని పొందుతారు. ఈ మార్గం సుమారు 2.8 కిలోమీటర్ల పొడవు, 40 మీటర్ల వెడల్పుతో ఉంటుంది. ఈ అద్భుతానికి, స్థానికుల ఆచార సంప్రదాయాల ప్రకారం, 'మోజెస్ మిరాకిల్' అనే పేరు కూడా ఉంది. జిండో ద్వీపంలో నివసించే ప్రజలు ఈ సందర్భంగా సంప్రదాయ సంగీతం, నృత్యం, పోటీలు, సముద్రపు ఆహార పండుగలు నిర్వహిస్తారు. స్థానికుల విశ్వాసాలు ఎలా ఉన్నప్పటికీ, శాస్త్రవేత్తలు మాత్రం దీనిని ప్రకృతి సహజ ప్రక్రియగా అభివర్ణిస్తారు. సముద్రంలో నీటి ప్రవాహానికి తోడ్పడే ప్రత్యేక 'టైడల్ హార్మోనిక్స్' కారణమని అంటున్నారు. చంద్రుడు, సూర్యుని ప్రభావంతో వచ్చిన అలల తేడాల వల్ల ఈ మార్గం బయట పడుతుంది. ఎంతో సందడితో, మరెంతో ఉత్సాహంగా జరిగే వేడుకగా, ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులను ఆకర్షించే వేదికగా మారుతుంది.

## అత్యంత తక్కువ సమయ గణన ఏది?



సాధారణంగా ఈ ప్రశ్నకు సెకను అనే సమాధానం వస్తుంది. ఆధునిక శాస్త్ర పరిజ్ఞానం ఉన్నవారు సెకనులో వందో వంతు 'జిఫ్పీ'ని పేర్కొంటారు. కానీ, శాస్త్రవేత్తలు ఇటీవల ఎవరూ ఊహించలేని రీతిలో 'జెప్టో సెకండ్' కాల గణన చేశారు. ఒక సెకనును ఒక బిలియన్ (100 కోట్లు)గా విభజిస్తే వచ్చే కాలాన్ని తిరిగి ఒక ట్రిలియన్ (100000 కోట్లు)తో విభజిస్తే వచ్చేదే 'జెప్టో సెకండ్'. సూక్ష్మంగా చెప్పాలంటే, 1 తర్వాత 27 సున్నాలు పెట్టుకొని లెక్కిస్తే, 'జెప్టో సెకండ్' ఎంత సూక్ష్మమో తెలుస్తుందేమో, కానీ, మన ఊహకు మాత్రం అందదు. గంటల కొద్దీ సమయాన్ని వృథా చేసేవారికి, ఈ సూక్ష్మ గణన తప్పకుండా చెప్పాలి. సమయ ప్రాధాన్యతను గుర్తుచేయాలి.

## మంచును ఒడిసిపట్టి..



పెరూ దేశంలో అత్యాధునిక మంచును ఒడిసిపట్టే నెట్ ప్రాజెక్టులు జోరందుకున్నాయి. అక్కడ అత్యధిక శాతం ప్రాంతాల్లో నీటి వనరులు చాలా తక్కువ. నీటి సమస్యను పరిష్కరించడానికి పెరూ చేపడుతున్న చర్యల్లో ఈ ప్రాజెక్టు ప్రాధాన్యతను సంతరించుకుంది. ఫైబర్ లేదా ప్లాస్టిక్ మెష్‌తో తయారు చేసిన పరదాలను, కొండ ప్రాంతాల్లో లేదా ఎండకు లోనైన భాగాల్లో కడతారు. గాలి ద్వారా వచ్చిన మంజు ఈ పదరాకు ఉన్న జాలీలల్లో చేరుతుంది. అందులోని సూక్ష్మ రంధ్రాలకు తడి కణాలు అంటుకొని, నీరుగా రూపాంతరం చెందుతుంది. ఆ నీరు నెట్ దిగువగా ఏర్పాటుచేసిన వాటర్ ట్యాంక్‌లోకి ప్రవహిస్తుంది. ఒక్కరోజుకి 200 నుంచి 400 లీటర్ల నీరు ఈ విధానంలో సేకరించవచ్చు. ఈ నీటిని పెరూ గ్రామాల్లో ప్రజలు తాగు, సాగు అవసరాలకు ఉపయోగిస్తున్నారు. అక్కడి వర్షపాతం తక్కువ. సంవత్సరానికి సగటున 1.5 సెం.మీ. మాత్రమే వర్షం నమోదవుతుంది. అలాంటి సమయాల్లో మంచును నీటిగా మార్చే నెట్ విధానం కొత్త నీటి వనరు అవుతుంది. కొన్ని ప్రాజెక్టుల్లో మహిళలు స్వయంగా నెట్‌లను తయారు చేయడం, నిర్వహించడం ద్వారా సామాజిక విజ్ఞానం పెరుగుతోంది. ఈ విషయంలో పెరూ మిగతా దేశాలకు మార్గదర్శకంగా ఉంది. వర్షాభావ పరిస్థితులు.. నీటి ఎద్దడి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఇలాంటి ప్రాజెక్టులు అత్యవసరమనే విషయాన్ని వెల్లడిస్తున్నది.

— బిఎస్ఎస్ మైత్రేయి

# రహదారి పెనువిషాదం

హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళుతున్న ప్రైవేటు స్లీపర్ బస్సు గురువారం అర్ధరాత్రి తర్వాత (శుక్రవారం) కర్నూలు సమీపంలో రహదారి ప్రమాదానికి గురై 19 మంది ప్రయాణీకులు సజీవదహనమైన ఘోరం రోడ్డు రవాణా చరిత్రలో అత్యంత విషాదకరమైన మరో దుర్ఘటన. ఆ అనూహ్యమైన ఆపత్సమయంలో ఇద్దరు డ్రైవర్లు, 44మంది ప్రయాణీకులు బస్సులో ఉన్నారు. అదృష్టం కొద్దీ డ్రైవర్లు, 25 మంది ప్రయాణీకులు స్వల్పగాయాలతో ప్రాణాలతో బయటపడ్డారు. ప్రయాణీకుల్లో అత్యధికులు గాఢనిద్రలో ఉన్న సమయం, బయటి వర్షం, గాఢమైన చీకటి, తగలబడుతున్న బస్సు పొగ – అంతటి భయంకర వాతావరణం లో సగంమందికిపైగా మృత్యుంజయులు కావటం నిజంగా వారి అదృష్టం. బస్సులో పల మిగిలినవి కాలిపోయి గుర్తుపట్టలేని స్థితిలో ఉన్న మృతుల మాంసం ముద్దలు, ఎముకల గూళ్లు. మరికొన్ని గంటల్లో గమ్యస్థానం చేరుకోవలసినవారు విగతజీవులుకావటం వారి కుటుంబాలకు, బంధుమిత్రులకు భరించరాని శోకం. ప్రమాదం ఎలా జరిగిందో భిన్న కథనాలు వెలుగులోకి వచ్చాయి. ఎదురుగా వస్తున్న మోటారుబైక్‌ను బస్సు వేగంతో ఢీకొనటంతో బైక్ బస్సు కిందకు వెళ్లి కొన్ని వందలమీటర్లు రోడ్డును ఈడ్చుకుంటూ వెళ్లిన నిముషాల్లో నిప్పురవ్వలు ఉత్పన్నమై బైక్ పెట్రోలు టాంకు నుంచి మంటలు వ్యాపించాయని, కొద్ది నిముషాల్లోనే మహావిషాదం జరిగిపోయిందని తొలివార్తలు తెలిపాయి. బైక్ నడుపుతున్న వ్యక్తి స్పాట్‌లోనే చనిపోయాడు. పోలీసు దరాప్తులో ఇప్పుడు కొత్తకోణం లభించింది. బైక్‌పై ఒకరు కాదు ఇద్దరున్నారు. ప్రమాద స్థలానికి 2కిలోమీటర్ల దూరంలోని పెట్రోలు బంకులో పెట్రోలు కొట్టించుకున్నట్లు సి.సి.ఫుటేజి దొరికింది. బైక్ అక్కడే జారిపడబోయింది. బైక్‌పై ఇద్దరు (శివశంకర్, ఎర్రిస్వామి) ప్రయాణిస్తుండగా ఆ చీకట్లో బైక్ డివైడర్‌కు కొట్టుకుంది. శివశంకర్ స్పాట్‌లోనే చనిపోయాడు. ఎర్రిస్వామి బైక్‌ను పక్కకులాగేందుకు ప్రయత్నిస్తుండగా వేగంగా స్లీపర్ బస్సు దూసుకువచ్చింది. ఎర్రిస్వామికి స్వల్పగాయాలైనా యి. కాబట్టి ఇది ఒకటికాదు, రెండు ప్రమాదాలుగా నిర్ధారించుకున్న పోలీసులు ఆ కోణం నుంచి దర్యాప్తు చేస్తున్నా రు.

ప్రజాపక్షం
26-10-2025, ఆదివారం

హైదరాబాద్‌లో బయలుదేరి ఆంధ్రప్రదేశ్ గుండా బెంగళూరు వెళుతున్న ఈ వాల్వోబస్సు ప్రమాదం వెలుగుచూడగానే ప్రయాణీకుల కుటుంబాల ఆక్రందనలు, నాయకుల సంతాపాలు, ప్రభుత్వ సహాయ ప్రకటనలు, అధికారులు రంగంలో దిగి సహాయక చర్యలు, పోస్టుమార్టం, శవాలను గుర్తించేందుకు డిఎన్‌ఎ పరీక్షలు, ఫోరెన్సిక్ పరీక్షలు చకచకా జరిగిపోతున్నాయి. బంధువులకు శవ అవశేషాల అప్పగింత ఆదివారం ప్రారంభమవుతుంది. రవాణాశాఖ అధికారులు తమ ఉనికిని చాటుకుంటూ ప్రైవేటు బస్సులపై తనిఖీల హడావిడి మొదలుపెట్టారు. కొద్దిరోజులకు అందరూ అన్నీ మరిచిపోతారు – మరో ప్రమాదం జరిగి ప్రాణాలు హరించేవరకు అంతా సవ్యంగా జరిగిపోతున్నట్లే భావించాలి!

2013 అక్టోబర్ 30 తెల్లవారుఝామున 5.10గంటల సమయంలో బెంగళూరు–హైదరాబాద్ జాతీయ రహదారిపై మహబూబ్‌నగర్ జిల్లా పాలెం మార్గంలో భీమావంతెన రెయిలింగ్ ఇనుపచువ్వకు వోల్వోబస్సు డీజిల్ ట్యాంక్ బలంగా తాకడంతో ఆ రాపిడికి నిప్పురవ్వలు పుట్టాయి. బస్సువేగంతోడై మంటలు వ్యాపించి 45మంది ప్రయాణీకులు అగ్నికి ఆహుతైన మహాఘోరం ప్రజలు, పాలకులు మరిచిపోయారు. ఇంతవరకు ఆ కేసులో తీర్పురాలేదు. కమ్యూనిస్టు నాయకులు పట్టువిడవకుండా న్యాయపోరాటం చేసి మృతుల కుటుంబాలకు బీమా సొమ్ము రాబట్టగలిగారు. కొద్దిరోజులక్రితం రాజస్థాన్‌లో ఇదే తరహా ప్రమాదంలో 29మంది ప్రయాణీకులు విగతజీవులైనారు.

ఈ తరహా ప్రమాదాలు, ముఖ్యంగా స్లీపర్ బస్సు ప్రయాణాల్లో సంభవిస్తూనే ఉన్నాయి. ముఖ్యమంత్రి నుంచి రాష్ట్రపతి, ప్రధాని వరకు సంతాప ప్రకటనలు, ఆర్థిక సహాయం ప్రకటనతోనే సరిపెట్టటం వల్ల ప్రయోజనమేమిటి? బస్సు ఓనర్లు ఎక్కడో ఈశాన్య రాష్ట్రాల్లో తమ బస్సులు రిజిస్టర్ చేయించి ఇక్కడ తిప్పుతున్నారు. రవాణా శాఖకు డబ్బులు జమచేసుకోవటంలో ఉండే శ్రద్ధ బస్సుల తనిఖీల్లో ఎందుకు ఉండటం లేదు? ప్రైవేటు ట్రావెల్స్‌కు రాజకీయ నాయకుల అండ లేదా రాజకీయ నాయకులే ఓనర్లు కావటం వల్ల ఆర్‌టిఎ అధికారులు సాహసించటంలేదా? దక్షిణాది రాష్ట్రాల్లో టాక్స్ చాలా ఎక్కువగా ఉండటం వల్లనే బస్సు యజమానులు సుదూర రాష్ట్రాల్లో రిజిష్టర్ చేయించుకుని, ఆల్ ఇండియా పర్మిట్ తీసుకోవటం లాభసాటిగా ఉన్నందునే ఆపనిచేస్తున్న మాట వాస్తవం కాదా? లోగడ దివాకర్ ట్రావెల్స్ కేసులో ఈ తతంగం బట్టబయలు కావటమే కాకుండా, నకిలీ డాక్యుమెంట్లతో డూప్లికేట్ నెంబర్లతో బస్సులు నడపటం వెలుగుచూసింది. 2017లో దివాకర్ ట్రావెల్స్ ఫ్లయ్‌ఓవర్ క్రాష్ కూడా గుర్తు చేసుకోదగింది. ఎన్నో లోపాలు, అవకతవకలు, అక్రమాలు, అవినీతి రాజ్యమేలుతున్న ప్రైవేటు ట్రావెల్స్ వ్యాపారాన్ని నియంత్రించటం ఈ రాజకీయ వ్యవస్థకు ఎలాగూ చేతకాదు. ఇప్పుడు ఎలక్ట్రిక్ బస్సులతో ఆర్‌టిసిలను పరోక్షంగా ప్రైవేటీకరిస్తున్నారు. సురక్షిత ప్రయాణంతో ప్రయాణీకుల ప్రాణాలు కాపాడటంకోసమైనా ఒక కచ్చితమైన, పకడ్బందీ, ఏకరూప రోడ్డు రవాణా విధానం రూపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం పూనిక వహించలేదా? కర్నూలు బస్సు ప్రమాదంలో తమ ఆప్తులను, ఆత్మీయులను కోల్పోయిన కుటుంబాలకు మా సానుభూతి తెలియజేస్తున్నాం.




కృష్ణ ఝా

## సోషలిస్టు ఆదర్శాలను వ్యాప్తి చేసిన...

# తమిళ ఆత్మగౌరవ ఉద్యమం

వర్గ సమాజంలో అట్టడుగు వర్గాలలో జీవించేవారిపై ఎవరో ఒకరు ఆధిపత్యం చెలాయించే వారు ఉంటారు. వారే దివిటీని పట్టుకొని మార్గాన్ని చూపిస్తుంటారు. అదే సమయంలో వారిని దహించే జ్వాలలను కూడా కలిగి ఉంటారు. బాధితులు తిరుగుబాటు చేసే ధైర్యం చేసినప్పుడు స్వార్థ ప్రయోజనాలు హింసను తలపెడతాయి. భూస్వాములు లేదా పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్నప్పటికీ, అది దోపిడీకి గురయ్యే వారిని అణిచివేసే ప్రమాదంగా మారుతుంది. ఎలాంటి నేరం చేయనప్పటికీ, వారు గతంలో ధనికుల కోసం కష్టపడడం, పోషించడం వంటివి చేసినప్పటికీ వారు శిక్షింపబడతారు. ఇది ప్రజాస్వామ్య స్వభావానికే ముప్పు. అంతే కాకుండా సమాజం మొత్తాన్ని ఏకీకృతం చేసేందుకు పోరాటాల ద్వారా ప్రయత్నిస్తూనే, జనసమూహాల ఐక్యతను విచ్ఛిన్నం చేస్తుంది.


అయితే, ఇది సామాజిక, ఆర్థిక వెనుకబాటుల మధ్య జీవించే ప్రజలను నిరంతరం గాయపరుస్తుంది. సమాజంలో సమానత్వం, సౌభ్రాతృత్వం వాగ్దానాలతో న్యాయబద్ధ వ్యవస్థ కోసం శోధించే ఉద్యమాలు, పలువురు ఉన్నత వ్యక్తులు ఈ అంశాన్ని పరిష్కరించారు. అందులో ఒకటి ఆత్మగౌరవ ఉద్యమం. నేటికి అది వందేళ్ళు పూర్తి చేసుకుంది. ఆత్మ గౌరవ ఉద్యమం, దాని లక్ష్యాలు పెద్ద ఎత్తున యువ కార్మికులు, విద్యార్థులను ప్రభావితం చేసాయి. నెమ్మదిగా అది సోషలిజం దిశగా కదిలింది.వలస పాలన చివరి 25 సంవత్సరాలలో తమిళనాడు రెండు ఉద్యమాల ఆవిర్భావాన్ని చూసింది. అవి ఆత్మ గౌరవ ఉద్యమం (ఇది పెరియార్ నేతృత్వం వహించిన ద్రవిడ ఉద్యమానికి పూర్వగామి), కమ్యూనిస్టు ఉద్యమం. మద్రాస్ ప్రెసిడెన్సీలో ఇ.వి.రామసామి పెరియార్ నేతృత్వంలోని ఆత్మగౌరవ ఉద్యమంలో అగ్రగామి కమ్యూనిస్టు, సంఘ సంస్కర్త ఎం.సింగారువేలు కీలక భాగస్వామి. 1920, 1930లలో వారి అనుబంధం ఉద్యమానికి సామ్యవాద, శాస్త్రీయ భౌతికవాద దృక్పథం కల్పించడానికి ఉపయోగపడింది.



రామసామి



సింగారవేలు



జీవానందం

సింగారువేలు, పెరియార్‌లు ఇరువురు 1920లలో కాంగ్రెస్ పార్టీలో అత్యంత సన్నిహితులు. మద్రాసులో 1923 మే 1వ తేదీన లేబర్ కిసాన్ పార్టీ ఆఫ్ హిందుస్థాన్ (కార్మికులు, రైతుల పార్టీ)ని సింగారవేలు స్థాపించారు. పెరియార్ సోషలిస్టు భావాలను స్వీకరించడంలో ఆయన గట్టి ప్రభావం చూపించారు. పెరియార్ తమిళ వార ప్రతిక 'కుడిఅరసు' కోసం సింగారవేలు సంఘ సంస్కరణ, సైన్స్, హేతువాదం, సామ్యవాదం అంశాలపై రాస్తుండేవారు.

1932లో పెరియార్ సోవియెట్ యూనియన్ పర్యటన తరువాత ఈరోడ్‌లో సింగారవేలు, ఇతర ఆత్మగౌరవ కార్యకర్తలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఉద్యమానికి సోషలిస్టు దృక్కోణాన్ని కల్పించేందుకు ఇరువురు కలిసి 'ఈరోడ్ ప్రణాళిక'ను రూపొందించి, స్వల్ప కాలం కొనసాగిన సమధర్మ (సోషలిస్టు) పార్టీ ఆఫ్ సౌత్ ఇండియాను స్థాపించారు. అదే సంవత్సరం శాసనోల్లంఘన ఉద్యమంలో చేరిన ఆత్మ గౌరవ ఉద్యమ కార్యకర్తలు భగత్‌సింగ్ సన్నిహిత సహచరుడు బటుకేశ్వర దత్ ప్రభావానికి లోనయ్యారు. నిజమైన విముక్తికి దారి తీసేందుకు సోషలిజం మాత్రమే మార్గమని జీవానందంతో పాటు, అనేక ఇతరుల మనసులో నాటారు.

విజ్ఞానశాస్త్రాన్ని అంకితభావంతో సమర్థించే సింగారవేలు ఉద్యమానికి శాస్త్రీయ, మార్క్సిస్ట్ నిర్వచనాన్ని అందించారు. ఆయన విధానం ఆచారాలను ప్రశ్నించడం కంటే దోపిడీ, అన్యాయం ఆర్థిక మూలాలను పరిష్కరించడంపై ఎక్కువగా ఉండేది. అదే సమయంలో ఆత్మగౌరవ ఉద్యమ కార్యకర్తలలో, ప్రత్యేకించి సోవియెట్ యూనియన్ సందర్శన తరువాత ఇ.వి.రామసామిలో అప్పటి వరకు కేవలం సామాజిక సంస్కరణ ఉద్యమంగా ఉన్న ఉద్యమ స్వభావాన్ని మార్చాలనే స్పష్టమైన కోరిక ఉండేది. తరువాత దానికి రాజకీయ లక్ష్యాలు జతయ్యాయి. అప్పుడు సింగారవేలు పర్యవేక్షణలో నూతన కార్యక్రమం రూపొందించబడింది. ఇ.వి.ఆర్. ఉండే చోట ఒక సమావేశం జరిగి, సమధర్మ పార్టీ ఆఫ్ సౌత్ ఇండియా అనే కొత్త పార్టీ ఏర్పాటైంది. ఆ పార్టీకి పి.జీవానందం కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

జీవానందం గాంధీ ఆదర్శాలు ఆధారంగా తన రాజకీయ జీవితాన్ని ఆరంభించారు. 1924లో వైకోంలోని దేవాలయానికి వెళ్ళే దారిలో దళితులను నిషేధించడంపై అగ్రవర్ణ హిందువులకు వ్యతిరేకంగా జరిగిన వైకోం సత్యాగ్రహంలో ఆయన పాల్గొన్నారు. సుచింద్రం దేవాలయంలో దళితుల ప్రవేశాన్ని డిమాండ్ చేస్తూ జరిగిన అలాంటి నిరసన కార్యక్రమంలో కూడా ఆయన పాల్గొన్నారు. వి.వి.అయ్యర్ నడిపే చేరన్‌మాదేవి ఆశ్రమంలో ఆయన చేరినప్పుడు, అక్కడ దళితులు, అగ్ర కులాల విద్యార్థులకు వేర్వేరు భోజనశాలలు ఉన్నట్లు గమనించారు. ఈ పద్ధతికి వ్యతిరేకంగా పెరియార్ చేపట్టిన నిరసనను ఆయన సమర్థించి, ఆశ్రమం నుంచి బైటకు వచ్చేశారు. అనంతరం ఆయన కరైక్కుడికి సమీపంలో సిరువయల్ వద్ద ఒక దాత నిధులతో ఏర్పాటు చేసిన ఆశ్రమం బాధ్యతలను స్వీకరించారు. ఆశ్రమ జీవితం ఆయనకు అనేక పుస్తకాలను చదివే అవకాశం కల్పించింది. ఈ ఆశ్రమంలోనే ఆయన గాంధీని కలిసారు. గాంధీ విధానాలను విభేదిస్తూ జీవా ఆయనకు ఒక లేఖ రాశారు.

గాంధీ మద్రాస్‌కు వచ్చినప్పుడు, ఆయన జేబులో ఆ లేఖ ఉంది. ఆయన జీవాను కలవాలని అనుకున్నారు. గాంధీ కలవాలనుకుంటున్న ఆ వ్యక్తి ఎవరో చెప్పాలని ఆయనను రాజగోపాలాచారి అడిగారు. అప్పుడు ఆయననే పిలిపించవచ్చునని అన్నారు. తాను ఆ వ్యక్తి పేరు చెప్పాలనుకోవడం లేదని, ఆయన నివసించే ఆశ్రమానికే వెళ్ళి, ఆయనను కలవాలని భావిస్తున్నట్లు గాంధీ అన్నారు. గాంధీ సిరువయల్ ఆశ్రమానికి వెళ్ళి, జీవా గురించి అడిగినప్పుడు 25 ఏళ్ళ యువకుడు ఆయన ముందు ప్రత్యక్షమయ్యాడు. తనకు లేఖ రాసిన వ్యక్తివి నువ్వేనా అని గాంధీ అడగగా, అవునని జీవా దృఢంగా బదులిచ్చారు.

తరువాత, 1937లో మద్రాస్ ప్రావిన్షియల్ కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ ఏర్పడినప్పుడు జీవానందం దానికి తొలి కార్యదర్శి అయ్యారు. రెండేళ్ళ తరువాత, మరో వెటరన్ ఉద్యమకారుడైన పి.రామమూర్తితో కలిసి ఆయన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)లో చేరారు.

తమిళనాడులో సిపిఐ తొలి సభ్యుడిగా నమోదయ్యే ముందు జీవానందం అంతకుముందు జరిగిన రెండు ఉద్యమాలలో క్రియాశీలకంగా పాల్గొన్నారు. ఆయన దేశభక్తే ఆయనను జాతీయ ఉద్యమం వైపు తీసుకెళ్ళింది. అంటరానితనం, కుల ఆధారిత వివక్షతల మీద వ్యతిరేకతే ఆత్మ గౌరవ ఉద్యమానికి ఆయన మద్దతిచ్చేలా చేసాయి.

సిపిఐలో చేరిన తరువాత జీవానందం, రామమూర్తిలు మార్క్సిస్ట్ కోణంలో రిక్షా కార్మికులు, ఫ్యాక్టరీ కార్మికులను సంఘటితపరిచారు. ఈ విషయంలో వారికి ఎం.ఆర్.వెంకట్రామన్, బి.శ్రీనివాసరావు వంటి నాయకులు సహకరించారు. మార్క్సిజం ఆధారంగా శక్తివంతమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించే ప్రయత్నాలలో జీవానందం అగ్రగామిగా ఉండేవారు. ఆయన ప్రసంగాలు, రచనలు తన కర్తవ్యాలను పూర్తి చేసేందుకు ఉపయోగపడేవి. కానీ, ఈ నాయకులు పోలీసు అణిచివేతకు గురై, అనేకమార్లు జైళ్ళలో బంధింపబడ్డారు. జీవానందం సున్నితమైన ప్రాంతాలకు వెళ్ళి, కార్మికుల పోరాట స్ఫూర్తిని సజీవంగా ఉంచేవారు. తంజావూరు, ఇతర జిల్లాల్లో పారిశ్రామిక కార్మికులు, వ్యవసాయ కూలీలు, చిన్నకారు రైతులను సంఘటితపరిచారు. జీవానందం, రామమూర్తి తమ శక్తివంతమైన ఉపన్యాసాలతో వేలాదిమంది ప్రజలను ఉత్తేజపరిచేవారు.

# సిజెఐ బిఆర్ గవాయ్‌పై దాడి యత్నం : అసలు కారణాలు ఏమిటి?



ఎం.కోటేశ్వరరావు

మనోభావాల మాటున ఎంతకైనా తెగించే శక్తులు రెచ్చిపోతున్న రోజులివి. అక్టోబరు ఆరవ తేదీన సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి భూషణ్ రామకృష్ణ (బిఆర్ ) గవాయ్‌పై రాకేష్ కిషోర్ అనే 71 ఏండ్ల న్యాయవాది కోర్టు హాలులో బూటువిసిరి దాడి చేసేందుకు ప్రయత్నించాడు. భద్రతా సిబ్బంది అప్రమత్తమై అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సనాతన ధర్మాన్ని అవమానిస్తే హిందూస్తాన్‌లో సహించేది లేదంటూ నినాదాలు చేశాడు. అయితే తొణకని బెణకని ప్రధాన న్యాయమూర్తి ఇలాంటి చర్యలు తననేమీ చేయవని, వాదనలు కొనసాగించాలని న్యాయవాదులను కోరారు. రాకేష్ కిషోర్‌ను కొద్ది సేపు నిర్బంధంలోకి తీసుకున్న సిబ్బంది తరువాత వదలి పెట్టారు. ఎలాంటి కేసు దాఖలు చేయలేదు. ఈ ఉదంతాన్ని అనేక మంది తీవ్రంగా ఖండించారు. కొన్ని పార్టీలు, సంస్థలు అనేక చోట్ల నిరసన ప్రదర్శనలు చేశాయి. 'మా వరకు ఇది మరచిపోయిన ఉదంతం' అని తరువాత బిఆర్ గవాయ్ వ్యాఖ్యానించారు. 'మా సోదర న్యాయమూర్తి, నేను కూడా తీవ్ర దిగ్భ్రాంతికి గురైనప్పటికీ మా వరకు ఇది ముగిసిపోయిన అంశం' అన్నారు. సదరు లాయరు సభ్యత్వాన్ని సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ , భారత బార్ కౌన్సిల్ వెంటనే రద్దు చేశాయి. గవాయ్ తల్లి కమలాతాయ్, సోదరి కీర్తి అర్జున్ కూడా ఖండించారు. సమస్యలు ఏవైనా ఉంటే రాజ్యాంగబద్ధంగా పరిష్కరించుకోవాలి తప్ప చట్టాన్ని చేతుల్లోకి తీసుకొనేందుకు ఎవరికీ హక్కులేదని కమలాతాయ్ పేర్కొన్నారు. ఈ దాడి కేవలం వ్యక్తిగతమైనది కాదు, దేశానికే అవమానకరమైనది, ఒక విషపూరిత భావజాలంలో భాగం, దాన్ని నిరోధించాలని కీర్తి పేర్కొన్నారు.

తనది సాధారణ జన్మ కాదు అన్న ప్రధాని నరేంద్రమోడీని ఆదర్శంగా తీసుకున్నట్లుగా ఈ దాడి తాను చేసింది కాదు,తనకసలు అలాంటి ఉద్దేశమే లేదు, దేవుడే చేయించాడని రాకేష్ కిషోర్ తరువాత చెప్పాడు. ఎఎన్ఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ సెప్టెంబరు 16వ తేదీన ప్రధాన న్యాయమూర్తి ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విన్నారు, దాన్ని దాఖలు చేసిన న్యాయవాది ఎవరో కూడా తెలియదు' అప్పటి నుంచి తన చర్యలతో ఒక సందేశాన్ని ఇచ్చేందుకు ప్రయత్నించినట్లు, విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి సనాతన ధర్మాన్ని అవమానించారని రాకేష్ ఆరోపించారు.

న్యాయమూర్తి ఏ పూర్వరంగంలో ఆ వ్యాఖ్య చేశారో గమనించటం అవసరం. ఖజురె ప్రాంతం వారసత్వ సంపదగా ప్రకటించిన జాబితాలో ఉంది, దాని మీద నిర్ణయం తీసుకొనే అవకాశం కోర్టుకు లేదంటూ పిటిషన్ కొట్టివేసినట్లు ప్రకటించిన సందర్భంలో పిటీషనర్ పదే పదే తాను విష్ణుమూర్తి భక్తుడనని ప్రస్తావించటంతో అయితే ఆ విష్ణుమూర్తికే విన్నవించుకోండి, మీతీరు చూస్తే ప్రజాప్రయోజన వాజ్యం గాక ప్రచార ప్రయోజనం కోసం వేసినట్లుగా ఉందని కూడా గవాయ్ వ్యాఖ్యానించారు. దాడి యత్నానికి తానేమీ చింతించటం లేదని రాకేష్ కుమార్ చెప్పారు. సనాతన ధర్మాన్ని ప్రధాన న్యాయమూర్తి అపహాస్యం చేసిన క్రియకు తాను చేసింది కేవలం ప్రతిక్రియ మాత్రమే అన్నారు. తన సామాజిక తరగతి గురించి అతనేమీ చెప్పలేదు గానీ దళితుడని సామాజిక మాధ్యమాల్లో వచ్చింది. సనాతన ధర్మం, మను ధర్మం పేరుతో వేల సంవత్సరాలుగా అంటరాని వారంటూ దళితులను తీవ్ర వివక్ష, అవమానాలకు గురిచేసిన సంగతి తెలిసిందే. కానీ ఆ సామాజిక తరగతికి చెందిన వ్యక్తి అయితే ఆ సనాతన ధర్మం కోసం ఈ పని చేశానని చెప్పటం, సామాజిక స్పృహను కోల్పోయిన ఉన్మాద స్థితిలోకి వెళ్లిన అతన్ని చూసి నిజంగా జాలిపడాలి. ఆ విష్ణువునే ప్రార్థించండి అని అనటం సనాతన ధర్మాన్ని అవమానించటమా ? అదే గనుక అయితే నైజాం నవాబు జైల్లో పెట్టినపుడు 'ఎవడబ్బ సొమ్మని కులికావు రామచంద్రా' అని భక్తరామదాసు నిరసనగా కీర్తన పాడినట్లు ప్రచారంలో ఉన్నదే దానికి మనోభావాలు దెబ్బతిని ఎవరిని చెప్పుదెబ్బలు కొడతారు. వేదవిద్యలెల్ల వేశ్యల వంటివి, భ్రమలు పెట్టి తేటపడగనీవు,అన్న వేమన, కనక మృగము భువినికద్దు లేదనక యే, తరుణి విడిచిపోయె దాశరథియు, తెలివిలేనివాడు దేవుడెట్లాయరా అన్న సంగతి తెలిసిందే. అందువలన మనోభావాలు దెబ్బతిన్నాయనే పేరుతో వేమన మీద దాడులు చేస్తారా ?

మీడియాతో మాట్లాడినదాన్ని బట్టి రాకేష్ కుమార్ ఒక పథకం ప్రకారమే దాడికి యత్నించినట్లు చెప్పవచ్చు. ఎందుకంటే నిజంగా మనోభావాలు గాయపడిన వారి లక్షణం వెంటనే స్పందించటం, గవాయ్ వ్యాఖ్య చేసిన రోజు లేదా మరుసటి రోజే ఆపని చేసి ఉంటే 71ఏండ్ల వయస్సు వచ్చినా ఉద్రేకం తగ్గలేదని భావించేందుకు ఆస్కారం ఉండేది. కానీ ఇరవై రోజుల తరువాత బూటు విసిరేందుకు పూనుకోవటం అప్పటికప్పుడు కలిగిన స్పందన అంటారా ? ఒక పథకం ప్రకారం చేసింది తప్ప మరొకటి కాదు.

సెప్టెంబరు 16న గవాయ్ వ్యాఖ్యల మీద సామాజిక మాధ్యమంలో కాషాయదళాలు విరుచుకుపడ్డాయి తప్ప పక్కా హిందూత్వ సంస్థలుగా చెప్పుకొనేవేవీ కూడా మనోభావాల పేరుతో విమర్శలకు, దాడులకు దిగలేదు. అక్టోబరు ఐదవ తేదీన అమరావతి పట్టణం(మహారాష్ట్ర)లో జరిగే విజయదశమి కార్యక్రమాలకు అతిథిగా రావాల్సిందిగా గవాయ్ తల్లి కమలాతాయ్‌ను ఆర్ఎస్ఎస్ ఆహ్వానించింది. ప్రముఖులు లేదా వారి సంబంధీకులను బుట్టలో వేసుకొనే ప్రక్రియ, వారికి కాషాయ రంగు పులమటంలో సంఘమేథావులకు మరొకరు సాటిరారు. దాన్లో కూడా పెద్ద రాజకీయమే నడిచింది. గట్టి అంబేద్కరిస్టు కుటుంబం, అందునా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి మాతృమూర్తి తమ సభకు వచ్చారంటే తమ భావజాలాన్ని ఆమోదించినట్లే అని ప్రచారం చేసుకొనే చౌకబారు ఎత్తుగడ దానిలో ఉంది. తమ ఆహ్వానాన్ని మన్నించి ఆమె హాజరుకానున్నట్లు మీడియాలో ప్రచారం చేయించారు. అయితే ఆర్ఎస్ఎస్ ఆహ్వానాన్ని కమలాతాయ్ నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. దాదాసాహెబ్ గవాయ్ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలిగా ఉన్న తాను అంబేద్కర్ భావజాలం, రాజ్యాంగానికి కట్టుబడి ఉన్న వ్యక్తినని, అలాంటి కార్యక్రమాకి హాజరు కావటం అంటే సామాజిక చైతన్యానికి హాని జరిగినట్లే అంటూ ఆమె ఒక లేఖను కూడా విడుదల చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ కార్యక్రమానికి హాజరుకావటం లేదు, సమర్థించటం లేదు, రాజ్యాంగ విలువలకు తమ కుటుంబం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు.

గవాయ్ తల్లి లేఖ కాషాయదళాలకు చెప్పుకోరాని చోట తగిలిన దెబ్బ. ఆ కార్యక్రమ మరుసటి రోజే గవాయ్ మీద బూటుదాడి యత్నం జరిగింది. దానికీ దీనికి ఎలాంటి సంబంధం లేదంటారా ? ఈ సందర్భంగా గవాయ్ కుటుంబ నేపథ్యం గురించి చెప్పుకోవటం కూడా అవసరం.గవాయ్ సోదరుల తండ్రి ఆర్ఎస్ గవాయ్ రిపబ్లికన్ పార్టీ సీనియర్ నేత, యువకుడిగా అంబేద్కర్‌తో కలసి పని చేశారు. నాగపూర్ దీక్షభూమి సంపర్క సమితి అధ్యక్షుడిగా ఉన్నారు, 1998లో అమరావతి నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. కాంగ్రెస్ పాలనా కాలంలో 2006 నుంచి 11వరకు బిహార్, సిక్కిం, కేరళ గవర్నర్‌గా పనిచేశారు.

ఆర్ఎస్ఎస్, బిజెపి శక్తులు బూటు ఉదంతాన్ని తప్పు పడుతూనే అతి తెలివితేటల వాదనలను ముందుకు తెస్తున్నాయి. రాకేష్ కుమార్ మీద కేసు పెట్టి విచారణ జరపాలంటున్నాయి. అలా ఎందుకు చేశారో న్యాయస్థానాల విచారణల్లో నమోదు కావాలి. ఇది ప్రజాస్వామ్యం కనుక ఒక టెర్రరిస్టుకు సైతం తన వాదనలు చెప్పుకొనేందుకు అవకాశం ఇస్తున్నపుడు రాకేష్ కుమార్‌కు కోర్టులో చెప్పుకొనే అవకాశం ఇవ్వాలి అంటూ సామాజిక మాధ్యమంలో సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. అంటే సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిని బోనెక్కించాలని చెప్పటం తప్ప మరొకటి కాదు. జాతిపిత మహాత్మాగాంధీని తానెందుకు చంపిందీ వివరిస్తూ కోర్టులో గాడ్సే చేసిన వాదనలను పుస్తకాలుగా ముద్రించి ప్రచారం చేస్తున్న కాషాయ దళం బూటు ఉదంతాన్ని కూడా అలాంటి హిందూత్వ ప్రచారానికి వినియోగించుకోవాలన్న అతితెలివి తప్ప మరొకటి కాదు. అందుకే ఆ దాడి వెనుక పెద్ద కుట్రదాగి ఉందని చెప్పాల్సి వస్తోంది. ఒక దళితుడైన ప్రముఖుడి మీద మరో దళితుడితో దాడి చేయించటం కుట్రగాక మరేమిటి? దేశంలో వివిధ మఠాలు, స్వాములు మౌనంగా ఉండి రాకేష్ కుమార్‌ను ఉసికొల్పటాన్ని అర్థం చేసుకోలేనంత అమాయకంగా నేడు దళిత సామాజిక తరగతి ఉందా? సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్ ఎంతో సముచితంగా, హుందాగా వ్యవహరించారని వేరే చెప్పనవసరం లేదు, బూటువెనుక ఉన్న కుట్రను వెంటనే గ్రహించారేమో!

## ఇల్లు లేని పేదలకు ఇళ్లు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే వెడ్మ

ప్రజాపక్షం/ఖానాపూర్ :ఖానాపూర్ నియోజకవర్గం పెంబి మండలంలోని కోసగుట్ట గ్రామంలో పివిటీజీ లకు గాను 33 కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా ఎమ్మెల్యే బొజ్జు పటేల్ శంకు స్థాపనచేసి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసి పనులు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇళ్ళు లేని పేదలందరికీ విడతల వారిగా అందరికి ఇళ్ళు ప్రభుత్వ మందిస్తుందని,ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్న నేరుగా తనని సంప్రదించాలని,ఇడ్ల మంజూరు ఒకటే కాకుండా నియోజకవర్గంను ప్రతి రంగంలో అభివృద్ధి చేయడమే నా లక్ష్యం అని అన్నారు.ఖానాపూర్ పెంబి మండలాధ్యక్షుడు స్వప్నిల్ రెడ్డి, దయానంద్,మల్లెపల్లి స్వామి, ఎంపి డిఒ,ఎంఆర్ఒ అధికారులు,కాంగ్రెస్‌నాయకులు ఉన్నారు.



## పోలీస్‌ల సైకిల్ ర్యాలీ

ప్రజాపక్షం / నందిపేట్:నందిపేట్‌లో శనివారం పోలీసు అమర వీరులను స్మరించుకొని పెద్ద ఎత్తున సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ప్రజలలో చట్టాల పట్ల అవగాహన పెంపొందించేందుకు ఈ ర్యాలీ నిర్వహించినట్లు ఎస్ఐ శ్యామ్ రాజ్ తెలిపారు. సమాజ భద్రత కోసం ప్రాణాలు అర్పించిన పోలీసు త్యాగాలను ప్రజలు మద్దతు తెలపాలని ఎస్ఐ అభిప్రాయపడ్డారు. ఈ ర్యాలీలో ఎస్ఐ 2 రామ్, విద్యార్థులు, స్థానిక యువకులు, ప్రజలు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ తీరుతో అందరూ అసంతృప్తి

ఎమ్మెల్యే కోవ లక్ష్మి



ప్రజాపక్షం / కేరిమేరి/ ఆసిఫాబాద్ :ఆసిఫాబాద్ నియోజక వర్గ బిఆర్ ఎస్ పార్టీలో చేరికల పర్వం కొనసాగుతుందని, అధికార కాంగ్రెస్ పార్టీని కాదని బిఆర్‌ఎస్ విధానాలకు ఆకర్షితులై పార్టీలోకి నాయకులు, ప్రజలు చేరుతున్నారని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. శనివారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యేకోవ లక్ష్మి సమక్షంలో కేరిమేరీ మండలానికి చెందిన వివిధ పార్టీల ముఖ్య నాయకులు అనుచరులు రెండు వందల మందితో కలిసి బిఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ జడ్‌పిటిసి కలాం, మండల అధ్యక్షులు రాథోడ్ అంబాజీ ఆధ్వర్యంలో కేరమేరి మండలం అనార్పల్లి, తుమ్మగూడ, సొమ్లగూడ, కొలంగూడ గ్రామాలకు చెందిన నాయకులు చేరగా వీరికి ఎమ్మెల్యేకోవ లక్ష్మి బిఆర్‌ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగాఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూప్రస్తుతం అధికార కాంగ్రెస్ పార్టీ గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వడం లేదని, దీంతో పంచాయతీలలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉందని విమర్శించారు. అబద్ధపు హామీలు ఇచ్చి గద్దె ఎక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో ఘోరంగా విఫలమైందని, రాష్ట్ర ప్రభుత్వ తీరుతో ఏ వర్గం కూడా సంతృప్తిగా లేదన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ నాయకురాలు మర్సకోలా సరస్వతి, రూపులల్, యూనిస్, పరుశురాం నాయక్, కృష్ణ, వెంకట్ ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గురుకుల బాలికల పాఠశాలలో జూనియర్ జడ్జి అజయ్ ఉల్లం తనిఖీ



ప్రజాపక్షం/సిర్పూర్ టి :సిర్పూర్ టౌన్ లోని గురుకుల బాలికల పాఠశాలను జూనియర్ సివిల్ జడ్జి అజయ్ ఉల్లం శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ తనిఖీలో విద్యార్థుల హాజరు, బోధన నాణ్యత, పాఠశాలలో పరిశుభ్రత, ఇతర నిర్వహణ పరిస్థితులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి అజయ్ ఉల్లం తరగతుల వారీగా విద్యార్థులతో మాట్లాడి వారి విద్యా ప్రమాణాలు, పాఠశాలలో కల్పించిన సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఉన్న వసతులు, టాయిలెట్లు, తాగునీటి సదుపాయం వంటి అంశాలపై అధికారులు తగిన శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులతో జడ్జి సమావేశమయ్యారు. విద్యార్థుల క్రమశిక్షణ, హాజరు, పరీక్షా ఫలితాలను మెరుగుపరచడంపై పలు సూచనలు చేశారు. విద్యార్థులు పాఠశాల పట్ల ఆసక్తి పెంచుకోవాలని, పాఠశాల శుభ్రతలో పాలుపంచుకోవాలని ప్రోత్సహించారు.

## ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం : కలెక్టర్



ప్రజాపక్షం/మంచిర్యాల:ప్రజలకు మరింత వేగవంతమైన, సౌకర్యవంతమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో నిర్మితమవుతున్న ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ ప నులను ఆయన ఆకస్మికంగా స ందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్య వై ద్య రంగాలను బలోపేతం చేస్తూ అనేక చర్యలు చేపడుతుందని, ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలో రూ. 129.25 కోట్ల అంచనా వ్యయంతో ప్ర భుత్వ ఆసుపత్రి నిర్మాణం చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. జిల్లా ప్రజల కు మెరుగైన వేగవంతమైన వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రి ని ర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు గుత్తేదారుల సమన్వయంతో కృషి చేయాలని ఆయన సూచించారు. సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## దళారులను నమ్మి మోసపోవద్దు

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



ప్రజాపక్షం/ఖానాపూర్ :ఖానాపూర్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో తెలంగాణ మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్,ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఆరుకాల కష్టపడి పండించిన పంటకి ప్రభుత్వ మద్దతు ధరతో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.మధ్య వర్తులకు,దళారులకు తక్కువ ధరకు పంటను అమ్ముకొని మోసపోవద్దని,మొక్కలు సకాలంలో తీసుకొచ్చి అమ్మాలని ,వర్షపాత పరిస్థితులు ఉన్నందున తేమచేరకుండా టార్పాలిన్ కవర్లను ఉం చుకోవాలని అన్నారు.వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పడగల భూషణ్,వైస్ చైర్మన్ మజీద్,ఆత్మచైర్మన్ తోట సత్యం,మండల అధ్యక్షుడు దయానంద్,పట్టణ అధ్యక్షుడు రమేష్,మున్సిపల్ మాజీ చైర్మన్ రాజురా సత్యంఅగ్రికల్చర్ ఆఫీసర్ సుజాత,ఎమ్మార్వో సుజాత,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమాజ రక్షణ పోలీసుల కర్తవ్యం



ప్రజాపక్షం/– అల్లాదుర్గం:సమాజ పరిరక్షణ, ప్రజా రక్షణ ధ్యేయంగా ప్రతి ఒక్క పోలీస్ పని చేస్తారని అల్లాదుర్గం సర్కిల్ సిఐ రేణుక రెడ్డి తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా శనివారం సర్కిల్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్ల సిబ్బంది సిఐ ఆధ్వర్యంలో అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ నుండి ఐబి చౌరస్తా వరకు 2 కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ రేణుక రెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు మనకు మరువలేని జ్ఞాపకాలని ,సంఘ విద్రోహ శక్తుల ను ఎదిరించి ఎందరో పోలీసులు వీరమరణం చెందారని వారి త్యాగాలు వెలకట్టలేనివని గుర్తు చేశారు. అల్లాదుర్గం, పెద్ద శంకరంపేట,రేగోడు ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వేలాది మందికి నాణ్యమైన ఆహారం అందిస్తున్న ...

# అక్షయపాత్ర కృషి ప్రశంసనీయం





రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి

దామోదర్ రాజనర్సింహ

ప్రజాపక్షం/సంగారెడ్డి :రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామెదర్ రాజనర్సింహ కంది మండలంలో హరే కృష్ణ మూవ్మెంట్ ఆధ్వర్యంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న హరే కృష్ణ కల్చరల్ సెంటర్ నిర్మాణంలోభాగంగా నిర్వహించిన మహా నరసింహ హోమము, గర్భాలయ యంత్ర స్థాపన పూజ కార్యక్రమములో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న హరే కృష్ణ కల్చరల్ సెంటర్‌లో శ్రీశ్రీ రాధా కృష్ణ విగ్రహాలను ప్రతిష్టించి సనాతన ధర్మ మహోన్నత సంస్కృతిక వారసత్వాన్ని విలువలను ప్రాచుర్యం లోకి తేవటానికి ఆద్భుత ,ఆధ్యాత్మిక సంస్కృతి కేంద్రంగా నిలుస్తుందని మంత్రి వెల్లడించారు. ఈసందర్భంగా అక్షయ పాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో 3 కొత్త ఫుడ్ డిస్ట్రిబ్యూషన్ వాహనాలను జెండా ఊపి మంత్రిదామోదర్ రాజనర్సింహ, టిజిఐఐసి చైర్పర్సన్ నిర్మల జగ్గారెడ్డి లు ప్రారంబించారు.ఆధునిక వంట గదులను ,స్నాక్స్ ఆటోమేటిక్ కూరగాయల వాపింగ్ ,కటింగ్ మెషిన్,లను పరిశీలించారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్న టాస్క్ ఫోర్స్



ప్రజాపక్షం/కొల్చారం:మెదక్ నుండి సంగారెడ్డి జిల్లా చౌటకూర్ గ్రామమునకు అక్రమంగా డిసిఎం వ్యాన్‌లో తరలిస్తున్న సుమారు 370 బస్తా (19 టన్నులు) రేషన్ బియ్యంను టాస్క్ ఫోర్స్ పోలీసులు వెంబడించి కొల్చారం మండలం లోని ఏడుపాయల టీ జంక్షన్ వద్ద శనివారం ఉదయం పట్టుకున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ సీఐ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా డ్రైవర్ ప్రవర్తన అనుమానంగా ఉండడంతో తనిఖీ చేయగా 370 బస్తాల రేషన్ బియ్యం పట్టుబడింది. పట్టుబడిన రేషన్ బియ్యం డిసిఎం వ్యాన్‌ను టాస్క్ ఫోర్స్ పోలీసులు కొల్చారం పోలీసులకు అప్పగించారు. కొల్చారం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## నేరాల నిర్మూలనే లక్ష్యంగా 'కమ్యూనిటీ కాంటాక్ట్'





సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్ రెడ్డి

ప్రజాపక్షం /మందమర్రి:నేరాల నిర్మూలన కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రజల రక్షణ భద్రత పోలీసుల బాధ్యత అని మందమర్రి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్ రెడ్డి అన్నారు. శనివారం మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని యాపల్, అంగడి బజార్ ఏరియాలలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ సిఐ శశిధర్ రెడ్డి స్థానిక ప్రజలతో ముఖాముఖి మాట్లాడారు. గ్రామాలలో కొత్త వ్యక్తులు, నేరస్తులు ఆశ్రయం పొంది ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, కొత్తవారు అద్దెకు వస్తే వారికి సంబంధించిన పూర్తి వివరాలు తీసుకోవాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదని, యువత మత్తుకు పదార్థాలు సేవించి జీవితాలను నాశనం చేసుకోవద్దని, గంజాయి ఇతర మత్తు పదార్థాల అనుమానం ఉన్న ప్రదేశాలలో నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు నిర్వహించామని పేర్కొన్నారు. ఎవరైనా గుడుంబా తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని, సమస్యలుంటే 100 నంబరుకు కాల్ చేయాలని, సైబర్ నేరగాళ్ల మోసపు కాల్స్, మెసేజ్‌లు, వాట్సాప్ కాల్స్‌కు స్పందించవద్దని ప్రజలను అప్రమత్తం చేశారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని కోరారు. సరైన పత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశామని, బెల్ట్ షాపులో అక్రమంగా విక్రయిస్తున్న 29.10 లీటర్ల మద్యం (రూ. 19,897 విలువగల) స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని వెల్లడించారు. మందమర్రి ఎస్ఐ రాజశేఖర్, దేవపూర్ ఎస్ఐ గంగారం, రామకృష్ణాపూర్ ఎస్ఐ రాజశేఖర్, కాశీపేట ఎస్ఐ ఆంజనేయులు, మందమర్రి ఎఎస్ఐ శ్రీనివాస్, సర్కిల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## తాణాకలాన్ శివారులో ఎలుగుబంటి సంచారం

అటవీశాఖ అధికారుల

గస్తీ పెంపు



ప్రజాపక్షం/ఎడపల్లి:ఎడపల్లి మండలంలోని తాణాకలాన్ అటవీ ప్రాంతంలో గత మూడు రోజులుగా ఎలుగుబంటి సంచారం స్థానికులను భయాందోళనకు గురి చేస్తుంది. గ్రామ శివారులో నిర్మాణంలో ఉన్న ఓ రైస్ మిల్లు పరిసరాల్లో ఎలుగుబంటి తిరుగుతున్నట్లు అందిన సమాచారంతో అటవీ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. సమాచారం అందుకున్న సంబంధిత అటవీ శాఖ అధికారులు తక్షణమే రంగంలోకి దిగారు. రైస్‌మిల్లు నిర్వహకులతో పాటు, అలీసాగర్ ఫిల్టర్ బెడ్ దగ్గర పనిచేసే కార్మికులను అధికారులు సందర్శించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిస్థితిని పర్యవేక్షించిన అధికారులు శుక్రవారం రాత్రి, శనివారం అడవి ప్రాంతంలో విస్తృతంగా గస్తీ చేపట్టారు. అడవి ప్రాంతంలో రెండు ఎలుగుబంట్లు ఉన్నట్లు అటవీ శాఖ అధికారులు నిర్ధారించారు. వాటిలో ఒకటి పిల్లల తల్లి కాగా, మరోకటి ఒంటరిగా తిరుగుతున్నట్లు అక్కడి నిర్వహకులకు తెలిపారు. ఈ నేపథ్యంలో అటవీ శాఖ అధికారులు తాణాకలాన్, అలీసాగర్ పరిసర ప్రాంతాల ప్రజలు, కార్మికులు రాత్రివేళ్లలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఏదైనా కొత్త సమాచారం తెలిసినట్లయితే వెంటనే తమకు తెలియచేయాలని కోరారు. గస్తీలో పాల్గొన్న వారిలో సెక్షన్ ఆఫీసర్ ప్రతాప్, బీట్ అధికారులు నవీన్, సూర కిరణ్, ప్రవీణ్ ఉన్నారు.

## భావితరాలకు పటేల్ స్ఫూర్తిదాయకం



ప్రజాపక్షం/మెదక్ :సర్దార్ వల్లభాయ్ పటేల్ యువతకు రాబోయే భావితరాలకు స్ఫూర్తిదాయకం కావాలని, ఏక్ బారత్,శ్రేష్టభారత్ జాతీయ సమైక్యతను తెలియజేస్తాయని, దేశం ముందు...ఆతర్వాతే ఏదైనా అనే లక్ష్యంతో మోదీ సర్కార్ పనిచేస్తుందని, సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 జయంతి సందర్భంగా నిర్వహించబోయే మేరా యువభారత్ మెదక్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం మెదక్ పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో మెదక్ ఎంపీ రఘునందన్ రావు, జిల్లా అధ్యక్షులు వల్దాస్ మల్లేష్ గౌడ్, పార్టీ శ్రేణులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మెదక్ ఎంపీ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా నిర్వహించబోయే మేరా యువభారత్ మెదక్ ను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమక ఉద్దేశం దేశ సమైక్యత, సేవా భావం పెంపొందించడంతోపాటు యువతి, యువకుల్లో వృత్తి నైపుణ్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 530 సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి ఒక పటిష్టమైన భారతదేశంగా ఏర్పాటు చేసి ప్రపంచ దేశాలకు మార్గదర్శకులు అయ్యారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యువతి, యువకులను భాగస్వామ్యం చేయాలన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా కేంద్రం లోని అన్ని కళాశాలలో ఉపన్యాస, వ్యాస రచర, రంగోలి లాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కళాశాలలోని ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి, ప్రభుత్వ శాఖలైన పోలీస్, విద్య వైద్య, ఇతర శాఖలను భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. భారతదేశాన్ని ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ గా తయారు చేయడానికి దేశ ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. ప్రతి వ్యక్తికి దేశమే ముందు ఏదైనా ఆ తర్వాతే అని పేర్కొన్నారు. అనంతరం మేర యువభారత్ మెదక్ పోస్టర్ ను ఎంపీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా మేర యువభారత్ అధికారి రంజిత్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక పటాన్ చెరు

ఎమ్మెల్యే

గూడెం మహిపాల్‌రెడ్డి




ప్రజాపక్షం/ పటాన్‌చెరు :భిన్నత్వంలో ఏకత్వానకి ప్రతీకగా పటాన్చెరు నియోజకవర్గం నిలుస్తోందని స్థానిక శాసన సభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఉత్తర భారతీయులు ప్రతి ఏటా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే చట్ పూజ ను పుర్కస్కరించుకొని శనివారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని తన నివాసంలో నియోజకవర్గ పరిధిలోని పటాన్చెరు ,ఇస్నాపూర్, పాశమైలారం, బొల్లారం, రామచంద్రాపురం ,అమీన్పూర్, గుమ్మడిదల ,బొంతపల్లి , ఖాజీపల్లి, తదితర ప్రాంతాలలో నివసిస్తున్న 50 వేల మంది ఉత్తర భారతీయులకు 10 లారీల చెరుకును సొంత నిధులతో కొనుగోలు చేసి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పంపిణి చేసారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు ఉపాది కోసం పటాన్చెరు నియోజకవర్గం పరిధిలోని వివిధ పరిశ్రమలలో పనిచేస్తూ స్తానికంగా నివాసం ఉంటున్న ప్రతి ఒక్కరి సంక్షేమం ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో సైతం ,తగు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. గత 20 సంవత్సరాలుగా పటాన్చెరు సాకి చెరువు కట్టపైన చట్ పూజ కార్యక్రమానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. త్వరలో సాకి చెరువు కట్టపైన సూర్య దేవాలయం ,ఫంక్షన్ హాల్ నిర్మించబోతున్నట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ వారికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి యాదగిరి యాదవ్ ,చందోల్ మాజీ ఎమ్మెల్యే మనోజ్ కుమార్ సింగ్ గూడెం మధుసూదన్‌రెడ్డి ,ఉత్తర భారతీయుల సంక్షేమ సంఘం ప్రతినిధులు మహిళలు పాల్గొన్నారు.

## ఇందూరు గడ్డ నుంచే తొలిఅడుగు

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు


కల్వకుంట్ల కవిత





ప్రజాపక్షం/నిజామాబాద్ : ఇందూరు గడ్డ మీది నుంచేతొలి అడుగు వేశానని, నిజామాబాద్ జిల్లా బిడ్డగా, కోడలిగా మీ ఆశీర్వాదం కోసం వచ్చాను నన్ను ఆశీర్వదించండి అంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ముందుగా జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లాకు చేరుకుని దేవితండాలోని జగదాంబ మాత, సేవలాల్ మహారాజ్ దేవాలయంలో కవిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద తెలంగాణ జాగృతి నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈనాడు ఆఫీస్ నుంచి బైక్ ర్యాలీ జాగృతి కార్యాలయం వరకు చేరుకున్నారు. ఉద్యమకారులు ఆమెకు మద్దతు తెలిపారు. ప్రజలనుద్దేశించి మాట్లాడారు. పసుపు రైతులు, తెలంగాణ 5 నెలలుగా జరుగుతున్న రాజకీయ పరిణామాల కారణంగా నిజామాబాద్‌కు రాలేకపోయానన్నారు. 20 ఏళ్లుగా కేసీఆర్, టీఆర్ఎస్, బీఆర్ఎస్ కోసం పని చేశా. నిజామాబాద్‌లో నా ఓటమి బీఆర్ఎస్ ఓ కుట్రనా ? కాదా ? నిజామాబాద్ బీఆర్ఎస్ కార్యకర్తలు ఆలోచించాలని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇంటి గుట్టు బయట పెట్టి కుట్ర చేసి నన్ను బయటికి పంపించారని ధ్వజమెత్తారు. ఇన్ని రోజుల తర్వాత రావటం అడువుల్లో ఎన్‌కౌంటర్లు జరిగిన చరిత్ర ఉందని గుర్తు చేశారు. 27 ఏళ్ల వయస్సులో ఉన్నప్పుడు ఉద్యమంలోకి వచ్చానని గత 20 ఏళ్లుగా తెలంగాణ కోసం కేసీఆర్ కోసం, టీఆర్ఎస్, బీఆర్ఎస్ కోసం పని చేశానన్నారు. జిల్లా కోడలిగా, బిడ్డగా నాకు ఎన్ని కష్టాలు ఎదురైనా సరే సహనంతో ఎదురు చూశానని, నేను టీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా ఏమి చేయలే. కానీ నన్ను కుట్ర చేసిన పంపించారన్నారు. మరోసారి నిజామాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యకర్తలు ఆలోచించాలని కోరుతున్నానన్నారు. ఈ జిల్లాకే చెందిన పీసీసీ ప్రెసిడెంట్ మహేష్‌గౌడ్ దీనిపై ఒక్కమాట మాట్లాడటం లేదన్నారు. సరైన విద్య, ఉద్యోగా, వైద్యమందించలేకపోతున్నారు. బంగారు లేడినో, ఆకాశంలో పక్షినే మనం అడగటం లేదు. మనకు మంచి తిండి కావలని అడుగుతున్నామన్నారు. బీఆర్ఎస్ నన్ను కుట్ర చేసి పంపించటంతో దారి నేను వెతుకుతున్నానన్నారు. ఇన్నాళ్లు కేసీఆర్ గారి నీడలో ఉన్నా ఇప్పుడు ఆ నీడలోంచి నన్ను బయట పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే మీరు ఆశీర్వదిస్తారని మీ కోసం వచ్చా. మీరు అండగా ఉంటారని నమ్ముతున్నాన్నారు. అనంతరం నవీపేట్ మండలంలోని యంచా గ్రామానికి తరలివెళ్లారు. గోదావరి వరద ముంపు బాధితులతో సమావేశమయ్యారు. నంది పేట్ మండలంలోని కొండూర్ గ్రామంలో శ్రీలక్ష్మి నర్సింహాస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## భారీగా కురిసిన వర్షం.. ఆందోళనలో రైతన్నలు



ప్రజాపక్షం/ఎడపల్లి:గత కొద్ది రోజుల నుంచి ఎండలు మండిపోతున్నాయి. ఇప్పుడు వేరైటీగా చలికాలం ప్రారంభంలోనే అకారణంగా అకాల వర్షాలు ఎంట్రీ ఇచ్చాయి. శనివారం ఎడపల్లి మండలంలో పలు గ్రామాల్లో కురిసిన ఈ అకాల వర్షాలతో రైతులు బెంబెలెత్తి పోతున్నారు. ఉదయం నుంచి వాతావరణం మేఘావృత్తమై ఉండగా మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. అకాశమంత మేఘావృత్తమై ఉండటంతో వాతావరణం చల్లగా మారింది. ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. సుమారు అరగంట పాటు కురిసిన భారీ వర్షానికి రైతుల్లో ఆందోళన నెలకొంది. కొంతమంది తమ ధాన్యాన్ని నూర్పిడి చేసి ఆరబెట్టుకోగా ధాన్యం తడిసి ముద్దయింది. మరికొంతమంది రైతులకు సంబంధించిన వరి పంట మరో వారం రోజుల్లో కోతకు రాగా ఈ అకాల వర్షం కారణంగా పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. అకాల వర్షాల వల్ల తాము నష్టపోయే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## టియుడబ్ల్యుజెహెచ్ 143 ప్రెస్‌క్లబ్ అధ్యక్షున్ని సన్మానించిన ఎంఎల్‌ఎ



ప్రజాపక్షం/కొడిమ్యాల: జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలో శనివారం రోజున ప్రెస్ క్లబ్ టీయుడబ్ల్యుజేహెచ్ 143 యూనియన్ అధ్యక్షులు చొక్కాల మహిపాల్‌ను చొప్పదిండి ఎంఎల్‌ఏ మేడిపల్లి సత్యం సన్మానం చేయడం జరిగింది. ఇటీవల జరిగిన ప్రెస్ క్లబ్ ఎలక్షన్‌లు జరిగిన విషయం తెలుసుకొని , ఎంఎల్‌ఏ మేడిపల్లి సత్యం వారి కొనుగోలు సెంటర్స్ ప్రారంభానికి వచ్చిన సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నికయిన అధ్యక్షులు మహిపాల్‌ను పిలిచి శాలువాతో సత్కారించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు, నాయకులు, అధికారులు, రైతులు ఉన్నారు.

## వర్షంతో తీవ్ర నష్టం.. రైతు హఠాత్మరణం



ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని బొప్పాపూర్ గ్రామానికి చెందిన రైతు నిమ్మల సత్యం శనివారం హఠత్ మరణం చెందారు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివారల ప్రకారం సత్యం పండించిన వరి పంటను కొనుగోలుకు సిద్ధంగా ఉంచగా శుక్రవారం కురిసిన అకాల వర్షానికి ధాన్యం మొత్తం తడిసి ముద్దయిందని, పంటను ఎండబెట్టే క్రమంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడని తెలిపారు. చేతికి అందిన పంట నేల పాలయై, తడిసిపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురైయ్యాడని, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. బాధిత కుటుంబానికి 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని స్థానికులు, కుటుంబ సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు రూ.200 కోట్లు

పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కాంగ్రెస్ సర్కార్ ప్రాధాన్యత

మిట్టపల్లి సాంఘీక సంక్షేమ గురుకులాన్ని సందర్శించిన మంత్రి అడ్లురి లక్షణ్‌కుమార్



ప్రజాపక్షం/సిద్దిపేట: విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం 200 కోట్ల రూపాయలతో 25 ఎకరాల విస్తీర్ణంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటేడ్ రెసిడెన్సియల్ విద్యాసంస్థలు నెలకొల్పుతున్నట్లు రాష్ట్ర సాంఘీక సంక్షేమ, గిరిజన సంక్షేమ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లురి లక్ష్మ ణ్ కుమార్ అన్నారు. సిద్దిపేట జిల్లా అర్బన్ మండలం మిట్టపల్లి సాంఘీ సంక్షేమశాఖ గురుకుల బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ హైమావతితో కలసి సందర్శించారు. విద్యార్థులతో సంబాషించి గురుకులంలో వారికి కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించి వారికి అదనంగా కావాల్సిన సౌకర్యాలను గురించి అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులతో కలసి మధ్యాహ్నం సహాపంక్తి భోజనం చేశారు. మెనుప్రకారం విద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించటంపై విద్యాలయ సిబ్బందిని అభినందించారు. ఈసందర్భంగా మంత్రి అ డ్లురి లక్షణ్ మాట్లాడుతూ పేదవిద్యార్థులు ఉన్నత స్థానానికి ఎదగాలనే రాష్ట్ర ముఖ్యమంత్రి ఆలోచన మేరకు రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల విద్యకు అధిక ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు. పేద విద్యార్థులకు ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశ్యంతో ప్రత్యక్షంగా పర్యావేక్షించేందుకు విద్యాశాఖను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనవద్దనే అంటిపెట్టుకున్నార న్నారు. రాష్ట్ర ప్రభుత్వప్రతినిధిగా, రాష్ట్ర మంత్రిగా గురుకుల విద్యా సంస్థలో చదవుకుంటున్న విద్యార్థులకు అందిస్తున్నవిద్యా, భోజనం, వసతి సదుపాయాలు నేరుగా తెలుసుకునేందుకు వచ్చినట్లు తెలిపారు. ఈ గురుకులంలో బట్టలు ఆరవేయాటానికి ప్లాట్ ఫాం నిర్మాణానికి 10 లక్షలు, ఇతర మరమ్మతులకు 15లక్షలు మొత్తం 25లక్షలు మంజూరు చేస్తానని హామీనిచ్చారు. ఏ రాష్ట్రంలో చేయని విధంగా రాష్ట్రంలో 200కోట్లతో 25 సువిశాల స్థలంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటేడ్ స్కూల్స్ రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అందులో ఎస్సీ, ఎస్టీ బిసి, మైనార్టీ విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన భోజనం కల్పిస్తామన్నారు. గురుకు ల విద్యాలయాల్లో చదివే విద్యార్థులకు ఐఐటి, ఐఐఎం, లాంటి గొప్ప విద్యాసంస్థల్లో ప్రవేశం పొందుతున్నారని అందుకు గురుకుల విద్యసంస్థల అధ్యాపకులకు అభినందనలు తెలిపారు. గురుకుల విద్యాసంస్థల్లో బడ్జెట్ పరంగా సమస్యలు రాకుండ చూస్తానన్నారు. టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ సాలరీకి ఏలాంటి సమస్య రాకుండ చర్యలు చేపడుతామన్నారు. సిఎం, డిప్యూటి సిఎం ఆలోచనలతో డైట్ చార్జీలు పెంచి విద్యార్థులు ఆరోగ్యంగా ఎదిగేందుకు పౌష్టికాహారంతో కూడిన మెను నిర్ణయించి అన్ని గురకులాల్లో, సంక్షేమ హాస్టళ్లలో మెను ఖచ్చితం గా అమలు చేసి భోజన పరంగా విద్యార్థులకు ఏలాంటి ఇబ్బందులు రాకుండ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ హైమావతి జిల్లాలో చురుగ్గా పనిచేస్తూ ప్రతిరోజు గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లను అకస్మీకంగా తనికీ చేసి ప్రభుత్వం లక్ష్యం మేరకు విద్యార్థులకు అన్ని సౌకర్యాలు సక్రమంగా అందేలా చూస్తానన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సాంఘీక సంక్షేమ గురుకుల వి ద్యాలయాలను పర్యావేక్షించేందుకు ప్రత్యేక అధికారుల ను నియమించామన్నారు. విద్యార్థులకు అవసరమైన సౌ కర్యాలను జిల్లా కలెక్టర్‌కు సమాచారం అందిస్తే వెం టనే అవసరమైన సౌకర్యాలు సమకూరుస్తామన్నారు. జి ల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ విద్యార్థులకు ఉన్నత స్థానానికి ఎదగాలంటే మంచి విద్య చాల ముఖ్యమన్నారు. గురుకుల విద్యాలయాలు ప్రభుత్వం అం దించే అన్ని సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు శారీరకంగా దృడంగా ఉన్నప్పుడే మానసికంగా దూరంగా ఉంటారన్నారు. శరీరంగా మా నసికంగా ఎదగాలంటే క్రమశిక్షణ పాటిస్తూ తప్పక వ్యాయామం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఆర్డీఓ సదానందం, గురుకులాల ఆర్‌సిఓ డిసిఓ నర్సింహచారి. విద్యాలయ ప్రిన్సిపాల్ లక్ష్మాంజలి. అధ్యాపకులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో సైకిల్ ర్యాలీ



ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం కరీంనగర్ పోలీసు కమిషనరేట్ ఆధ్వర్యంలో నగరంలో 20 కిలోమీటర్ల సైకిల్ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీని కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌష్ ఆలం పోలీసు పరేడ్ గ్రౌండ్ నుంచి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సైకిల్ ర్యాలీలో కరీంనగర్ రన్నర్స్, సైక్లిస్ట్ అసోసియేషన్ సభ్యులు, వివిధ పాఠశాలల విద్యార్థులు, డాక్టర్లు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. నగరంలోని అన్ని కూడళ్ల ప్రాంతాల నుంచి ర్యాలీ భారీ సాగి తిరిగి పోలీస్ పరేడ్ గ్రౌండ్ వద్ద ముగిసిందని సిపి తెలిపారు. కార్యక్రమం అనంతరం ర్యాలీలో పాల్గొన్న సభ్యులకు అమరవీరుల దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. ర్యాలీలో పాల్గొన్న సభ్యులందరికీ సిపి చేతుల మీదుగా మెడల్స్ అందించారు. అక్టోబర్ 31 వరకు పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు సిపి తెలిపారు. కార్యక్రమాలను విజయవంతం చేయడానికి ప్రజలు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ డిసిపిలు వెంకటరమణ, భీంరావు, ఏసిపిలు వెంకటస్వామి, విజయ్‌కుమార్, యాదగిరిస్వామి, మాధవి, కమిషనరేట్‌కు చెందిన ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు. వీరితో పాటు అల్ఫోర్స్ విధ్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి, కరీంనగర్ కమిషనరేట్ రన్నర్స్, సైక్లిస్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మహేష్ పసుల, డాక్టర్ అజయ్ ఖండాల, డాక్టర్ కిరణ్‌లతో పాటు పాఠశాలల విధ్యార్థులు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర పొందాలి



ప్రజాపక్షం/వీణవంక: వీణవంక మండల పరిధిలోని గంగారం, ఎల్బాక, పలు గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను డైరెక్టర్లతో కలిసి చైర్మన్ విజయ భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని అమ్మి మద్దతు ధర పొందాలని సూచించారు. కేంద్రాల వద్దకు తాలు, తేమ లేకుండా తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మేరీ, సీఈవో ప్రకాష్‌రెడ్డి, డైరెక్టర్లు రాములు, మధుసూధన్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, సతీష్, ఏఎంసి డైరెక్టర్ సతీష్, రైతులు పాల్గొన్నారు.

## న్యాయస్థానం చట్టాల అవగాహన సదస్సు




ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్: శనివారం రోజున స్థానిక గాయత్రి డిగ్రీ మరియు పీజీ కళాశాలలో న్యాయస్థానం చట్టాల అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధి ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ కుంచాల సునీత , సీనియర్ సివిల్ జడ్జ్ కం సెక్రటరీ కే. స్వప్న రాణి మరియు చీఫ్ లీగల్ ఎయిడు కౌన్సిల్ మిస్టర్ నుచ్చు శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రధాన అతిథిగా విచ్చేసిన డిస్ట్రిక్ట్ జడ్జి సునీత మాట్లాడుతూ విద్యార్థులకు రాజ్యాంగం, హక్కులు మరియు న్యాయవ్యవస్థ ప్రాముఖ్యతను మరియు నేరాల శిక్ష కాలవ్యవధులను అలాగే సెక్షన్స్‌ని వివరనాత్మకంగా వివరించారు. విద్యార్థులు చెడువేసనాలకు బానిసలు కాకుండా మీ బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ఎలాంటి కేసుల బారిన పడకూడదని మరియు న్యాయవృత్తి పట్ల ఆసక్తి ఉన్న విద్యార్థులు క్రమశిక్షణ, నిబద్ధత మరియు సేవా దృక్పథంతో ముందుకు సాగాలని అన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా DWO మెంబెర్ శ్రీమతి శ్యామల న్యాయవాదుల ఆధ్వర్యంలో డ్రగ్స్ విముక్తి ప్రతిజ్ఞను విద్యార్థులతో చేపించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ అల్లంకి శ్రీనివాస్ ,గాయత్రి విద్యానికేతన్ కరస్పాండెంట్ కం లోక అదలాత్ మెంబర్ అల్లంకి రజనీ దేవి , ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి



ప్రజాపక్షం/ధర్మపురి : జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు ధర్మపురి మండలం నేరేళ్ల లో పేకాట స్థావరంపై సీసీఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ ,ధర్మపురి పోలీసులు సంయుక్తంగా దాడి చేసి పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు.పేకాట రాయుళ్ళ నుండి రూ.1 లక్షా 16 వేల నగదు,4 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని ఐదుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు సీసీఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. జూదం ఆడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

## బావిలో దూకి మహిళ ఆత్మహత్య.



ప్రజాపక్షం/సారంగాపూర్: జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం పెంబట్ల గ్రామానికి చెందిన గాజెంగి జమున(60)అనే మహిళ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మృతురాలు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. ఇదిలా ఉండగా తన పెద్ద కుమార్తెకు పెళ్లి అయి 6 నెలలకే విడాకులు కావడంతో తీవ్ర మానసిక క్షోభకు గురై, జీవితం విరక్తి చెంది శనివారం ఉదయం సమయంలో పెంబట్ల గ్రామంలో గల బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమారుడు రాజు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గీత తెలిపారు.

## వరికొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన మేడిపల్లి సత్యం



ప్రజాపక్షం/చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్, ఆర్నకొండ, చొప్పదండి గ్రామాల్లో ప్రాథమిక సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను, కొలిమికుంట గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడంతో పాటు చొప్పదండి మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ నాయకులు, అధికారులతో కలిసి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. అనంతరం స్థానిక ఎన్‌టిఆర్ చౌరస్తాలో చొప్పదండి మున్సిపాలిటీకి పలు అభివృద్ధి పనుల నిమిత్తం రూ.15 కోట్లు నిధులు, కొలిమికుంట గ్రామం నుంచి మల్లన్నపల్లె మల్లన్న దేవస్థానం వరకు బిటి రోడ్డు నిర్మాణానికి రూ.3.30 కోట్ల నిధులు మంజూరు చేసినందుకు చొప్పదండి మండల ప్రజల పక్షాన ధన్యవాదాలు తెలుపుతూ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## నవభారతి ప్రైవేట్ లిమిటెడ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి

ప్రజాపక్షం/కరీంనగర్: హోమ్‌కేర్ ప్రొడక్ట్స్ నవభారతి ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చేతుల మీదుగా మదర్ డిపోను కరీంనగర్‌లో ఘనంగా ప్రారంభించారు. ఈ సంధర్భంగా కవ్వంపల్లి మాట్లాడుతూ నవభారత్ ప్రొడక్ట్స్ అందరూ వాడాలని, మిగతా ప్రొడక్ట్స్ కంటే తక్కువ ధరలతో కొనుగోలుదారులకు సరసమైన ధరలకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీటిలో హోమ్ కేర్, కార్ కేర్, హౌస్ కీపింగ్, డిస్పోజబుల్ ప్రొడక్ట్స్ అందుబాటులో ఉన్నాయని, మార్కెట్‌లో రన్నింగ్‌లో ఉన్న అన్ని ప్రొడక్ట్స్ కంటే తక్కువ ధరలకు ఎక్కువ ఆరోగ్యాన్ని, శుభ్రతను అందజేస్తుందని తెలిపారు. డిమార్ట్ లాంటి కంపెనీలు పెద్దపెద్ద సిటీలలోనే అవైలబుల్‌గా ఉన్నాయని, నవభారతి కంపెనీ తెలంగాణ మొత్తం చిన్న చిన్న మండలాల్లో సైతం అందుబాటులో ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌సి జీవన్ రెడ్డి, దొడ్డె సుందరం, మహమ్మద్ నవీద్‌బాష, పంకజ్ సింగ్‌రాజ్ పుట్, నవభారత్ సభ్యులు తదితరులున్నారు.

## సిపిఐ నేతలపై వ్యక్తిగత దూషణ



ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు సుతారి రాములు

ప్రజాపక్షం/కోరుట్ల: భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా నాయకత్వాన్ని కించపరిచే విధంగా కొందరు మతోన్మాదులు వ్యక్తిగత విమర్శలను సిపిఐ పట్టణ కమిటీ జిల్లా ఏఐటీయుసి ఖండిస్తు ఏమైనా ఆధారాలు ఉంటే ప్రజాకోర్ట్ పెట్టండని లేదంటే పరువు నష్ట దావా వేస్తామని సి ప్రభాకర్ భవన్‌లో శనివారం రోజున సిపిఐ ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు . ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు సుతారి రాములు మాట్లాడుతూ కొన్ని పత్రికలలో ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ నాయకులు తప్పుదోవ పట్టించుటకు రాజకీయ లబ్ది కోసం విమర్శలు చేస్తుంటారని దానిని రాజకీయంగా ఎదుర్కోనే శక్తి లేనివారు వ్యక్తిగత దూషణ విమర్శలు చేస్తు తామ నాయకత్వాన్ని సిపిఐ పార్టీని భజన చేసే విధంగా పోస్ట్ పెట్టడం సరికాదన్నారు. పూర్తి ఆధారాలు నిజ నిజాలు తెలుసుకోకుండా విమర్శ చేస్తే రానున్న రోజులలో మిమ్మల్ని రాజకీయ సన్యాసులు చేస్తామని హెచ్చారించారు. ప్రస్తుతం ఉన్న పాత కోర్టు భవనం సి ప్రభాకర్ స్మారక గ్రంథాల కమిటీ కార్యవర్గం పేరున రిజిష్టర్ చేసిందన్నారు. ఈ ఆస్తి ఎవరి సొంత పేరున ఎలాంటి ఆధారాలు లేవని, ఈ లైబ్రరీ స్వచ్ఛందంగా పాఠకులు మేధావులు ఉచిత కోచింగ్ నిర్వహణ జరిగిన అనేక మంది ఉద్యోగాలు సంపాదించుకునే దని, ఇలాంటి మంచి సంస్థపై బురద చల్లడం మంచి పరిణామం కాదని, లైబ్రరీ కమిటీ పేరున రిజిస్టర్ ఇంటి నెంబర్ కూడా మున్సిపల్ ఇచ్చినారని, హౌస్ టాక్సీ చెల్లించబడుతుందన్నారు. రాజకీయాన్ని రాజకీయంగా ఎదుర్కోవాలి లేనియేడల ప్రజాకోర్ట్‌లో తగిన గుణపాఠం చెప్తామని హెచ్చారించారు. ఈ సంఘటపై పూర్తి ఆధారాలతో మేము ఎలాంటి చర్చలకైన సిద్ధంగా ఉన్నామని మీరు ప్రజాకోర్టు ఏర్పాటుచేస్తే మేము అక్కడికి వస్తామని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం, జిల్లా నేతలు మునుగోరి హనుమంతు, ఎండీ మౌలానా, ఎండీ ముక్రం, ఎండీ సమీర్, ఎన్నం రాధా తదితరులు పాల్గొన్నారు

## కొనుగోలు కేంద్రాల సందర్శన తప్పనిసరి

ఇంఛార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : కొనుగోలు కేంద్రాలను రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని తేమ శాతం ఆధారంగా, నిబంధనల ప్రకారం కొనుగోలు చేయాలని, వ్యవసాయ విస్తరణ అధికారులు తప్పనిసరిగా కొనుగోలు కేంద్రాలను సందర్శించి, రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా ఇంఛార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్ ఆదేశించారు. శనివారం సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూర్ లో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె క్షేత్ర స్థాయిలో సందర్శించి, కేంద్రంలో రైతుల సౌకర్యార్థం చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. 17 శాతం తేమ రాగానే ఆలస్యం చేయకుండా కొనుగోళ్ళు ప్రారంభించాలని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, క్షేత్ర స్థాయిలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు తమ పరిధిలోని కొనుగోలు కేంద్రాలను తప్పకుండా సందర్శించి, రైతులకు వచ్చే సందేహాలను నివృత్తి చేస్తూ, అన్ని అంశాలపై అవగాహన కల్పించాలని అన్నారు. కేంద్రంలోని రిజిస్టర్ లను పరిశీలించి, వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. ట్యాబ్ ఎంట్రీలో తప్పులు దొర్లకుండా చూడాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, అధికారులు ఎవరి బాధ్యతలు వారు సక్రమంగా నిర్వహిస్తే ధాన్యం కొనుగోళ్ళ ప్రక్రియ సజావుగా పూర్తవుతుందని పేర్కొన్నారు. గ్రేడ్ ఏ రకానికి రూ. 2,389, కామన్ రకానికి రూ. 2,369 ధర ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు. సన్న రకం ధాన్యం క్వింటాలుకు అదనంగా బోనస్ రూ.500 ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే జిల్లా యంత్రాంగానికి తెలియజేయాలని ఇంచార్జి కలెక్టర్ సూచించారు.

## ఆల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్‌లో ఘనంగా కెమిస్ట్రీ వీక్ సంబరాలు



ప్రజాపక్షం/కరీంనగర్: కరీంనగర్‌లోని కొత్తపల్లిలో గల అల్ఫోర్స్ ఇ టెక్నో స్కూల్‌లో కెమిస్ట్రీ వీక్ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్బంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపాల్,రచయిత డాక్టర్ కెప్టెన్ బి.మధుసూధన్‌రెడ్డిలు హాజరై మాట్లాడారు. రసాయన అణువులు అద్భుత రసాయన, బౌతిక ధర్మాలతో మన జీవనశైలిని సులభతరం చేస్తున్నాయని పేర్కొన్నారు. రసాయన శాస్త్రంలో అనేక పరమాణు అణువుల లోతుల్లో దాగిన రహస్యాలను అర్ధం చేసుకోవాలని, ఆ విషయాలను చాలా సంగ్రహంగా, విశ్లేషణాత్మకంగా తెలుసుకున్నట్లయితే అనేక ఆవిష్కరణలకు బీజం వేయవచ్చని తెలిపారు. విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ వహించి రసాయన శాస్త్రంలో నూతన అధ్యాయాలకు శ్రీకారం చుట్టారని వారు చెప్పారు. వైద్యం, వ్యవసాయం, శక్తి కొత్త పధార్థాల తయారీకి రసాయన శాస్త్రం చాలా దోహదపడుతుందని వారు అభిప్రాయపడ్డారు. ప్రతి విద్యార్థి రసాయన శాస్త్రంలో నైపుణ్యం సాధించే విధంగా పలు ప్రక్రియలను కొనసాగించి పట్టు సాధించాలన్నారు.

**ఎయిర్ రైఫిల్ షూటింగ్ పోటీలు ప్రారంబించిన అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి**

కరీంనగర్‌లోని భగత్‌నగర్‌లోని స్వదేష్ షూటింగ్ స్పోర్ట్స్ అకాడమీలో కరీంనగర్ జిల్లా ఎస్‌జిఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్, అకాడమీ ప్రతినిధులతో కలిసి ఏర్పాటు చేసిన అండర్ 19 బాలబాలికల ఎయిర్ రైఫిల్ షూటింగ్ ఎంపిక పోటీలను అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. విధ్యార్థులకు విద్యారంగంతో పాటు క్రీడారంగంలో నైపుణ్యం పొందే విధంగా ప్రోత్సాహం అందించాలన్నారు. కార్యక్రమంలో స్వదేశ్ షూటింగ్ స్పోర్ట్స్ అకాడమీ డైరెక్టర్ అరుణ్ తేజ్, పిఇటిలు, పిడిలు, క్రీడాకారులు, తదితరులున్నారు.

## కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన అడిషనల్ కలెక్టర్



ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం: జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ బిఎస్ లత శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో కొనుగోలుకు సంబంధించిన విషయాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు పలువురు రైతులు 18 క్వింటళ్లే కాకుండా ఎకరాకు 25 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేపట్టే విధంగా నిర్వాహకులను ఆదేశించాలని రైతులు అడిషనల్ కలెక్టర్ దృష్టికి తేవడంతో అడిషనల్ కలెక్టర్ సానుకూలంగా స్పందించి పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించే విధంగా చూస్తానని రైతులకు ఆమె భరోసా ఇచ్చారు. అదేవిధంగా మొక్కజొన్నను చెన్ని పట్టడం ద్వారా ధాన్యం నష్టపోవాల్సి వస్తుందని రైతులు అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా ప్రభుత్వం మొక్కజొన్నను కొనుగోలు చేసిన తర్వాత గోదాములో భద్రపరచాల్సి ఉంటుంది కాబట్టి నాసిరకం మొక్కజొన్నతో మిగతా మొక్కజొన్న పంటకు పురుగు పట్టి మొక్కజొన్న దెబ్బతినే అవకాశం ఉంటుండడంతో చెన్ని పట్టడం ద్వారా నాసిరకం మొక్కజొన్న వేరుగా ఐ నాణ్యమైన మొక్కజొన్న వస్తుందని, తద్వారా మిగతా మొక్కజొన్న ధాన్యం దెబ్బ తినే అవకాశం ఉండదని కొనుగోలు కేంద్రాలలో చెన్ని యంత్రాన్ని పెట్టడం జరిగిందని రైతులకు అడిషనల్ కలెక్టర్ వివరించారు. రైతులకు ఎలాంటి సమస్యలు కొనుగోలు కేంద్రంలో తలెత్తకుండా వాతావరణ పరిస్థితుల దృష్ట్యా మొక్కజొన్న ధాన్యాన్ని త్వరితగతిన తూకం వేయాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వెంట మెట్పల్లి ఆర్డీవో శ్రీనివాస్, మార్క్ ఫెడ్ డిఎం హబీబ్, తహసిల్దార్ వరప్రసాద్, ఎంపీడీవో మహమ్మద్ సలీం, ఏవో ఆకు రాజ్ కుమార్, మార్క్ఫెడ్ అధికారి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ కార్యదర్శి సురేందర్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు వైస్ చైర్మన్ ఎలా వెంకట్ రెడ్డి విండో చైర్మన్ బద్దం గోపి, మాజీ విండో చైర్మన్ అబ్బటి రాజారెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో మా ప్యానలే గెలుస్తుంది

కాంగ్రెస్ పార్లమెంట్ ఇంచార్జి వెలిచాల రాజేందర్‌రావు ధీమా



ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ: కరీంనగర్, జగిత్యాల అర్బన్ బ్యాంకు ఖాతాదారులు సభ్యుల సహకారంతో వంద శాతం తమ ప్యానల్ విజయం సాధిస్తుందని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. తమ ప్యానెల్ అభ్యర్థులు మంచి అనుభవం మంచి ఆశయం, ఆలోచన కలిగిన వారు అని పేర్కొన్నారు. విజయం సాధించిన తర్వాత అర్బన్ బ్యాంకును అధ్భుతంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. స్వచ్చమైన నీతివంతమైన పాలన అందిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాజేందర్‌రావు తమ ప్యానెల్ అభ్యర్థులను ప్రకటించారు. అర్బన్ బ్యాంకు అభివృద్ధికి చేపట్టే ప్రణాళిక గతంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న వారే మళ్లీ తిరిగి అధికారం కోసం తాపత్రయపడుతున్న అంశంతో పాటు పలు వివరాలు వెల్లడించారు. బ్యాంకుకు సంబంధించిన వివిధ అలిగేషన్లు ఆరోపణలు వచ్చాయని తెలిపారు. ఒకరిపై ఒకరు ఈ విషయంలో దుమ్మెత్తి పోసుకున్నారని చెప్పారు. కోర్టులో కేసులు నడవడం వల్ల ఎన్నికలకు జాప్యం జరిగిందన్నారు. తిరిగి మళ్లీ కోర్టు ఆదేశాల ప్రకారం ఎన్నికలు జరుగుతున్నాయని వివరించారు. ఖాతాదారులు సభ్యులకు భద్రత కల్పిస్తామని, వారి సొమ్మకు ఎలాంటి ధోకా లేకుండా సేవలందిస్తామని తెలిపారు. ప్రస్తుతం అర్బన్ బ్యాంకులో 92 కోట్ల డిపాజిట్లు ఉన్నాయని, తమ ప్యానెల్ గెలిస్తే ఈ డిపాజిట్లను మూడింతలుగా అయ్యేలా చేస్తామన్నారు. సమావేశంలో రాజేందర్ రావు మద్దతిస్తున్న అర్బన్ బ్యాంకు ప్యానెల్ అభ్యర్థులు మూల వెంకట రవీందర్‌రెడ్డి, ఇ.లక్ష్మ ణ్‌రాజు, అనురాసు కుమార్, వజీర్ అహ్మద్, పలువురు కాంగ్రెస్ నాయకులు, తదితరులున్నారు.

# క్రీడ

# రో-కోల మెరుపులు

## మూడో వన్డేలో టీమిండియా ఘన విజయం



సిడ్నీ వేదికగా మూడో వన్డేలో ఆస్ట్రేలియా, టీమ్ ఇండియా తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో భారత జట్టు 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన ఆసీస్ తొలుత 46.4 ఓవర్లలో 236 పరుగులకు ఆలౌటైంది. టీమ్‌ఇండియా ఈ లక్ష్యాన్ని 38.3 ఓవర్లలో కేవలం ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదించింది. బ్యాటింగ్‌లో భారత్‌కు శుభారంభం దక్కింది. రోహిత్ శర్మ (121*; 125 బంతుల్లో, 13 ఫోర్లు, 3 సిక్స్‌లు), విరాట్ కోహ్లీ (74*; 81 బంతుల్లో, 7 ఫోర్లు) అద్భుతంగా రాణించారు. తొలుత శుభ్‌మన్ గిల్, రోహిత్ శర్మ మొదటి వికెట్‌కు 69 పరుగులు జత చేశారు. 24 పరుగుల వద్ద గిల్ హేజిల్‌వుడ్ బౌలింగ్‌లో అలెక్స్ క్యారీకి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన కోహ్లీ తొలి బంతికే తన పరుగుల ఖాతా తెరిచాడు. మొదటి రెండు వన్డేల్లో వరుసగా డకౌట్ అయిన కోహ్లీ ఈ మ్యాచ్‌లో మాత్రం తన రిథమ్‌లోకి వచ్చాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ స్వేచ్ఛగా పరుగులు రాబట్టారు. రో కో ధాటికి ఆసీస్ బౌలర్లు తేలిపోయారు. వీరు మూడో వికెట్‌కు 169 బంతుల్లో 168* పరుగులు జత చేశారు. రెండో మ్యాచ్‌లో అర్ధ శతకం చేసిన రోహిత్ ఈ వన్డేలోనూ అద్భుతంగా రాణించి, సెంచరీ (105 బంతుల్లో) చేశాడు. రోహిత్ శర్మకు ఓవరాల్‌గా ఇది 50వ సెంచరీ. వన్డేల్లో అతడికిది 33వ శతకం. ఆస్ట్రేలియాలో పర్యటిస్తూ ఆ జట్టుపై ఎక్కువ సెంచరీలు (6) చేసింది కూడా రోహిత్ శర్మనే. ఆ తర్వాతి స్థానంలో విరాట్ కోహ్లీ (5 సెంచరీలు) ఉన్నాడు.

మొదటి రెండు వన్డేల్లో విఫలమైన కోహ్లీ ఈ మ్యాచ్‌లో ఫామ్‌లోకి వచ్చాడు. 56 బంతుల్లో తన హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అలాగే ఓ అరుదైన రికార్డునూ సాధించాడు. విరాట్ కోహ్లీ వన్డేల్లో రెండో అత్యధిక పరుగుల వీరుడిగా నిలిచాడు. ఇంతకు ముందు మూడోస్థానంలో ఉన్న అతడు.. ఈ మ్యాచ్‌లో కుమార సంగక్కరను (14234 పరుగులు) అధిగమించాడు. కోహ్లీ కంటే ముందు 18426 పరుగులతో సచిన్ తెందూల్కర్ ఉన్నాడు.

ఆసీస్ బౌలర్లలో జోష్ హేజిల్‌వుడ్ మాత్రమే ఒక వికెట్ పడగొట్టాడు. మిగతా బౌలర్లంతా తేలిపోయారు. అంతకు ముందు ఆసీస్ బ్యాటర్లలో మ్యాట్ రెన్‌షా (56), మిచెల్ మార్ష్ (41) రాణించారు. టీమ్ ఇండియా బౌలర్లలో హర్షిత్ రాణా 4, సుందర్ 2.. సిరాజ్, కుల్‌దీప్, అక్షర్, ప్రసిద్ధ్‌కృష్ణ తలో వికెట్ తీశారు.

# చిత్తుగా ఓడిన దక్షిణాఫ్రికా

ప్రపంచ కప్‌లో సెమీఫైనల్‌కు ముందు ఆస్ట్రేలియాను ఓడించి ఆత్మవిశ్వాసం కూడగట్టుకోవాలనుకున్న దక్షిణాఫ్రికా ఆశలు అడియాశలయ్యాయి. టోర్నీలో అజేయంగా దూసుకెళ్తున్న ఆసీస్.. సమఉజ్జీగా భావిస్తున్న సఫారీ టీమ్‌ను చివరి లీగ్ మ్యాచ్‌లో చిత్తుగా ఓడించింది.



ఇండోర్‌లో ఏకపక్షంగా సాగిన పోరులో అలనా కింగ్(7–18) సంచలన బౌలింగ్‌తో ప్రత్యర్థిని కుప్పకూల్చింది. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని 17వ ఓవర్లోనే ఛేదించింది ఆసీస్. బేత్ మూనీ(42) ఔటైనా.. సథర్‌లాండ్ (10 నాటౌట్) రెండు ఫోర్లు బాదడంతో ఏడు వికెట్ల తేడాతో జయభేరి మోగించింది కంగారూ టీమ్.

### 11 పరుగులకే రెండు వికెట్లు

ఛేదనలో ఆరంభంలోనే డేంజరస్ ఓపెనర్ ఫొబే లిచ్‌ఫీల్డ్5)ను ఔట్ చేసి మరినే కాప్ బ్రేకిచ్చింది. ఆ తర్వాతి ఓవర్లోనే ఎలీసా పెర్రీ(0) డకౌట్ కాగా 11 పరుగులకే రెండు వికెట్లు పడ్డాయి. అయితే. సఫారీల ఉత్సాహంపై నీళ్లు చల్లుతూ బేత్ మూనీ(42), జార్జియా వోల్(38 నాటౌట్) దూకుడుగా ఆడారు. బౌండరీలతో విరుచుకుపడిన ఈ ద్వయం మూడో వికెట్‌కు 76 రన్స్ జోడించి జట్టును గెలుపు వాకిట నిలిపారు. అర్ధ శతకానికి చేరువైన మూనీని డీక్లెర్క్ పెవిలియన్ పంపింది. ఆ తర్వాత వచ్చిన అనాబెల్ సథర్‌లాండ్10 నాటౌట్) సైతం ధనాధన్ ఆడడంతో ఏడు వికెట్ల తేడాతో గెలుపొందింది ఆసీస్. చివరి లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాకు కనీసం పోటీ ఇవ్వలేకపోయింది దక్షిణాఫ్రికా. స్పిన్నర్ అలనా కింగ్(7–18) తిప్పేయగా.. బ్యాటర్లు సమిష్టిగా విఫలమవ్వడంతో స్వల్ప స్కోర్‌కే పరిమితమైంది. కెప్టెన్ లారా వొల్వార్డ్ట్(31)ను ఔట్ చేసిన మేగన్ షట్ తొలి వికెట్ అందించగా.. ఫామ్‌లో ఉన్న తంజిమ్ బ్రిట్స్(6)ను కిమ్ గార్త్ పెవిలియన్ చేర్చింది. అక్కడి నుంచి అలనా కింగ్ సఫారీలను దెబ్బకొడుతూ వచ్చింది. తొలుత.. సునే లుస్(6)ను ఔట్ చేసిన తను.. అనెరీ డిర్క్సెన్(5), గత మ్యాచ్‌లో హాఫ్ సెంచరీ బాదిన మరినే కాప్(0), సినాలో జఫ్తా(29), క్లో ట్రయాన్(0), నడినే డీక్లెర్క్ (14), మసబత క్లాస్(4)లను ఔట్ చేసి.. ఏడో వికెట్ సాధించింది. కింగ్ విజృంభణతో 24 ఓవర్లలోనే దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ ముగిసింది.

## ఆస్ట్రేలియాతో భారత్ సెమీఫైనల్

ప్రపంచకప్ తుది అంకానికి చేరిన వేళ.. టేబుల్ టాపర్ ఎవరయ్యేను? టీమిండియాతో తలపడేది ఎవరు? అని అందరిలో నెలకొన్న ఉత్కంఠను పటాపంచలు చేసింది మాజీ ఛాంపియన్. శనివారం ఇండోర్ మైదానంలో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా పోరు ఏకపక్షంగా ముగిసింది. ఐదేసి విజయాలతో జోరుమీదున్న ఇరుజట్ల మధ్య హోరాహోరీ మ్యాచ్ జరుగుతుందని అనుకున్న ఫ్యాన్స్‌కు నిరాశను మిగిల్చింది ఆసీస్. టాస్ గెలిచి సఫారీలను బ్యాటింగ్‌కు ఆహ్వానించిన ఆస్ట్రేలియా.. అలనా కింగ్(7–18) కెరీర్ బెస్ట్ బౌలింగ్‌తో చెలరేగడంతోప్రత్యర్థిని 97కే ఆలౌట్ చేసింది. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని 16.5 ఓవర్లలోనే ఉఫ్‌మని ఊదేసింది ఆసీస్. ఈ విజయంతో 13 పాయింట్లతో పట్టికలో అగ్రస్థానం కాపాడుకున్న ఆస్ట్రేలియా తొలి సెమీస్‌లో భారత్‌ను ఢీకొట్టనుంది.

# ఫోకస్






# ఒడిదుడుకుల మధ్య కొనుగోళ్ల ర్యాలీ

స్టాక్ మార్కెట్లలో ఒడిదుడుకులు ఉన్నప్పటికీ, వాటిని తట్టుకొని ఈ వారం కొనుగోళ్ల ర్యాలీ కొనసాగింది. అమెరికా వాణిజ్య సుంకాల పెంపు, షట్‌డౌన్, ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు వంటి అంశాలు భారత స్టాక్ మార్కెట్లపై కొంత మేరకే ప్రభావం చూపగలిగాయి. భారత్‌అమెరికా మధ్య వాణిజ్య చర్చలు ఆశాజనకంగా సాగుతున్నాయన్న వార్తలు స్టాక్ మార్కెట్‌పై సానుకూల ప్రభావం చూపాయి. చాలా మంది విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు ఈ వారంలో నికర కొనుగోలుదారులుగా మారారు. రూ. 1,308 కోట్ల ప్రవాహంతో అమ్మకాల పరంపరకు ముగింపు పలికారు. మార్కెట్ ర్యాలీకి గణనీయమైన మద్దతును అందించారు. సంస్థాగత పెట్టుబడిదారులు రూ. 943 కోట్ల మూలధన ప్రవాహంతో బలమైన మద్దతును అందించడం విశేషం. ద్రవ్యోల్బణ గణాంకాలు, ఇతర కీలక ఆర్థిక గణాంకాల కారణంగా పెరిగిన అనిశ్చితితో పాటు, టారిఫ్ ఉద్రిక్తతలు కొనసాగింపు రూపాయి మారకంపై ప్రతికూలతను ప్రదర్శించింది. డాలర్ మారకం విలువ రూ. 88.70కు చేరింది. రూపాయి మారకంలో ఇదే అత్యంత కనిష్టం. ఈవారం లావాదేవీలకు చివరి రోజైన శుక్రవారం (24 అక్టోబర్) బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్‌ఇ)లో సెన్సెక్స్ 84,211.88 పాయింట్లు, జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఇ)లో నిఫ్టీ 25,795.15 పాయింట్లుగానూ ముగిశాయి. వారంతంలో కొంత ప్రతికూలత తలెత్తకపోతే, ర్యాలీ మరింత మెరుగ్గా ఉండేది. బిఎస్‌ఇలో నిఫ్టీ 50, మిడ్‌క్యాప్ 150, స్మాల్ క్యాప్ 250 సూచీలు వరుసగా 1.81 శాతం, 2.47 శాతంగా నమోదై, 1.44 శాతం సానుకూల రాబడితో ముగిశాయి. కాగా, మధ్యప్రాచ్య ఉద్రిక్తతల మధ్య సరఫరాలో అంతరాయాలు ఏర్పడతాయనే ఆందోళనల కారణంగా బ్రెంట్ ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 54.5 డాలర్లకు పెరిగాయి. దీని ప్రభావం ప్రపంచ స్టాక్ మార్కెట్లపై పడింది. భారత్ కూడా స్వల్ప మార్పులకు గురైంది. భారత మార్కెట్లలో రంగాల పరంగా మిశ్రమ ప్రదర్శనలు కనిపిస్తున్నాయి. నిఫ్టీ క్యాపిటల్ మార్కెట్లు, నిఫ్టీ ఐటీ వరుసగా 6 శాతం, 5.03 ఓఆతం లాభాలతో అగ్రస్థానంలో నిలిచాయి. రేటు తగ్గింపు ఆశలు, సాంకేతిక వ్యయం పునరుద్ధరణ, బలమైన విదేశీ పెట్టుబడుల కారణంగా ఈ ఫలితాలు కనిపించాయి.ఈ వారంలో ముఖ్యాంశాలకు నిఫ్టీ కన్స్యూమర్ డ్యూరబుల్స్ మరో రంగం, పండుగ సీజన్ ఆశావాదం, జిఎస్‌టి కోతల కారణంగా గత వారంతో పోలిస్తే 3.25 శాతం లాభపడింది. నిఫ్టీ హెల్త్‌కేర్ ఇండెక్స్, నిఫ్టీ ప్రైవేట్, ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ కూడా పెరుగుదలను నమోదు చేశాయి.

### ప్రపంచ పరిణామాలు

ఈ వారం అమెరికన్ సూచీలు నష్టాల్లో ముగిశాయి, కొనసాగుతున్న అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్, కీలకమైన ఆర్థిక డేటాను విడుదల చేయడంలో ఆలస్యం చేసింది, ఇది పెట్టుబడిదారులలో మరింత అస్థిరతను, వారంలో లాభాల బుకింగ్‌ను, మిశ్రమ ఆర్థిక సంకేతాలను సృష్టించింది. ఆసియాలో, దక్షిణ కొరియాకు చెందిన కెఒఎస్‌పిఐ 1.73 శాతం, జపాన్‌కు చెందిన నిక్కీ 1.01 శాతం చొప్పున పతనమయ్యాయి. ఎఫ్‌టిఎస్‌ఇ 100, జర్మనీ డిఎఎక్స్‌తో యూరోపియన్ సూచీలు వరుసగా 0.01 శాతం, 0.12 శాతం తగ్గాయి.

# బంగారం కొనుగోళ్లపై తొందర వద్దు

బంగారం ధరలు తగ్గే సూచనలు ఉన్నందున, కొనుగోళ్లపై తొందర వద్దని బులియన్ మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు. ప్రపంచ స్టాక్ మార్కెట్‌లో అనిశ్చితికి దేశంలో కొన్ని విశ్వాసాలు కూడా జతకావడంతో, బంగారం ధరలు రికార్డు స్థాయికి చేరిన విషయం తెలిసిందే. అయితే ఆ సుదీర్ఘ ర్యాలీకి గత మూడు రోజుల పాటు ఆకస్మికంగా బ్రేకులు పడగా శుక్రవారం మళ్లీ స్వల్పంగా పెరిగాయి. రికార్డు స్థాయిలో గరిష్ఠాలను తాకిన పసిడి ధరలు.. పెట్టుబడిదారులు లాభాలను బుక్ చేసుకోవడం, రిస్క్ ఆస్తులైన ఈక్విటీల వైపు తిరిగి రావడంతో గత మూడు రోజులు గణనీయంగా పడిపోయాయి. పెట్టుబడిదారులు తీవ్రమైన ర్యాలీ తర్వాత లాభాలను బుక్ చేసుకోవడం కొనసాగించడం వలన, బంగారం, వెండి ధరలు సమీప భవిష్యత్తులో మరింత తగ్గే అవకాశముందని నిపుణుల అభిప్రాయం. ఈ ఏడాది బంగారం 60 శాతం, వెండి 80 శాతం లాభాన్ని ఇస్తూ అసాధారణ ర్యాలీని ఇచ్చింది. ఇటీవలి తగ్గుదల ప్రధానంగా ఈ బలమైన పరుగు తర్వాత పెట్టుబడిదారులు లాభాలను బుక్ చేసుకోవడం వల్ల జరుగుతుంది. స్థూల ఆర్థిక పరిస్థితుల్లో పెద్ద మార్పు ఏమీ లేదు. బంగారం, వెండికి సరఫరా సమస్యలు, డిమాండ్ బలంగా కొనసాగడం, కేంద్ర బ్యాంకుల చురుకైన కొనుగోలు కొనసాగింపు ధరల స్థిరత్వాన్ని ప్రభావితం చేస్తాయి. మార్కెట్ ఇప్పుడు మితిమీరిన ఉత్సాహం తర్వాత చల్లబడుతోంది. బంగారం ధర 4 వేల డాలర్ల నుండి 4,400 డాలర్లకు, వెండి ధర 45 డాలర్ల నుండి 55 డాలర్లకి పెరగడం మార్కెట్ పెరుగుదలను ప్రతిబింబిస్తుంది. అయితే ఇప్పుడు ఆ పెరుగుదల బలహీనపడి, ధరలు తిరిగి సమతుల్య స్థాయికి చేరుకునే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇలావుంటే, దేశీయ మార్కెట్‌లో వెండి కిలోకు రూ.1,36,000 నుండి 1,38,000 మధ్య బలమైన మద్దతు పొందే అవకాశం ఉంది. ఇది మంచి రీఎంట్రీ జోన్‌గా మారుతుంది. బంగారం 10 గ్రాములకు రూ.1,12,000 నుండి రూ. 1,15,000 మధ్య వినియోగదారుల కొనుగోలు ఆసక్తి పెరుగుతుంది. అంటే ఈ స్థాయిలోకి వచ్చినప్పుడు కొనుగోలు మంచిదని అభిప్రాయపడుతున్నారు. ఇది ప్రస్తుత స్థాయిల కంటే దాదాపు రూ.6 వేలు నుండి రూ. 7 వేలు తక్కువ. తదుపరి రెండు త్రైమాసికాలలో సమయానుకూల దిద్దుబాట్లు, పరిమిత రాబడితో ధరలు స్థిరపడే అవకాశం ఉంది. స్వల్పకాలిక బలహీనత ఉన్నప్పటికీ, బంగారంతో పోలిస్తే వెండి మీద సానుకూల దీర్ఘకాలిక దృష్టిని నిపుణులు పేర్కొంటున్నారు.



### ఈవారం బంగారం ధరలు

ఈనెల 19వ తేదీ, ఆదివారం బంగారం ధరల్లో ఎలాంటి మార్పు లేదు. అంటే, శనివారం నాటి ధరలే కొనసాగాయి. గ్రాము బంగారం 24 క్యారెట్లకు రూ. 13,086, 22 క్యారెట్లు రూ. 11,995గా ఉండింది. ఆ తర్వాత, సోమవారం నుంచి శనివారం వరకు నమోదైన ధరలు..

అక్టోబర్ 20: గ్రాము (24 క్యారెట్లు) రూ. 13,069 (–17), గ్రాము (22 క్యారెట్లు) రూ. 11,980 (–15).
అక్టోబర్ 21: గ్రాము (24 క్యారెట్లు) రూ. 13,058 (–11), గ్రాము (22 క్యారెట్లు) రూ. 11,970 (–10).
అక్టోబర్ 22: గ్రాము (24 క్యారెట్లు) రూ. 12,589 (–469), గ్రాము (22 క్యారెట్లు) రూ. 11,540 (–430).
అక్టోబర్ 23: గ్రాము (24 క్యారెట్లు) రూ. 12,508 (–81), గ్రాము (22 క్యారెట్లు) రూ. 11,465 (–75).
అక్టోబర్ 24: గ్రాము (24 క్యారెట్లు) రూ. 12,437 (–71), గ్రాము (22 క్యారెట్లు) రూ. 11,400 (–65).
అక్టోబర్ 25: గ్రాము (24 క్యారెట్లు) రూ. 12,562 (+ 125), గ్రాము (22 క్యారెట్లు) రూ. 11,515 (+ 115).

## ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎప్పుడిస్తారు?



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : విద్యార్థుల ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఎఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో శనివారం ఎఐఎస్‌ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. రామకృష్ణ మాట్లాడుతూ గత ఐదేండ్లుగా ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడు తున్నారన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు ఎనిమిది వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బకాయిలను విడుదల చేయాలని లేని పక్షంలో ఎంఎల్‌ఎలు, ఎంపిలు, మంత్రుల ఇండ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, జిల్లా సహాయ కార్యదర్శి షేక్ నాగులమీరా, శివ, వంశీ, గోపి, ఉపేందర్ పాల్గొన్నారు.

## సామాజిక న్యాయం కోసం సమరం



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్: దేశం, రాష్ట్రంలో కొనసాగుతున్న అమానవమైనటువంటి సమానత్వం, సామాజికన్యాయంకోసం సమరంసాగించాలని డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు కొమ్ముభరత్ పిలుపునిచ్చారు. శనివారం తాడూరు మండలం నెల్లికుదురులో సమావేశంలో ఆయన మాట్లాడారు. 21వశతాబ్దం సైన్సుటెక్నాలజి పురోగతిచెందుతున్న ఈతరుణంలో ఇంకా అసమానతలు కొనసాగడం తోటి మనిషిని మనిషిగా గుర్తించకపోవడం అత్యంత అమానుషమన్నారు. రాష్ట్రంలో కులాంతర వివాహాలు చేసుకున్నటువంటి వారిపైన హత్యలు జరుగుతున్నాయని, పరువుహత్యలపేరుతో హింసకాండ కొనసాగుతుందని, ప్రభుత్వయంత్రాంగం ప్రేక్షకపాత్ర వహించడంతోనే ఇలాంటి సంఘటనలు పునరావృత్తం అవుతున్నాయన్నారు. రాష్ట్రంలో ఎస్సి ఎస్టిసబ్‌ప్లాన్ నిధులను సక్రమంగా ఖర్చుచేయకుండా పక్కదారి పట్టిస్తున్నారని అందుకే దళితవాడలు, గిరిజనవాడలు అభివృద్ధికి వెనకబడుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు.అర్హులైన దళితులందరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, దసరాకానుకగా ప్రకటించిన మహిళలకు ఇస్తామన్న నగదు, రైతుభరోసాను ఇవ్వలేదన్నారు. ఆగ్రామ నాయకులు ఊశన్న, దప్పుకృష్ణయ్య, స్వామి, కృష్ణ, రాహుల్, ఆంజనేయులు, జగన్, బసవయ్య, రామస్వామి, మల్లేష్, రాజు పాల్గొన్నారు.

## బోగస్‌లేబర్ కార్డులు రద్దు చేయాలి




ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : భవననిర్మాణ కార్మికుల బోగస్‌లేబర్‌కార్డులను రద్దుచేయాలని ఎఐటియూసి భవననిర్మాణకార్మికసంఘం జిల్లా అధ్యక్షులు చిన్నపాగ శ్రీనివాసులు డిమాండ్‌చేశారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ భవననిర్మాణకార్మికులు లేబర్‌కార్డులను అసలైన కార్మికులు పొందడంలేదని, వివిధరంగాలలో పనిచేస్తున్న కార్మికులు, లేబర్‌కార్డులేనివారు వెంటనే లేబర్‌కార్డులకు దరఖాస్తుచేసుకోవాలని ఆయన కోరారు. అదేవిధంగా బోగస్‌కార్డులను వెంటనే రద్దు చేయాలని ఆయన తెలిపారు. లేనిపక్షంలో లేబర్‌కార్యాలయం ముందు ధర్నా చేపడుతామన్నారు. కార్మికులకు, భవన నిర్మాణ కార్మికులుకాని వారు కూడా కార్మికులు డబ్బులకోసం ఆశపడి లేబర్‌కార్డుకోసం దరఖాస్తులు చేసుకుంటున్నారని, అవకతవకలకు అవకాశం లేకుండా నిబంధనలు అమలుచేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో భవననిర్మాణ కార్మికసంఘం వర్కింగ్‌ప్రెసిడెంట్ గడ్డం బాలస్వామి, భవననిర్మాణ కార్మికులు పులిజాలకృష్ణయ్య, శంకర్, శ్రీను, లక్ష్మయ్య, బాలస్వామి, వెంకటస్వామి పాల్గొన్నారు.

# ప్రజలకు, ప్రభుత్వానికి వారధి ‘ప్రజాపక్షం’

### వార్షికోత్సవ సభలో బాగం హేమంతరావు



ప్రజాపక్షం/ ఖమ్మం : ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య ‘ప్రజాపక్షం’ దినపత్రిక వారధిగా పని చేయాలని నవచేతన గవర్నింగ్ బాడీ సభ్యులు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు కోరారు. ప్రభుత్వ పథకాలను ప్రజల దరి చేరేటట్లు చూడడంతో పాటు ప్రజాసమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకు పోవాలన్నారు. ‘ప్రజాపక్షం’ దినపత్రిక ఏడవ వార్షికోత్సవ సభ శనివారంఖమ్మంలోనిప్రైవేట్‌ఫంక్షన్ హాల్‌లో ఖమ్మం ఎడిషన్ ఇంచార్జి ఏనుగు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది.ముఖ్య అతిథిగా హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, ప్రజాపక్షం విలేకరులు, పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. హేమంతరావు మాట్లాడుతూ సమాజంలో మీడియా ఒక కీలక భూమిక పోషించాలని ఆయన కోరారు. ప్రతి అక్షరం ప్రజల పక్షమేనని ఏడు సంవత్సరాలుగా ప్రజాపక్షం రుజువు చేసుకుంటుందన్నారు. భవిష్యత్తులో సైతం ఇదే పంథాను కొనసాగించాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ ప్రజాపక్షం దినపత్రిక శ్రామిక జనవాణిగా నిలబడిందని వార్షికోత్సవ సందర్భంగా ఇం దుకు కారకులైన ప్రతి ఒ క్కరికిశుభాకాంక్షలు తెలు పుతున్నానని, ఇదే ఒరవడిని ముమ్ముందు కూడా కొనసాగించాలని కోరా రు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, కార్పొరేటర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బిజి క్లెమెంట్, ఖానాపురం హవేలీ ఏరియా సిపిఐ కార్యదర్శి ఏనుగు గాంధీ, ప్రజాపక్షం ఎడివిటి ఇంచార్జి టికె ప్రసన్నన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్టాఫ్ రిపోర్టర్ పి. సత్యనంద బాబు, ఆర్‌సి ఇంచార్జీలు కె. ప్రసాదరావు, వి. నాగేశ్వరారావు,కె.శ్రీనివాసరావు, బి. అశోక్, శ్రీకాంత్, సీనియర్ జర్నలిస్టులతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజాపక్షం మండల రిపోర్టర్లు, సిపిఐ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.


# ప్రజాపాలనలో విద్యార్థుల చదువులకు నిధుల్లేవా?

### ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి

ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ: తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యాశాఖ సీఎం రేవంత్‌రెడ్డి వద్ద ఉన్నప్పటికీ విద్యార్థుల ఫీజు బకాయిలు ఎందుకు విడుదల చేయడం లేదని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి ప్రశ్నించారు. విద్యాశాఖ సీఎం రేవంత్ రెడ్డి వద్ద ఉన్నా విధ్యార్థులకు ఉపయోగం లేదని స్పష్టమైందన్నారు. కమీషన్ల కోసమే ఫీజు బకాయిలు విడుదల చేయకుండా విధ్యార్థుల చదువులతో ప్రభుత్వం చెలగాటమాడుతూ రాష్ట్రంలో ఉన్నత విద్యారంగాన్ని ప్రభుత్వం భ్రష్టు పట్టిస్తుందన్నారు. ప్రజాపాలన అంటే విద్యార్థుల చదువులకై నిధులువిడుదల చేయరా?అని ప్రశ్నించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయి విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు, కళాశాలలు తరచూ బంద్ చేస్తే విధ్యార్థులు చదువులకు దూరమైనా ప్రభుత్వంలో చలనం లేకపోవడం సిగ్గుచేటన్నారు. అసెంబ్లీ సాక్షిగా రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట తప్పారని, విధ్యార్థులకు ఓట్లు లేకపోయినా విధ్యార్థుల తల్లి దండ్రులకు ఓట్లు ఉన్నాయనే విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుపెట్టుకుని నవంబర్ 1 తేదీలోపు మొత్తం ఫీజు బకాయిలు విడుదల చేయాలని, లేని పక్షంలో రాష్ట్రంలో ముఖ్యమంత్రిని, మంత్రులను తిరగనివ్వమని హెచ్చరించారు. కళాశాలల యాజమాన్యాలు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారని, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు సిబ్బందికి జీతాలు ఇవ్వలేక భవన కిరాయిలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని, సీఎం రేవంత్ రడ్డి ఫీజు బకాయిలు విడుదలపై మాట తప్పారని, అసెంబ్లీ సాక్షిగా నెలకు రూ.500 కోట్లు విడుదల చేస్తామని చెప్పి మోసం చేశారన్నారు. ఫీజు బకాయిలు విడుదల లేక డిగ్రీ, ఇంజనీరింగ్ ఇతర కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు డబ్బులు కట్టి సర్టిఫికెట్లు తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా ఇంజనీరింగ్, డిగ్రీ, పీజి కళాశాలలు తిరిగి నవంబర్ 3 నుంచి ఫీజు బకాయిలు విడుదల చేసే వరకు కళాశాలలు నిరవధిక బంద్ చేస్తామని ప్రకటించాయని, ఇప్పటికే మూడు సార్లు బంద్ నిర్వహించారని, దీంతో విద్యార్థులు తరగతులు వెనుకబడుతున్నారని తెలిపారు. ఇప్పుడిప్పుడే ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలల్లో తరగతులు సక్రమంగా జరుగుతున్నాయని, బంద్ చేస్తే విద్యార్థుల చదువులపై ప్రభావం పడుతుందన్నారు. వెంటనే ప్రభుత్వం కళాశాలల యాజమాన్యంతో చర్చించి విద్యార్థుల తరగతులకు ఇబ్బందులు లేకుండా బంద్ విరమించేలా, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్,స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఏఐఎస్‌ఎఫ్ విద్యార్థులను ఏకంగా చేసి ప్రభుత్వంపై మిలిటెంట్ ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

# పండుగలా సిపిఐ వందేళ్ల వేడుక

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మిడకంటి చిన్నవెంకట్‌రెడ్డి



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : సిపిఐ 100ఏండ్ల వేడుకను ఊరు,వాడ పండుగల జరుపుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని ఎఫ్‌సిఐ గౌడం వద్ద వేడుకలలో భాగంగా ఏర్పాటు చేసిన వాల్‌పెంటింగ్‌ను మునిసిపాలిటీ సిపిఐ బృందం తోకలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ... భారతదేశంలో 100ఏండ్ల చరిత్ర కలిగిన ఏకైక రాజకీయ పార్టీ సిపిఐ మాత్రమేనన్నారు. అటువంటి పార్టీ శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలకు ఖమ్మం అతిథ్యం ఇస్తుండటం ఇక్కడి కమ్యూనిస్టు పార్టీ ఉద్యమానికి దక్కి గౌరవంగా అభివర్ణించారు. ముగింపు వేడుకల విజయంతానికై గడపగడపకు వెళ్లి విస్తృత ప్రచారం చేయాలని సిపిఐ శాఖలకు సూచించారు. వందేండ్ల ప్రస్థానంలో సిపిఐ చేసిన పోరాటాలు, ఉద్యమాలు, వాటి ద్వారా వచ్చిన ప్రతిఫలాలను ప్రజలకు వివరించాలన్నారు. సిపిఐ జిల్లా సమితి సభ్యుడు వెంపటిసురేందర్,సిపిఐమండల సమితి సభ్యుడు దండి రంగారావు, మున్సిపాలిటీ నాయకులు పాల్తియా శ్రీను, వెంపటి రాము, లగిశెట్టి రమేష్, బియ్యాలరాజు, దేవిశెట్టి రంగారావుపాల్గొన్నారు.

# గుర్తింపు సంఘం కృషి ఫలితంగా ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లకు మోక్షం

### ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్



ప్రజాపక్షం/భూపాలపల్లి: సింగరేణిలో ఉన్న ట్రాన్స్‌ఫర్ పాలసీని మార్చాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) పలు మార్లు యాజ మాన్యం తో చర్చించి ఒప్పించి కార్మికుల వ్యక్తిగత, మ్యూచ్వల్, స్పౌస్, హెల్త్ గ్రౌండ్ ప్రాతి పదికన శనివారం 114మందికి ట్రాన్స్‌ఫర్ ఉత్తర్వులు ఇప్పించామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ పేర్కొన్నారు. సింగరేణిలో కార్మికులు ఎవరైతే పనిచేస్తున్న ప్రదే శంలో3సం.లసర్వీస్‌ఉండిఖాళీఉన్న ప్రాంతానికి ట్రాన్స్‌ఫర్‌కోరుకున్న వారికి, మ్యూచ్‌వల్ ట్రాన్స్‌ఫర్ పెట్టుకున్నవారికి, స్పౌస్ కేస్‌లో ఖాళీలను బట్టి, అదే విధంగా అనారోగ్యంతో బాధపడుతూ, ఖాళీలు ఉన్న ప్రాంతానికి ట్రాన్స్‌ఫర్ కోరిన వారికి శనివారం సింగరేణి యాజ మాన్యం ట్రాన్స్‌ఫర్ ఉత్తర్వులు ఇవ్వ డం జరిగిందని ఆయన పే ర్కొన్నారు. ట్రాన్స్‌ఫర్ పాలసీలో మ్యూచ్వల్ ట్రాన్స్‌ఫర్‌కి కూడా మూడు సంవత్సరాల సర్వీస్ నిబంధన ఉండేదని, ప్రస్తుతానికి మూచ్యువల్ ట్రాన్స్‌ఫర్‌పై 3 సంవత్సరాల నిబంధనను, స్పౌస్ కేసు ఖాళీల ప్రాతిపదికన వీటిని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ యాజ మాన్యంతో మాట్లాడి ఒప్పించి, వారికి కూడా ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ ఇవ్వడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా డైరెక్ట్ ట్రాన్స్‌ఫర్స్ మూడు సంవత్సరాలు దాటిన వారికి ఖాళీల ప్రాతిపదికన వారికి కూడ ట్రాన్స్‌ఫర్ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని ఆయన అన్నారు. ఈ విదంగా ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లు ఎఐటియుసి కృషి ఫలితంగా విడుదల అయ్యాయని ఆయన పేర్కొన్నారు.

# విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాడేది ఎఐఎస్‌ఎఫ్

### సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి మంద అనిల్‌కుమార్



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : విద్యా రంగ సమస్యలపై నిరంతరం పోరాడేది అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) అని జిల్లా కార్యదర్శి మంద అనిల్ కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సహస్ర జూనియర్ కళాశాలలో ఏఐఎస్‌ఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఏఐఎస్‌ఎఫ్ భారతదేశంలోనే అతి పురాతన విద్యార్థి సంఘంలో ఒకటి దీనిని 1936 ఆగస్టు 12న లక్నోలో స్థాపించారన్నారు. ప్రారంభంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర ఉద్యమంలో భాగంగా ఇది విద్యార్థులలో దేశభక్తిని నింపిందనీ ప్రస్తుతం ఇది భారత కమ్యూనిస్టు పార్టీతో అనుబంధంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరిస్తుందని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల ప్రారంభమై 20 నెలలు గడుస్తున్న కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయని, సమస్యల వలయంలో సంక్షేమ హాస్టల్లో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. వర్షాకాలంలో వర్షం కురిస్తే చాలావరకు హాస్టల్ భవనాలు, పాఠశాల భవనాలు నాని కూలిపోయే ప్రమాదం ఉందని వాటిని వెంటనే కూల్చివేసి నూతన భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు రావలసిన ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు కుర్ర రాకేష్ జిల్లా, కార్యదర్శి మంద అనిల్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు పెండెల ఆదిత్య పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## ఫ్లాగ్ డే సందర్భంగా బైక్ ర్యాలీ

ప్రజాపక్షం/సత్తుపల్లి: మండల పరిధిలోని గంగారంలో గల 15వ ప్రత్యేక పోలీసు పతాలము నందు పోలీసు అమరవీరుల శాంతిని కాంక్షిస్తూ పోలీసు ఫ్లాగ్ డే2025 దినోత్సవాలలో భాగంగా గంగారం గ్రామంలో శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. పోలీస్ అమర వీరుల ఆత్మకు శాంతి కలగలనే కాంక్షతో ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా అధికారులు, సిబ్బంది బైక్ ర్యాలీని నిర్వహించటం జరుగిందన్నారు. బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్స్ ఎస్.శ్రీధర్ రాజా, యస్.డి.రంగారెడ్డి, ఆఫీసర్స్, కానిస్టేబుల్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.



## సిపిఐ మండల సమితి సమావేశం



ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి: అన్నపురెడ్డిపల్లి మండల సిపిఐ మండల సమితి సమావేశం మండల కార్యదర్శి ఊకే ఆదినారాయణ ఆధ్వర్యంలో తొట్టిపంపు గ్రామంలో నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా సమితి సభ్యులు బొర్రా కేశవరావు పాల్గొన్నారు.ప్రజా ఉద్యమాలే సిపిఐకి ఆయుధమని, ఉద్యమాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యమ భావజాలాలతో భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ముగింపు ఉత్సవాల సభను ఖమ్మంలో డిసెంబర్ 26న ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోతున్నారని, ఈ బహిరంగ సభకు ప్రజలంతా ఐక్యంగా తరలి రావాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ పార్టీ పోటీ చేస్తుందని అన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు జడ శ్రీను, మండల నాయకులు పలగాని రామకృష్ణ, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

## డిఎ బకాయిలు చెల్లించి పిఆర్సి ప్రకటించాలి

ప్రజాపక్షం/ఆళ్లపల్లి: డిఏ బకాయిలు చెల్లించి, పిఆర్సి ప్రకటించాలని టిపిస్యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఇస్లావత్ హాథీరామ్ డిమాండ్ చేశారు. జెడ్పి హెచ్ఎస్ మర్కోడు పాఠశాలలో ఆ సంఘం మండల అధ్యక్షులు అగ్గి రామకృష్ణ మాట్లాడుతూ పాఠశాలలకు తనిఖీ బృందాల పేరుతో ఉపాధ్యాయులను డిప్టేషన్‌పై తీసుకోవడం వల్ల ఆయా పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఏర్పడుతుందన్నారు. పర్యావేక్షణ అధికారుల పోస్టులు భర్తీ చేయకుండా ఉపాధ్యాయులని తనిఖీ పేరుతో తీసుకోవడం వల్ల వచ్చే ప్రయోజనం ఏమీ లేదన్నారు. కాంప్లెక్స్ స్థాయి నుండి సిఆర్పిలు , ఎంఈవోలు, డీఈవోలు ఖాళీలు భర్తీ చేసి పర్యవేక్షణ చూడాలన్నారు. ఇప్పటికే పాఠశాలలో ఆన్లైన్ పేరుతో ఉపాధ్యాయులపై పని భారం పెరిగి బోధనా సమ యం వృధా అవుతుందన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయుల ప్రమోషన్స్ పండిట్ పీటీల అప్రిడేషన్ చేపట్టాలని కోరారు.

## వాటర్ ట్యాంక్‌కు మెట్లు ఏర్పాటు

ప్రజాపక్షం/ రఘునాథపాలెం :మండల కేంద్రమైన రఘునాథపాలెం గ్రామంలో వాటర్ ట్యాంక్‌కు ఐరన్ మెట్లను ఏర్పాటు చేశారు. గ్రామంలోని ప్రజలకు తాగునీటిని అందించే వాటర్ ట్యాంక్ మెట్లు శిథిలావస్థకు చేరడంతో ఇట్టి విషయాన్ని కాంగ్రెస్ నాయకులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మెట్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. శిథిలావస్థలో ఉన్న మెట్ల స్థానంలో నూతనంగా ఐరన్ మెట్లను శనివారం ఏర్పాటు చేశారు. సమస్య చెప్పిన వెంటనే పరిష్కరించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు గ్రామస్తుల తరుపున నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

## లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రారంభం



ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ : న్యాయం అందరికి సమానమేనని దానిని పొందే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కెవి చంద్రశేఖర్‌రావు తెలిపారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కెవి చంద్రశేఖర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వయోజన వృద్ధుల కోసం న్యాయ సేవలు అందిస్తామన్నారు. ప్రతి శనివారం, సోమవారం పారా లీగల్ వాలంటీర్లు అందుబాటులో ఉంటారని సీనియర్ సిటిజన్స్ సమస్యలు వారికి చెబితే రెవెన్యూ డివిజనల్ అధికారికి అందజేస్తారన్నారు. వయోజన వృద్ధుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన న్యాయ సహాయ కేంద్రమన్నారు. వయోజన వృద్ధులకి సంబంధించి మెయింటినెన్స్ మాత్రమే వారి పరిధిలో ఉంటుందని, భూ తగాదాలు, గిఫ్ట్ డిడ్స్ మార్చమని వచ్చే దరఖాస్తులు కలెక్టర్ పరిష్కరిస్తారని తెలిపారు. పారా లీగల్ వాలంటరీ నాగమణి పాల్గొన్నారు.

## రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు



ప్రజాపక్షం/కూసుమంచి: మండలంలోని ముత్యాలగూడెం, నేలపట్ల గ్రామాలలో రైతులకు మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. విత్తన మొక్కజొన్న వేయదలుచుకున్న రైతులు తప్పని సరిగా సంబంధిత కంపెనీల ఏజెంట్ల నుండి అగ్రిమెంట్ తీసుకోవాలని సూచించారు. పత్తి వేసిన రైతుకలు కపాస్ కిసాన్ యాప్ గురించి అవగాహన కల్పించారు. పత్తి వేసిన రైతుల వివరాలు గ్రామ పంచాయితీ కార్యాలయంలో ప్రదర్శించబడ్డాయని, రైతులు సరి చూసుకుని పొరపాట్లు ఉంటే వ్యవసాయ విస్తరణాధికారి వద్ద మొబైల్ నెంబర్ అప్డేట్ చేయించుకోవాలని తెలిపారు. అనంతరం కూసుమంచి గ్రామంలో జాతీయ ఆహార భద్రత పథకం పప్పు దినుసులు పథకంలో విత్తనాలు పంపిణీ చేసిన కంది పంటను పరిశీలించారు. వ్యవసాయ విస్తరణాధికారి రవి కుమార్, వంశీకృష్ణ, ప్రియాంక, రైతులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లు 30 గజాల కుదింపుపై హర్షం



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సంబంధించి 30 గజాల స్థలంలో కూడా జిప్లస్ 1 ఇల్లు ని ర్మించుకోవడానికి అనుమతులు ఇవ్వడం పట్ల ఖమ్మం కార్పోరేషన్ మే యర్ పునుకొల్లు నీరజ శనివారం హర్షం వ్యక్తం చేశారు.తెలంగాణ ప్రభుత్వానికి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభు త్వ నిర్ణయంతో పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఖమ్మం నియోజక వర్గంలో ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు నిర్మించాలనే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంకల్పానికి అనుగుణంగా ముందడుగు పడిందన్నారు. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఖమ్మం నగర పాలక సంస్థ పాలక వర్గం తరుపున మేయర్ ధన్యవాదాలు తెలిపారు.

# ప్రైవేట్ వ్యాపారులకే ధాన్యం విక్రయాలు

### బోనస్ చెల్లించనందుకే విక్రయిస్తున్నామన్న రైతులు



ప్రజపక్షం/ తిరుమలాయపాలెం : తిరుమలాయపాలెం మండలంలో వరిసాగుకు రైతులు ప్రాముఖ్యతనిచ్చి మండల వ్యాప్తంగా ప్రతి సంవత్సరం వరిసాగు విస్తీర్ణాన్ని పెంచుతున్నారు. గత కాలాన్ని పోల్చుకుంటే ప్రస్తుతం మండలంలో నీటి వనరులు పెరగడం దానికి తోడు అధిక వర్షాలు కురవడం ముఖ్య కారణం కాగా తిరుమలాయపాలెం మండలంలో భక్తరామదాసు ఎత్తిపోతల ప్రాజెక్టు ప్రారంభించినప్పటి నుండి బీడు భూములకు సాగునీరు అందడంతో రైతులు వరి పంటను అధిక మొత్తంలో సాగు చేస్తున్నారు. ప్రస్తుతం మండలంలో ఖరీఫ్ సీజన్‌లో 13,500 ఎకరాల్లో వరి పంటలను సాగు చేశారు. కష్టపడి పండించిన వరిధాన్యాన్ని రైతులు అమ్ముకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సహకార సొసైటీ ఐకెపి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తమ వరి ధాన్యాన్ని విక్రయిస్తే మేలు రకం సన్నాలకు రూ. 2300 అసలు రేటు అదనంగా క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించడంతో ఎక్కువ శాతం రైతులంతా కొనుగోలు కేంద్రాల్లో రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించారు. కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి వరిధాన్యాన్ని ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా 39వేల క్వింటాళ్లకు బోనస్ డబ్బులు రూ.1.95కోట్లు బకాయిలు ఉన్నాయని వ్యవసాయ అధికారులు తెలిపారు. బోనస్ డబ్బులు చెల్లించనందుకే రైతులు ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యాన్ని విక్రయిస్తున్నారని రైతు లు ఆరోపిస్తున్నారు. మండలంలో ముం దుగా సాగు చేసిన వరి పంట ఇప్పటికే పలు గ్రామాల్లో కోత మీషన్ల ద్వారా వరి పంటను కోయడం జరిగింది. ప్రైవేట్ వ్యాపారులు సన్నాలకు రూ.2200 ధరతో కొనుగోలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఎలాంటి తూర్పాల లేకుండా పచ్చి వరి ధాన్యానికి రూ.2200 ధర ప్రకటించి కొనుగోలు చేస్తున్నామని ప్రైవేట్ వ్యాపారులు తెలిపారు. వరి రైతులు కూడా ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించేందుకు సుముఖత చూపుతున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాసి కాంటాలు కాక రైతులు రాత్రిబంవళ్లు నానా అవస్థ పడ్డారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి బోనస్ డబ్బులు చెల్లిస్తే వరి రైతులు కొనుగోలు కేంద్రాలకు వరి ధాన్యాన్ని విక్రయించే అవకాశం ఉంది.

## ప్రణాళికతో విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలు

### కలెక్టర్ జితేష్ వి పాటిల్



పజాపక్షం/సుజాతనగర్: ప్రతి ఒక్క విద్యార్థి ప్రణాళికతో విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మండలంలోని వేపలగడ్డ నందు గల అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాల నందు శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాంకేతిక రంగం వేగంగా అభివృద్ధి చెందుతుందని, సాఫ్ట్వేర్ రంగంలో కొత్త కొత్త టెక్నాలజీలు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయని అన్నారు. విద్యార్థులు టెక్నాలజీని అందిపుచ్చుకుంటే ఉన్నత ఉద్యోగ అవకాశాలు పొందవచ్చునని అన్నారు. సివిల్స్‌లో రాణించాలనుకునే విద్యార్థులకు ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా అదే విధంగా ప్రత్యేకంగా తరగతులు చెప్పేందుకు సైతం తాను ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని కలెక్టర్ హామీ ఇచ్చారు. విద్యార్థులకు గ్రూప్ వన్ ఆఫీసర్ భానోత్ పృథ్వి మాట్లాడుతూ బీటెక్ విద్యను అభ్యసించేవారు.ప్రిన్సిపాల్ డాక్టర్ దయాకర్, రమేష్, శ్రీకాంత్, సైదయ్య, బాబురావు లక్పతి, హెచ్ఓడి లు మునీర్, రవికిరణ్, కృష్ణ మోహన్, వినోద్, వెంకటేశ్వరరావు, కృష్ణ పాల్గొన్నారు.

## పత్తి విక్రయానికి స్లాట్ బుక్ చేసుకోవాలి

### జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య



ప్రజాపక్షం/రఘునాథపాలెం : రైతులు పండించిన పత్తిని విక్రయించేందుకు కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు. శనివారం మండల పరిధిలోని చిమ్మపుడి గ్రామంలో యూరియా కంపెనీని జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య పరిశీలించి రైతులతో మాట్లాడారు. పత్తికి మద్దతు ధర పొందేందుకు రైతులు తప్పనిసరిగా కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకుని సమీపంలోని సిసి ఐ కేంద్రాల్లో విక్రయించాలని ఆయన సూచించారు. మోతాకు మించి నత్రజని ఎరువులను వాడితే ఎటువంటి ప్రయోజనం ఉండదని, పంటలు చీడ పీడ బారినపడి దిగుబడి తగ్గే అవకాశం ఉందని తెలిపారు. విత్తనం మొక్కజొన్న సాగు చేసే రైతులు తప్పని సరిగా విత్తన కంపెనీలతో అగ్రిమెంట్ కుదుర్చుకోవాలని తద్వారా భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె. ఉమామహేశ్వరరెడ్డి, సొసైటీ సిఈవో వి. శ్రీనివాస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలకు పఠన సామర్థ్యం ఉండాలి

### ప్రతి రోజు ఎప్రీ చైల్డ్ రీడ్స్ అమలుపై కలెక్టర్ సమీక్ష



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు వంద శాతం పఠన సామర్థ్యం ఉండాలనే ఉద్దేశంతో ఎవ్రీ చైల్డ్ రీడ్స్ అనే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించి కార్యక్రమ అమలుపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎవ్రీ చైల్డ్ రీడ్స్ అనే కార్యక్రమాన్ని అక్టోబర్ 27 (సోమవారం) నుంచి ప్రారంభిస్తున్నామని పాఠశాల సమయాల్లో మా త్రమే ఈ కార్యక్రమం అమలు చేసేలా డిజైన్ చేయ డం జరిగిందన్నారు. ప్రతి రోజు గంట సమయం ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థుల రీడింగ్ స్కిల్స్ పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం మూడు గంటల నుంచి నాలుగు గంటల వరకు గంట సేపు ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదవ తరగతి చదివే పిల్లలకు ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం అమలు చేయాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలన్నారు. ఆంగ్ల భాష ఫోనెటిక్స్ బేసిక్‌గా ఈ కార్యక్రమం డిజైన్ చేశామన్నారు. ప్రతి ఆంగ్ల అక్షరం ఏవిధంగా సౌండ్ చేస్తుంది అనేది విద్యార్థులకు తెలిసేలా ఉపాధ్యాయుల బోధన ఉండాలన్నారు. చిన్న చిన్న పదాలతో ఫోనోటిక్ సౌండ్ నేర్పించాలని కలెక్టర్ తెలిపారు. సులువైన పదాలతో ప్రారంభించి సరళంగా ఆంగ్లం చదివే సామర్థ్యం వచ్చేలా మెటీరియల్ తయారు చేశామన్నారు. ప్రతి టీచర్ అక్టివిటి, స్టూడెంట్ అక్టివిటి ఒక స్టోరీగా చెబుతూ పిల్లలను ఇంట్రాక్ట్ చేస్తూ ఈ కార్యక్రమం అమలు చేయాలన్నారు. నెల రోజుల పాటు ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమాన్ని సరిగ్గా అమలు చేస్తే ప్రతి విద్యార్థికి చదివే సామర్థ్యం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లలను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయాలని తరగతి గదిలోని ప్రతి విద్యార్థికి అవకాశం వచ్చేలా చూడాలన్నారు. ప్రతి బుధవారం విద్యార్థి రీడింగ్ స్కిల్స్ ఏ స్థాయిలో ఉన్నాయో (అక్షరాలు, పదాలు, వాఖ్యలు) యాప్‌లో అప్‌డేట్ చేయాలని ఉపాధ్యాయులు వాస్తవ పరిస్థితులను అప్‌డేట్ చేయాలని తప్పుడు రిపోర్టులు పెట్టవద్దని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ప్లానింగ్ కో ఆర్డినేటర్ సిహెచ్ రామకృష్ణ, సిఎంవో ప్రవీణ్, ఆర్ఎంవో ప్రభాకర్ రెడ్డి, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## 27న పెన్షనర్ల ధర్నా

### ఎస్‌జిపిఎటి పిలుపు




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్ర భుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల 27న జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే పెన్షనర్ల ధర్నాను జయప్రదం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్ జిపిఏటి) రాష్ట్ర కార్యదర్శి వి. మేరీ ఏసుపాదం, ఖమ్మం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య లు పిలుపునిచ్చారు. శనివారం కృషి భవన్‌లో పరిశ పుల్లయ్య అధ్యక్షతన జరిగిన ఎస్‌జిపిఏటి ముఖ్య కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి మేరీ ఏసుపాదం మాట్లాడుతూ ప్రభుత్వం నుండి రావాల్సిన ఉద్యోగ విరమణ బకాయిలు రాక పలువురు పెన్షనర్లు తనువు చలిం చారన్నారు. 2024 మార్చి నుంచి 10వేల మందికి పైగా ఉద్యోగ విరమణ పొందారని వారికి రావాల్సిన బకాయిలు సకాలంలో రాకపోవడంతో ఆర్థి కంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మంజిల్లాలో ఉద్యోగ విరమణ బకాయిలు తీసు కోకుండానే నలుగురు తనువు చలించారని ఈ మరణాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించి పెన్షనర్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి రాయల రవికుమార్, ఉపాధ్యక్షులు పెదమాళ్ల సత్యనారాయణ, కె. శరత్‌బాబు, ఉడుగు వెంకటేశ్వర్లు, జిల్లా వెంకటేశ్వర్లు, మహిళా కార్యదర్శులు బి. కృష్ణకుమారి, తాడి అంజలి, కొట్టె అన్నమ్మ, జిల్లా కార్యదర్శులు రాధాకృష్ణమూర్తి, ప్రసాదరావు, మధుకర్‌రెడ్డి, నాగప్రసాద్, కృష్ణారావు, సుధాకర్, ఆళ్ల రామారావు, అబ్రహం పాల్గొన్నారు.

## డిసెంబర్ 26వ ఖమ్మంలో సిపిఐ శత జయంతి ముగింపు వేడుకలు

### సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి



ప్రజాపక్షం/మణుగూరు: డిసెంబర్ 26వ తేదీన ఖమ్మంలో 5 లక్షల మందితో జరుగు సిపిఐ శత జయంతి ముగింపు వేడుకలు, భారీ బహిరంగ సభ ను జయ ప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పినపాక మండల కార్యవర్గ, ముఖ్యుల సమావేశం కామ్రేడ్ కోయకుంట్ల రమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఖమ్మం లో డిసెంబర్ 26వ తేదీన జరుగు సిపిఐ శత జయంతి ముగింపు వేడుకల కోసం ఇప్పటినుండే గ్రామ గ్రామాన కరపత్రం ద్వారా సిపిఐ 100 సంవత్సరాలు చరిత్ర ను వివరిస్తూ ప్రచారం కొనసాగించాలని, ఓ వైపు ప్రచారం చేస్తూనే బహిరంగ సభకు వెళ్ళటానికి అవసరమయే నిధులు సమకూర్చుకోవాలని వారు అన్నారు. దీని కోసం జానాసేవధళ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున 3 రోజుల పాటు శిక్షణా ఉంటుందన్నారు. బహిరంగ సభకు సిపిఐ శ్రేణులు, మహిళలు, యువకులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, కర్షకులు, గిరిజనులు అన్ని వర్గాల ప్రజలు సన్నద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ సభకు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ డి రాజా, జాతీయ నాయకులు, వివిధ దేశాల ప్రతినిధులు సుమారు 40 దేశాల వారు హాజరవుతున్నారని, కావున దీనిని జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు గడ్డం మనోహరాచారి, పత్తిపాటి నాగేశ్వరరావు,తంగిల్లపల్లి వెంకన్న, మన్నెం ఐలయ్య, కారం సురేష్, రమేష్, పళ్ళ నాయుడు, వెంకటేశ్వర్లు, రమణ మరికొందరు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



ప్రజాపక్షం/ఇల్లందు: పేదలకు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంఎల్ఏ కోరం కనకయ్య అన్నారు. శనివారం కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టివేసి ఆర్థిక ఊబిలోకి నెట్టివేసిందని విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టాక ఆర్థిక వ్యవస్థను గాడినపెడుతూ సంక్షేమ పథకాలు అందచేస్తుందని, ఈ క్రమంలో కొంత సమయం పడుతున్నప్పటికీ ప్రతి పథకం అమలు చేస్తామని లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పేదలు తమ ఆడ పిల్లలకు వివాహం జరిపించుకునేందుకు చేదోడు వాదోడుగా ఉండాలని కళ్యాణ లక్ష్మీ, షాదీముబాకర్ పథకాల ద్వారా లబ్దిదారులకు లక్ష పదహారు అందజేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ కోట రవికుమార్, మార్కెటి ఛైర్మన్ రాంబాబు, డి ఎస్పి చంద్ర భాను, ఇల్లందు టౌన్, మండల పార్టీ అధ్యక్షులు దొడ్డా డానియల్, పులి సైదులు, ఇల్లందు మండల మాజీ వైస్ ఎంపీపీ మండల రాము, మాజీ మున్సిపల్ ఛైర్మన్ యదలపల్లి అనసూర్య, మడుగు సాంబమూర్తి, గందె సదానంద, మండల టౌన్, ప్రధాన కార్యదర్శి అరెం కిరణ్, సుదర్శన్, రాయల్ మున్నా, కోరీ, జాఫర్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు ఈసం లక్ష్మణ్, నాయకులు పాయం క్రిష్ణ ప్రసాద్, ప్రసన్న కుమార్ యాదవ్, తాటి బిక్షం, తాటి రాంబాబు, కల్తీ పద్మ, పాయం స్వాతి, బానోత్ శారద, పాయం లలిత, మోకాళ్ళ వెంకటమ్మ, గాలి స్వరూపా, భూక్యా రమాదేవి, మండల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు విరాళాల సేకరణ



ప్రజాపక్షం/చింతకాని : డిసెంబర్ 26న ఖ మ్మంలో జరిగే సిపిఐ శ తాబ్ది ఉత్సవాల ముగింపు సభకు చింతకాని మండల వ్యాప్తంగా పార్టీ శ్రేణులు విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నాయి. గ్రామల్లో వాల్ రైటింగ్ తో పాటు శాఖ సమావేశాలు ఏర్పాటు చేస్తూ ప్రచారాన్ని ప్రారంభించారు. ముగింపు సభ ప్రచారంలో భాగంగా శనివారం చింతకాని మండలంలోని నేరడ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఇంటింటికీ ప్రచార కార్యక్రమం నిర్వహిండంతో పాటు విరాళాల సేకరణ చేస్తున్నారు. జమ్ముల జితేందర్ రెడ్డి మాట్లాడుతూ సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ కు నేరడ గ్రామం నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పావులూరి మల్లిఖార్జున్, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, శాఖ కార్యదర్శి షేక్ దస్తగిరి, సహాయ కార్యదర్శి మట్టా రవి తదితరులు పాల్గొన్నారు.

## గణేశ్వరం పాఠశాలకు రాష్ట్ర స్థాయి అవార్డు




ప్రజాపక్షం/ రఘునాథపాలెం : మండల పరిధిలోని గణేశ్వరం ప్రాథమికోన్నత పాఠశాలకు రాష్ట్ర స్థాయి అవార్డు లభించింది. రాష్ట్ర స్థా యిలో గణేశ్వరం పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం అత్యధికంగా ఉన్నందున రాష్ట్ర స్థాయి అవార్డును ప్రదానం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నవీన్ నికోలస్ నుండి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. విజయశ్రీ అవార్డును అందుకున్నారు.95 శాతానికి పైగా హాజరు నమోదైనందుకు ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర స్థాయిలో అత్యధిక విద్యార్థుల హాజరు నమోదులో గణేశ్వరం పాఠశాల నిలవడం ఎంతో అభినందనీయమన్నారు. దీనికి కృషి చేసిన హెచ్ఎం విజయశ్రీ, ఉపాధ్యాయులు రఫీక్‌పాషా, గోపాలరావు, మజ్‌హర్, వెంకటేశ్వరరావు, విజయలక్ష్మి తదితరులను అభినందించారు. ఉపాధ్యాయుల బోధన పట్ల విద్యార్థులు ఆకర్షితులై ప్రతి రోజు పాఠశాలకు వచ్చేందుకు ఆసక్తి చూపడం వల్లే ఈ అవార్డు రావడానికి ప్రధాన కారణమని ఎంఈవో తెలిపారు. హెచ్ఎం విజయశ్రీ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో అవార్డు రావడం రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలపై నమ్మకంతో తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపడం వల్లే ఈ అవార్డుకు కారణమన్నారు. తోటి ఉపాధ్యాయులతో సహకారం అందించిన తల్లిదండ్రులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

## నాయిబ్రాహ్మణ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్నిక

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : తెలంగాణ నాయి బ్రాహ్మణ సంఘం ఐక్యవేదిక ఖమ్మం జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులను రాష్ట్ర కమిటీ శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఖమ్మం పట్టణానికి చెందిన నంద్యాల నరసింహారావు, కార్యదర్శిగా రావులపాటి శ్రీనివాస్‌రావులను ఎన్నుకున్నట్లు నరసింహారావు తెలిపారు. సంఘం సభ్యులు, మిత్రుల, కుటుంబ సభ్యులు అభినందించారు. నాయిబ్రాహ్మణుల స మస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. త్వరలో జిల్లా మహాసభను ఏర్పాటు చేసి ఏర్పాటు చేస్తామన్నారు.







# స్థానికం REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## ప్లానిటోరియం మ్యూజికల్ గార్డెన్ పనులను పరిశీలించిన బల్దియా కమిషనర్



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణలో చేపడుతున్న ప్లానిటోరియం పనులతో పాటు కాకతీయ మ్యూజికల్ గార్డెన్ (కెఎంజి) పనులను క్షేత్రస్థాయిలో బల్దియా కమిషనర్, కుడా వైస్ చైర్మన్ చాహత్ బాజ్ పాయ్ శనివారం సందర్శించి పనుల పురోగతిని అధికారుల అడిగి తెలుసుకున్నారు. సిహెచ్ అజిత్ రెడ్డి, ఈఈలు రవి కుమార్, భీమ్‌రావు, హెచ్ఓ అనిల్,డిఈలు రాజ్‌కుమార్, రాగ్‌శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## ములుగులో 59 మద్యం షాపులకు 1863 దరఖాస్తులు

**ప్రజాపక్షం/ములుగు:** 2005–27 సంవత్సరాలకు గాను ఏ4 మద్యం షాపుల దరఖాస్తు ప్రక్రియ తేదీ అక్టోబర్ 23న ముగిసిందని, భూపాలపల్లి ఎక్సైజ్ యూనిట్‌లోని మొత్తం 59 మద్యం షాపులకు గాను 1863 దరఖాస్తులు రావడం జరిగిందని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లెండర్ల దరఖాస్తు ఫీజు రూపంలో రూ.55కోట్ల 89లక్షల రూపాయల ఆదాయం ఆర్జించడం జరిగిందని, భూపాలపల్లి ఎక్సైజ్ యూనిట్‌లో అత్యధికంగా మల్లంపల్లి గ్రామం, మండలం మద్యం షాపుకు 77 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. అక్టోబర్ 27 సోమవారం మద్యం షాపుల కేటాయింపుకు సంబంధించిన లాటరీ ప్రక్రియను భూపాలపల్లి పట్టణంలోని మంజూర్‌నగర్‌లోని ఇల్లెందు క్లబ్‌హౌస్‌లో ఫంక్షన్‌హాల్‌నందు జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ రాహుల్ శర్మ సమక్షంలో ఉదయం 10 గంటలకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి భూపాలపల్లి ఎక్సైజ్ యూనిట్‌లో మద్యం షాపులకు దరఖాస్తు చేసిన దరఖాస్తుదారులు లేదా ఆథరైజ్డ్ రిప్రెసెంటేటివ్ అక్టోబర్ 27 సోమవారం ఉదయం 9 గంటలకల్లా ఇల్లందు క్లబ్ హౌస్ ఫంక్షన్‌హాల్ నందు వారికి కేటాయించిన సీట్లలో హాజరు కావాల్సిందిగా ఈ సందర్భంగా కోరారు. దరఖాస్తుదారులు లేదా ఆథరైజ్డ్ రెప్రెసెంటేటివ్ ఈ కార్యక్రమానికి హాజరు కావడానికి వారు దరఖాస్తు చేసిన సమయంలో వారికి ఇచ్చినటువంటి రిసిప్ట్ కమ్ ఎంట్రీ పాస్ ఒరిజినల్‌ను తీసుకొని హాజరుకావాలని తెలిపారు.

## మంత్రి కొండా సురేఖను కలిసిన ఎండోమెంట్ డైరెక్టర్



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** తెలంగాణ ఎండోమెంట్ డైరెక్టర్‌గా హరీష్, ఐఎఎస్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖను శనివారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో మంత్రి సురేఖ, హరీష్‌కు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖకు హరీష్ కృతజ్ఞతలు చెప్పారు.

## జనగామ బిసి జాక్ స్టీరింగ్ కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం / జనగామ:** జనగామ జిల్లా బిసి జాక్ స్టీరింగ్ కమిటీ ఎన్నిక శనివారం జరిగింది. పట్టణంలోని ఎన్ఎంఆర్ గార్డెన్‌లో వివిధ బిసి కులాల సమావేశం దూడల సిద్దయ్యగౌడ్ అధ్యక్షతన జరగగా అడక్ కమిటి ఛైర్మన్ సెవెల్లి సంపత్, వైస్ చైర్మన్ ధర్మపురి శ్రీనివాస్, సలహాదారులు డాక్టర్ కల్నల్ బిక్షపతి, కంచె రాములు, మంగళంపల్లి రాజు, జాయ మల్లేష్, పండుగ హరీష్ , కొత్తపల్లి అభినాష్, సింగిరి ప్రశాంత్‌లు మాట్లాడారు. జనగామ జిల్లా బిసి జాక్ రాష్ట్రంలోని 33 జిల్లాలకు దిక్సూచిగా నిలుస్తుందన్నారు. ప్రతి కుల సంఘం నుండి ఒకొకరిని స్టీరింగ్ కమిటిలోకి తీసుకుంటామన్నారు.

## లోడింగ్ చేయడం లేదంటూ లారీ డ్రైవర్ల ఆందోళన



**ప్రజాపక్షం/మహాదేవపూర్:** జయశంకర్ జిల్లా మహాదేవపూర్ మండలంలోని బెగ్లూరు ఇసుక క్వారీలో లారీలను లోడు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ శనివారం లారీ డ్రైవర్లు ఆందోళన చేపట్టారు.క్వారీ నిర్వాహకుల నిర్లక్ష్యంతో దూర ప్రాంతాల నుండి వచ్చి రోజుల తరబడి ఇక్కడే ఉండాల్సిన పరిస్థితులతో అనేక ఇబ్బందులు పడుతున్నామని,గత ఐదు రోజులుగా ఇక్కడే ఉండి తమ లారీలను లోడు చేయాలని అడిగితే ఇప్పుడే లోడు కావని ఎక్కడ చెప్పుకుంటారో చెప్పుకోండని నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని అవేదనవ్యక్తం చేసారు.జీరో దందాకు ప్రాధాన్యతనిస్తూ రాత్రి పగలు తేడా లేకుండా జీరో లారీలను లోడు చేస్తున్నారని ఆరోపించారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి దూర ప్రాంతాల నుండి వస్తున్న తమకు నిబందనలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని కోరారు.

## రఘునాథపల్లి రోడ్ల అభివృద్ధికి రూ.30కోట్లు మంజూరు

జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాంబాబు

**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** రఘునాథపల్లి మండల అభివృద్ధి కొరకు రూ. 30 కోట్ల నిధులు తీసుకొచ్చిన ఘనత మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికే దక్కుతుందని జనగామ జిల్లా గ్రం థాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు అన్నారు. మండల కేంద్రంలో శనివారం నియోజకవర్గ పరిధిలో ఆర్‌అండ్‌బి, పిఆర్ హ్యామ్ రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేసినందుకు సిఎం రేవంత్‌రెడ్డి, అందుకు సహకరించి న ఎంపి కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి చిత్రపటానికి రాంబాబు తోపాటు జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రఘునాథపల్లి నుండి రామన్నగూడెం వరకు డబుల్ రోడ్ కోసం రూ.16.94కోట్ల నిధులు మంజూరు కాగా, రఘునాథపల్లి నుండి అశ్వరావుపల్లి వరకు రోడ్డు నిర్మాణం కోసం రూ. 5.64 కోట్ల నిధులు మంజూర్యాయని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం అంకితభావంతో కృషి చేస్తున్న కడియం శ్రీహరిపై పని, పసలేని సన్నాసులు విమర్శలు చేయడం వారి దివాళాకోరుతనానికి నిదర్శనంగా నిలుస్తుందని పరోక్షంగా మాజీ ఎమ్మెల్యే రాజయ్యపై మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, మార్కెట్ కమిటీ డైరక్టర్లు ఎండి బాషమియా, పర్శ సిద్దేశ్, రమేష్, నాయకులు మహేందర్‌రెడ్డి, నరేందర్, భాస్కర్, వెంకటేష్ యాదవ్, అబ్బాస్ మియా, శ్రవణ్‌కుమార్, రవి, రమేష్, రవి,మాల్యానాయక్,రవీందర్, రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఐటిడిఏ కొత్త భవన నిర్మాణ స్థల పరిశీలన

ములుగు కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ములుగు:** ఐటిడిఏ కొత్త భవన నిర్మాణం శంకుస్థాపన కోసం అన్ని ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. శనివారం ఏటూరునాగారం మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఐటిడిఏ పిఓ చిత్రామిశ్రాతో కలిసి ఐటిడిఏ కొత్త భవన నిర్మాణం కొరకు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొమురం భీం స్పోర్ట్స్ స్టేడియం వద్ద అనువైన స్థలంను గుర్తించడం జరిగిందని అన్నారు. ప్రస్తుతం ఉన్న ఐటిడిఏ భవనం శిథిలావస్థలో ఉన్నందున నూతన భవనం నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించడం జరిగిందని అన్నారు.

**ఉచిత కంటి పొర చికిత్స శిబిరాన్ని సందర్శించిన కలెక్టర్**

ఏటూరునాగారంలోని ఐటిడిఏ గిరిజన భవనంలో శంకర నేత్రాలయ ఎంఇఎస్‌యు హైదరాబాద్, సంజోష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత కంటి పొర చికిత్స శిబిరాన్ని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సందర్శించారు. శిబిరంలో చికిత్స చేయించుకోవడానికి దూర ప్రాంతాల నుండి వచ్చిన వారి వివరాలు తెలుసుకున్నారు. కంటి పరీక్ష కేంద్రం వద్ద వైద్యులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో కంటి శస్త్ర చికిత్స శిబిరం ఏర్పాటు చేయడం, ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. తన సొంత ఊరి కోసం హీరో సంజోష్ చేస్తున్న సేవా కార్యక్రమాలను కలెక్టర్ సంజోష్‌ను అభినందించారు. ప్రతి ఒక్కరు సంజోష్ చేస్తున్న సేవా కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. ఇప్పటివరకు కంటి చూపు పొర చికిత్స పరీక్షల కోసం 590 మంది పరీక్షలు చేయించుకున్నారని, వారిలో 110 మంది శస్త్ర చికిత్సకు అర్హులు అయ్యారని సంజోష్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సినీ నటుడు సంజోష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ వెంకటేష్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ వీరభద్రం, తహసీల్దారు జగదీశ్వర్, నిర్వాహకులు సంజోష్, ఉపేంద్ర రాచపల్లి, తదితరులు పాల్గొన్నారు.

## టియుడబ్ల్యుజె (ఐజెయు) ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/ వరంగల్:** టియుడబ్ల్యుజె(ఐజెయు) ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా నూతన కమిటీని పిఆర్‌ఆర్ కన్వెన్షన్ హాల్‌లో టియుడబ్ల్యుజె(ఐజెయు) వరంగల్ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్ రాంచందర్ అధ్యక్షతన శనివారం ఎన్నుకున్నారు. ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కమిటీ అధ్యక్షుడుగా కందుల శ్రీధర్ (99టివి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్), ప్రధాన కార్యదర్శిగా ఊరటి రాజు (బిఆర్‌కె న్యూస్ నర్సంపేట), కోశాధికారి ఎండి నాజర్ (ఆర్‌టివి వర్ధన్నపేట), ఉపాధ్యక్షులుగా తరాల రవితేజ (స్వతంత్ర టివి వరంగల్ ఈస్ట్), దైనం పల్లి దత్తాత్య (సిటీ న్యూస్ వరంగల్ ఈస్ట్), ఆమ్మ రాజు (10టివి నర్సంపేట), సహాయ కార్యదర్శులుగా బేతి ఉమాశంకర్ (టి న్యూస్ వరంగల్ ఈస్ట్), సిద్దోజు నితీష్ (క్యూ న్యూస్ వరంగల్ ఈస్ట్), పికె రవీందర్ (మహా న్యూస్ వర్ధన్నపేట), కార్యవర్గ సభ్యులుగా పెసరి రాజేంద్రప్రసాద్ (భారత్ టుడే వరంగల్), మేరుగు రాము (V6 నర్సంపేట), ఆగారపు స్వామి( V6 నర్సంపేట) ముసుగోటి అనిల్ కుమార్ (ఎన్‌టివి వర్ధన్నపేట)లను నియమించారు. అదేవిధంగా జిల్లా కమిటీ లో ఖాళీగా ఉన్న మూడు పోస్టులు జాయింట్ సెక్రటరీగా బాదావత్ బాలాజీ (వరంగల్ ఆంధ్రప్రభ), కార్యవర్గ సభ్యులుగా గూగులోతు నర్సింహ(చెన్నారావుపేట మండలం ప్రజాపక్షం), గాదెం రవి (దుగ్గొండి మండలం తెలుగు పత్రిక) లను నియమించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టా దుర్గాప్రసాద్, కోశాధికారి కోదాటి గోపాలకృష్ణ, ఉపాధ్యక్షులు కూర్మ వెంకటేశ్వర్లు, మహాదేవుని జగదీష్, జాయింట్ సెక్రటరీ లు బొమ్మగాని సతీష్ కుమార్, చింతనూరి రాజు, కార్యవర్గ సభ్యులు ఎండి హుస్సేన్ పాషా, బాబర్, అక్రమ్ లు పాల్గొన్నారు.

## ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పూర్తి

జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్




**ప్రజాపక్షం / జనగామ :**ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి రిజ్వాన్ బాష షేక్ అధికారులను ఆదేశించారు. శనివారం చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి హైదరాబాద్ నుండి అదనపు ముఖ్య ఎన్నికల అధికారి లోకేష్‌కముఅర్‌తో కలిసి జిల్లా కలెక్టర్లు, ఆర్‌ఓలతో స్పెషల్ ఇంటెన్సివ్‌పై సమీక్ష నిర్వయించారు. అనంతరం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అధికారులతో సమీక్ష నిర్వయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2002 ఎలక్టోరల్ జాబితాతో నియోజకవర్గాల వారిగా 2025 ఎలక్టోరల్ జాబితా మ్యాపింగ్ చేసి 4 కేటగిరీలుగా విభజించడం జరిగిందన్నారు. ఎ కేటగిరిలో 1987కు ముందు జన్మించి 2002,2025 ఎలక్టోరల్ జాబితాలో నమోదు కాబడిన వారు, కేటగిరి బిలో 1987 కంటే ముందు జన్మించి 2002 ఓటర్ జాబితాలో లేకుండా 2025 జాబితాలో నమోదు కాబడిన వారు,కేటగిరి సి లో 1987 నుండి 2002 మధ్యలో జన్మించి 2025 ఓటరు జాబితాలో నమోదు కాబడిన వారు, డి కేటగిరిలో 2002 నుండి 2007 మధ్యలో జన్మించిన వారిగా విభజించడం జరిగిందన్నారు. సి,డి క్యాటరిలోని వారిని ఎ మ్యాపింగ్ చేయాలని, ఎఈఆర్‌ఓల ఆద్వర్యంలెఓ బిఎల్‌ఓ, సూపర్‌వైజర్లు బిఎల్‌ఓలు యాప్ ద్వారా వచ్చే శనివారం నాటికి పూర్తి చేయాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఈ కార్యక్రమం జరగాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బెన్షాలోమ్, ఆర్డిఓ గోపిరాం, వెంకన్న, కలెక్టరేట్ ఓ తహసీల్దార్లు పాల్గొన్నారు.

## 'డయల్ 100' ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్




**ప్రజాపక్షం/హనుమకొండ :** డయల్ 100 ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని కాకతీయ విశ్వవిద్యాలయము సమావేశ ప్రాంగణంలో నిర్వహించారు. వరంగల్ కమిషనరేట్ చెందిన పోలీస్ అధికారులు పాల్గొన్న ఈ సమీక్షా సమావేశంలో పోలీస్ కమిషనర్ ముందుగా సుధీర్ఘ కాలంగా పెండింగ్‌లో వున్న కేసులను సమీక్ష జరిపడంతో పాటు పెండిరగ్‌కు గల కారణాలను పో లీస్ కమిషనర్ సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకోవడంతో పాటు కేసుల పరిష్కారం కోసం అధికారులు తీసుకోవాల్సిన చర్యలను పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్ల కఠినంగా వ్యవహారిస్తూనే వారి కదలికలు, స్థితి గతులపై నజర్ పెట్టాలని, గత కొద్ది కాలంగా రౌడీ షీటర్లు స్థానికంగా లేకుంటే, అతను ప్రస్తుతం నివాసం వుంటున్న ప్రాంతానికి చెందిన పోలీసులకు సమాచారం ఇవ్వాలని. చోరీలకు పాల్పడిన నిందితులతో పాటు, గం జాయి విక్రయాలకు పాల్పడే వారిపై హిస్టరీ షీట్లను తెరవాలని. సైబర్ నేరాల్లో కేవలం బాధితులు నష్టపోయిన సొమ్మును తిరిగి ఇప్పించడమే కాకుండా, నిందితుడి పట్టుకొనేందుకు స్టేషన్ అధికారులు కృషి చేయాలని, పొక్సో కేసుకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలన్ని గడువు లోపు పూర్తి చేయాలని. రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ అధికారిగా ఎస్. ఐ స్థాయి అధికారి తప్పక విధులు నిర్వర్తించాలని, ట్రాఫిక్ పోలీసుల తరహాలోనే స్టేషన్ అధికారులు తమ పరిధిలో పెండింగ్ లో వున్న ట్రాఫిక్ జరిమానాదారులకు ఫోన్ చేసి జరిమానా చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని. చోరీ కేసుల్లో రికవరీ శాతాన్ని పెంచాలని, చోరీలకు పాల్పడిన నిందితులను పట్టుకోవడం కోసం ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయడంతో పాటు నిందితులు దేశంలో ఎక్కడ వున్న అరెస్టు చేసేందుకు పోలీస్ అధికారులు ప్రణాళికను రూపొందించుకోవాలని, కేసుల్లోని నిందితులను అరెస్టు చేయడంలో స్టేషన్ అధికారులు అలసత్వం వహించోద్దని, నేరాల నియంత్రణకై పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజల భాగస్వామ్యంతో సిసి కెమెరాల ఏర్పాటుకై కృషి చేయడంతో సిసి కెమెరాల వినియోగం పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, ముఖ్యంగా నిందితులకు కచ్చితంగా శిక్ష పడే రీతిలో పోలీస్ అధికారులు దర్యాప్తు చేపట్టాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో నేర చరిత్ర వున్న వ్యక్తుల ప్రస్తుత స్థితిగతులపై వివరాలు అందుబాటులో వుందాలని, ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్ కేసులను ట్రాఫిక్ పోలీసులతో పాటు, లా అండ్ ఆర్డర్ పోలీసులు నమోదు చేయాల్సి వుంటుందని. పోలీస్ స్టేషన్లలో ఆహ్లాదకరమైన వాతవరణం కోసం మొక్కల పెంపకంతో పాటు స్టేషన్ పరిసరాల్లో పరిశుభ్రంగా వుంచాలని ఇందుకోసం ప్రతి శుక్రవారం పోలీస్ స్టేషన్ లో శ్రమదానం శ్రమదానం చేయాల్సి వుంటుందని సిపి పోలీస్ అధికారులకు సూచించారు. ఈస్ట్ జోన్, వెస్ట్ జోన్ డిసిపి రాజమహేంద్ర నాయక్, డిసిపి అంకిత్‌కుమార్, వరంగల్ , జనగాం ఎఎస్‌పి చేతన్‌నితిన్, అదనపు డిసిపిలు రవి, ప్రభాకర్‌రావు, బాలస్వామి,తో పాటు ఎసిపిలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్.ఐలు, ఎస్.ఐలు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బిఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలి

ఉప ఎన్నికల ప్రచారంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :**జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బిఆర్ఎస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం జూబ్లీహిల్స్ అసెంబ్లీ పరిధి 94వ డివిజన్‌లోని సీతానగర్, వినోభానగర్, ఐక్యమత్యనగర్, ద్వారకానగర్, మారుతినగర్ లలో కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణా మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామితో కలిసి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఎన్నిక ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆదర్శభావాలు కలిగిన వ్యక్తి నవీన్ యాదవ్ అని, అలాంటి వ్యక్తిని ఎన్నుకుంటే జూబ్లీహిల్స్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజలకు మంచి పనులు చేసి ఓట్లు అడుగుతున్నామని ఎమ్మెల్యే చెప్పారు. ప్రజలను మరోసారి మోసం చేసేందుకు బిఆర్ఎస్ ప్రయత్నం చేస్తున్నదన్నారు. రెండేళ్లలో మేము చేసిన మంచి పనులు వివరిస్తూ ఓట్లు అడుగుతున్నామని, బిఆర్ఎస్ మాత్రం అసత్య ప్రచారాలు చేస్తూ, సానుభూతితో ఓట్లు అడుగుతోందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరోపించారు.

## రేపు మద్యం టెండర్లకు లాటరీ ప్రక్రియ

జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్

**ప్రజాపక్షం/భూపాలపల్లి:** 2025 27 సంవత్సరాలకు భూపాలపల్లి ఎక్సైజ్ యూనిట్ లోని మొత్తం 59 మద్యం దుకాణాలకు గాను 1863 దరఖాస్తులు రావడం జరిగిందనిజిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దరఖాస్తు ఫీజు రూపంలో 55 కోట్ల 89 లక్షల రూపాయల ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. భూపాలపల్లి ఎక్సైజ్ యూనిట్ లో 59 మద్యం షాపులో ఉండగా అందులో అత్యధికంగా ములుగు జిల్లా మల్లంపల్లి లోని మద్యం షాపుకు 77 దరఖాస్తులు రావడం జరిగిందని తెలిపారు. ఈ నెల 27న మద్యం షాపుల కేటాయింపుకు సంబంధించిన లాటరీ ప్రక్రియను భూపాలపల్లి పట్టణం మంజూరు నగర్ లోని ఇల్లందు క్లబ్ హౌస్ లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సమక్షంలో ఉదయం 10 గంటలకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి భూపాలపల్లి ఎక్సైజ్ యూనిట్ లో మద్యం షాపులకు దరఖాస్తు చేసిన దరఖాస్తుదారులు సోమవారం ఉదయం 9 గంటల వరకు ఇల్లందు క్లబ్ హౌస్ ఫంక్షన్ హాల్ కు హాజరు కావాల్సిందిగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమానికి హాజరు కావడానికి మద్యం దుకాణానికి దరఖాస్తు చేసిన సమయంలో వారికి ఇచ్చినటువంటి రిసిప్ట్ కం ఎంట్రీ పాస్ ఒరిజినల్ ను వెంట తెచ్చుకోవాలని ఆయన స్పష్టం చేశారు. లేదంటే లోపటికి అనుమతించబడదని పేర్కొన్నారు.

## రాబోయే స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి



**ప్రజాపక్షం/ఖానాపూర్:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎడ్ల జగన్మోహన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు శాఖమూరి హరిబాబులు అన్నారు. నర్సంపేట ఎంఎల్ఏ దొంతి మాధవరెడ్డి ఆదేశానుసారం గ్రామ స్థాయి నుండి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలనే నిర్ణయం మేరకు మనుబోతులగడ్డ గ్రామ నూతన కమిటీ ఎన్నిక కార్యక్రమం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల జగన్మోహన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు శాఖమూరి హరిబాబుల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎస్‌కె కమాలుద్దీన్‌ను కొనసాగిస్తూ, ఇద్దరు గ్రామ కార్యనిర్వాహక అధ్యక్షులుగా బొంత శ్రీనను, భూక్య రాములును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు అందరిని సమన్వయ పరచుకొని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ఇంటింటికి వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించాలని అన్నారు. ఎవరైనా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటివారైన ఉపేక్షించేది లేదని, అలాంటి వారిపై పార్టీ పరమైన చర్యలకు కూడా వెనుకాడేది లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వీరమనేని సాగర్‌రావు, మండల మైనార్టీ అధ్యక్షుడు ఎస్‌కె ముస్తఫా, మండల సహాయ కార్యదర్శి మేకల వరదయ్య, దేవినేని వేణుగోపాల్‌రావుతో పాటు పలువురు గ్రామ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.


# రైతు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర

జనగామ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు శివకుమార్



**ప్రజాపక్షం/లింగాలఘణపురం:** రైతు పండించిన, ధాన్యానికి, గిట్టుబాటు ధర కల్పిస్తుందని, జనగామ జిల్లా, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, కొల్లూరి శివకుమార్ (నర్సింహులు) అన్నారు. శనివారం, మండలంలోని, కొత్తపల్లి, వడిచర్ల, నేలపోగుల, గ్రామాలలో, ఐకెపి, ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన, ధాన్యం కొనుగోలు కేంద్రాలను, స్టేషన్ ఘణపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాల మేరకు, కొల్లూరి శివకుమార్ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, రైతులు పండించిన ధాన్యాన్ని, దళారి చేతిలో మోసపోకుండా, రైతులకు, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, రైతులు ధాన్యాన్ని, నేరుగా, కొనుగోలు కేంద్రాలలో విక్రయించాలని వారు అన్నారు. రైతును రాజును చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రవీందర్, మండల అభివృద్ధి అధికారి, రఘురామకృష్ణ, ఎటిఎం నాగేశ్వరరావు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్, కిషోర్, పిఎసిఎస్ చైర్మన్ శ్రీశైలం, పిఎసిఎస్ డైరెక్టర్, వేముల కృష్ణారెడ్డి, మాజీ ఎంపిటిసి, గుగ్గిల్ల నర్సయ్య, కాంగ్రెస్ నాయకులు, గండి దశరథ, గండి శీను, జనగాం ఉపేందర్, కాటం కుమార్, ఆయా శాక అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## 'స్థానిక' ఎన్నికలలో సత్తా చాటాలి :కుంజా సూర్య



**ప్రజాపక్షం/కన్నాయిగూడెం:**రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించి సత్తా చాటాలని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి కుంజా సూర్య అన్నారు. కన్నాయిగూడెం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోట నగేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథులుగా యూత్ కాంగ్రెస్ కార్యదర్శి కుంజా సూర్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా సూర్య మాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికలలో యువజన కాంగ్రెస్ నాయకులు ముఖ్య పాత్ర పోషిచాలని, ఎటువంటి మనస్పర్థలు లేకుండా ఐక్యతతో ఒకటై అందరూ పనిచేయాలని ఎటువంటి సమస్యలు ఉన్నా యువజన కాంగ్రెస్ పార్టీ తరుపున తెలియజేయాలని అన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని అన్నారు. క్రీడాకారులకు ఆట వస్తువులు కానీ స్కూల్ గ్రౌండ్స్ కానీ విద్యపరంగా గొప్ప గొప్ప పై చదువులకై ఆర్థికం లేని కుటుంబాలు ఉంటే నా తెలియజేయాలని, నా వంతు సహాయం అందిస్తానన్నారు. అనంతరం ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్ మాట్లాడుతూ యువత అందరూ ఐక్యతతో పనిచేస్తూ వస్తే స్థానిక ఎన్నికలలో అతి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కన్నాయిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండి అఫ్సర్ పాషా, మండల ఇన్‌చార్జి జాడి రాంబాబు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎండి ఇస్సార్ ఖాన్, నియోజకవర్గ అధ్యక్షులు మారం సుమన్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు రేవంత్ యాదవ్, రాకేష్, మంగపేట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మురుకుట్ల నరేందర్, జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు అక్షిత్, వంశీ, వివిధ మండలాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, కన్నాయిగూడెం మండల యూత్ కాంగ్రెస్ మండల నాయకులు, గ్రామఅధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కన్నాయిగూడెం మండలవివిధ హోదాలనాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.




## 'గుమ్మడి నర్సయ్య'గా కన్నడ హీరో



ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య జీవిత చరిత్రను తెరపైకి తీసుకు వస్తున్నారు. పేద ప్రజల గురించి ఆలోచించే రాజకీయ నాయకుడిగా గుమ్మడి నర్సయ్యకు ఉన్న మంచి పేరు అందరికీ తెలిసిందే. ఇక గుమ్మడి నర్సయ్య పాత్రలో కన్నడ చక్రవర్తి శివ రాజ్ కుమార్ నటించబోతున్నారు. ప్రవల్లిక ఆర్ట్స్ క్రియేషన్స్ బ్యానర్ మీద ఎన్. సురేష్ రెడ్డి నిర్మాతగా పరమేశ్వర్ హివ్రాలే దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కబోతోంది. ఈ మేరకు చిత్రానికి సంబంధించిన పోస్టర్‌ను రిలీజ్ చేశారు. గుమ్మడి నర్సయ్య పాత్రకు శివ రాజ్ కుమార్ ప్రాణం పోసినట్టుగా కనిపిస్తోంది. ఆ లుక్, వేషధారణ అన్నీ కూడా అద్భుతంగా ఉన్నాయి. సైకిల్, వెనకాల ఉన్న అసెంబ్లీ, ఎర్ర కండువా ఇలా అన్నీ కూడా ఎంతో అథెంటిక్‌గా ఉన్నాయి. ఇక ఈ పోస్టర్తో ఒక్కసారిగా అంచనాలు పెంచేసినట్టు అయింది. ఇక మోషన్ పోస్టర్లో ఎమ్మెల్యేలు అంతా కూడా కారులో వస్తుంటే.. గుమ్మడి నర్సయ్య మాత్రం సైకిల్లో రావడం.. ఆ మ్యూజిక్, ఆర్ఆర్.. విజువల్స్ అన్నీ కూడా అద్భుతంగా అనిపిస్తోంది. నిర్మాత ఎన్. సురేష్ రెడ్డి ఈ ప్రాజెక్ట్‌ను ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా భారీ ఎత్తున నిర్మించబోతున్నారు. ఈ చిత్రానికి కెమెరామెన్గా సతీష్ ముత్యాల, సంగీత దర్శకుడిగా సురేష్ బొబ్బిలి, ఎడిటర్‌గా సత్య గిడుటూరి పని చేస్తున్నారు.



## అఖండ-2 తాజా పోస్టర్ విడుదల


నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం 'అఖండ 2: తాండవం'. రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట నిర్మిస్తున్నారు. ఎం.తేజస్విని నందమూరి చిత్రాన్ని సమర్పిస్తున్నారు.యాక్షన్ సీక్వెన్స్ ద్వారా లెజెండ్ అఖండ పాత్రను పరిచయం చేసిన ఫస్ట్ టీజర్కు అద్భుతమైన స్పందన వచ్చింది. ఇప్పుడు బాలకృష్ణ మరో పాత్రను పరిచయం చేస్తూ అఖండ 2: బ్లాస్టింగ్ రోర్ టైటిల్‌తో మరో గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఈ వీడియోలో బాలకృష్ణ పూర్తి స్థాయి మాస్ అవతార్లో కనిపిస్తున్నారు. బాలయ్య గర్జన సింహంలా వినిపించగా, ఆయన డైలాగ్ డెలివరీ, యాక్షన్ బ్లాక్స్ అదిరిపోయాయి. చివర్లో ఆయన కాలు మోపగానే గుర్రాలు భయంతో దూకడం పక్కా మాస్ ఎలివేషన్‌ను చూపిస్తున్నాయి. 'సౌండ్ కంట్రోల్‌లో పెట్టుకో. ఏ సౌండ్‌కి నవ్వుతానో, ఏ సౌండ్‌కి నరుకుతానో నాకే తెలియదు. ఊహకి కూడా అందదు' అని బాలకృష్ణ చెప్పిన డైలాగు గూజ్ బంప్స్ తెప్పించింది. రామ్‌లక్ష్మణ్ మాస్టర్ల యాక్షన్ కొరియోగ్రఫీ అద్భుతంగా ఉండగా, ఎస్. థమన్ అందించిన బిజిఎమ్ పవర్ఫుల్గా ఉంది.ఈ కొత్త టీజర్తో అఖండ 2: తాండవం కోసం అంచనాలు మరింత పెరిగాయి.ఈ చిత్రంలో సంయుక్త ముఖ్యపాత్రలో నటిస్తున్నారు. ఆది పినిశెట్టి ఓ పవర్ ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. హర్షాలి మల్హోత్రా కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.



## 'వాట్ హ్యాపెండ్' ప్రమోషనల్ సాంగ్ విడుదల

గీతా సుబ్రమణ్యం ఫేమ్ మనోజ్ కృష్ణ తన్నీరు హీరోగా నటిస్తోన్న లేటెస్ట్ మూవీ బిూ ఎ కప్ ఆఫ్ టీబిూ. యువతకు నచ్చే కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రం ద్వారా ఎఫ్పీ రోజర్స్, నిఖిత రావు దర్శకులుగా పరిచయమవుతున్నారు. ఆర్టిస్ట్ క్రియేషన్స్ పతాకంపై మనోజ్ కృష్ణ, నవీన్ కృష్ణ నిర్మించారు. జయ శ్రీ హీరోయిన్గా నటిస్తోన్న ఈ మూవీలో నటుడు రాకేష్ ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ మూవీ నుండి వాట్ హాపెండ్ అనే ప్రమోషనల్ సాంగ్ ని రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో హీరో మనోజ్ మాట్లాడుతూ ఈ పాటతో మా సినిమాని ప్రమోట్ చేసి థియేటర్స్ వరకూ తీసుకెళ్లాలి అన్నదే మా టీమ్ ఉద్దేశ్యం..పెద్ద సినిమాల వల్ల చిన్న సినిమాలు ఎలా ఎఫెక్ట్ అవుతున్నాయి అన్నది ఈ పాటలో ఫన్నీగా చూపించే ప్రయత్నం చేశాం. ఈ సినిమా ఒక యంగ్స్టర్ జర్నీ.. ఒక కాలేజ్ యువత జర్నీ ఎలా స్టార్ట్ అవుతుంది..అది ఎలా డీవియేట్ అవుతుంది దాని వల్ల వచ్చే పరిణామాలు ఏంటి అన్నది ఈ సినిమాలో చూపించాం. నేటి యువత తప్పక చూడాల్సిన సినిమా అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ కార్తిక్ రోడ్రివిజ్ మాట్లాడుతూ మాది చిన్న సినిమా అయినా మ్యూజిక్, మేకింగ్‌కి మనోజ్ చాలా ఖర్చు పెట్టారు. పాటలు, బ్యాక్గ్రౌండ్ స్కోర్ చాలా బాగా వచ్చింది. దర్శకులు మంచి ఔట్పుట్ తీసుకువచ్చారు. ఆదిత్య ఒక మంచి క్యారెక్టర్లో కనిపిస్తారు. టీమ్ అందరు చాలా కష్టపడి బెస్ట్ ఔట్ పుట్ తీసుకువచ్చారు. మీ అందరి సపోర్ట్ ఉండాలని కోరుకుంటున్నా అన్నారు. ఈ కార్యక్రమంలో సినిమాటోగ్రాఫర్ కమల్ నాబ్, నటుడు రాకేష్ పాల్గొన్నారు.

## 'జటాధర'లో జో లాలి జో పాట రిలీజ్



సుధీర్ బాబు, సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలలో నటిస్తున్న సూపర్ నేచరల్ మైథలాజికల్ థ్రిల్లర్ జటాధర. ఈ ద్విభాషా చిత్రానికి వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. పౌరాణిక ఇతివృత్తాలతో ఈ చిత్రం సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించబోతుంది. ఇటీవల రిలీజ్ అయిన టీజర్, ట్రైలర్ నేషనల్ వైడ్ గా వైరల్ అయ్యింది. 'సోల్ ఆఫ్ జటాధార, ధన పిశాచి సాంగ్స్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యాయి. తాజాగా జో లాలి జో సాంగ్ రిలీజ్ చేశారు. రాజీవ్ రాజ్ ఈ పాటని అద్భుతమైన కంపోజ్ చేశారు. శ్రీమాన్ కీర్తి లిరిక్స్, పావని వాసా, రాజీవ్ రాజ్ వోకల్స్ ఆకట్టుకున్నాయి. ఈ చిత్రంలో దివ్య ఖోస్లా, శిల్పా శిరోద్కర్, ఇంద్రకృష్ణ, రవి ప్రకాష్, నవీన్ నేని, రోహిత్ పాఠక్, ఝాన్సీ, రాజీవ్ కనకాల, సుభలేఖ సుధాకర్తో పాటు ప్రముఖ నటులు కనిపించనున్నారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని ఉమేష్ కుమార్ బన్సల్, శివిన్ నారంగ్, అరుణ అగర్వాల్, ప్రేరణ అరోరా, శిల్పా సింగ్హల్, నిఖిల్ నందా నిర్మించారు. అక్షయ్ కేజ్రీవాల్, కుస్సుమ్ అరోరా సహ నిర్మాతలుగా వ్యవహరించారు.దివ్యా విజయ్ క్రియేటివ్ ప్రొడ్యూసర్గా, భావిని గోస్వామి సూపర్వైజింగ్ ప్రొడ్యూసర్గా ఉన్నారు. జటాధర నవంబర్ 7న హిందీ, తెలుగు భాషల్లో విడుదల కానుంది.

## రూ.818 కోట్ల మార్క్ దాటిన కాంతార ఛాప్టర్ 1



రిషబ్ శెట్టి 'కాంతార ఛాప్టర్ 1' బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తోంది. మైథాలజీ, జానపదం, యాక్షన్ మేళవింపుతో రూపొందిన ఈ చిత్రం నాల్గవ వారం కూడా థియేటర్లలో హౌస్ఫుల్ షోలతో కొనసాగుతోంది. హోంబలే ఫిలిమ్స్ నిర్మించిన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.818 కోట్లకు పైగా వసూలు చేసింది. ఎపి, తెలంగాణ రాష్ట్రాల్లోనే రూ.110 కోట్లకు పైగా సాధించడం విశేషం. దీంతో ఈ సంవత్సరం అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ చిత్రంగా నిలిచింది. అలాగే, కెజిఎఫ్ 2 తర్వాత తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల్లో అత్యధిక వసూళ్లు సాధించిన డబ్బింగ్ సినిమాగా రికార్డు సృష్టించింది. కాంతార ఛాప్టర్ 1 అమెరికాలో కూడా దూసుకుపోతోంది. 5 మిలియన్ మార్క్ చేరువలో ఉంది. ఈ చిత్రం అక్టోబర్ 31న ఇంగ్లీష్ డబ్ వెర్షన్ విడుదల కానుంది. షార్ఫ్ రస్టెమ్తో రాబోతున్న ఈ వెర్షన్ అంతర్జాతీయ ప్రేక్షకులను మరింతగా ఆకట్టుకోనుంది.

## మోగ్లీలో 'సయ్యారే' పాట విడుదల




బబుల్గమ్ సినిమాతో హీరోగా పరిచయమైన రోషన్ కనకాల తన సెకండ్ మూవీ 'మోగ్లీ 2025' తో వస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత, కలర్ ఫోటో ఫేమ్ సందీప్ రాజ్ దర్శకత్వంలో, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించిన మోగ్లీ 2025 అడవి నేపథ్యంలో యూనిక్ రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిస్తున్నారు. తాజాగా సయ్యారే అనే పాటను విడుదల చేశారు. ఈ పాటను ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం కీరవాణి ఆవిష్కరించారు. కాల భైరవ అందమైన ఆర్కెస్ట్రేషన్‌తో అద్భుతమైన ట్యూన్ ను కంపోజ్ చేశారు. ఆస్కార్ విన్నర్ చంద్ర బోస్ హార్ట్ టచ్చింగ్ లిరిక్స్ అందించారు.ఈ పాట చెవిటి, మూగ అమ్మాయి, సౌండ్ నిరోధించే డివైజ్ ని ధరించి తన వినికిడి సామర్థ్యాన్ని త్యాగం చేయడానికి నిర్ణయించుకున్న అబ్బాయి చుట్టూ తిరుగుతుంది. ఎమోషనల్ అతను ఆమెకు ఒక లేఖ రాస్తాడు, ఆమెను ప్రేమిస్తానని ప్రామిస్ చేస్తాడు. ఐశ్వర్య దారురితో కలసి కాల భైరవ స్వయంగా ఈ పాటకు సోల్ ఫుల్ వోకల్స్ అందించాడు. రోషన్ కనకాల మెచ్యూర్ పెర్ఫార్మెన్స్‌తో ఆకట్టుకున్నాడు. సాక్షి మడోల్కర్తో అతని ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ ఎట్రాక్టివ్ గా వుంది.ఈ సినిమాలో బండి సరోజ్ కుమార్ విలన్ పాత్రలో నటించగా, హర్ష చెముడు కీలక పాత్ర పోషిస్తున్నారు. మోగ్లీ 2025 డిసెంబర్ 12న థియేటర్లలో విడుదల కానుంది. సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో ఆస్కార్ విజేత ఎం.ఎం కీరవాణి మాట్లాడుతూ.. కలర్ ఫోటో తర్వాత వచ్చిన అతి పెద్ద నిశ్శబ్దాన్ని శబ్దంగా మార్చబోతున్న సందీప్‌కి శుభాకాంక్షలు. విశ్వప్రసాద్ నాకు చిరకాల మిత్రులు. కాలభైరవ మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చుకోవాలని నాకు ఎప్పుడూ ఉంటుంది. కానీ ఈ వేడుకకి సుమ తో ఉన్న ఆత్మీయ అనుబంధంతో రోషన్‌ని ఆశీర్వదించడానికి వచ్చాను. సయ్యారే పాట చాలా బాగుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత టీజీ విశ్వప్రసాద్, హీరో రోషన్ కనకాల, డైరెక్టర్ సందీప్ రాజ్, సంగీత దర్శకుడు కాలభైరవ, నటుడు వైవా హర్ష, హీరోయిన్ సాక్షి, నిర్మాత కృతిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రాజస్థాన్‌లో భారీగా బంగారు నిక్షేపాలు

**జైపూర్:** దేశంలో అత్యధిక ఖనిజ సంపద కలిగిన రాష్ట్రాల్లో ఒకటైన రాజస్థాన్, ఇప్పుడు బంగారు నిల్వల విషయంలో మరోసారి వార్తల్లో నిలిచింది. గిరిజన ప్రాంతమైన బన్స్వారా జిల్లాలో భారీగా బంగారు నిక్షేపాలు ఉన్నట్లు అధికారులు ధ్రువీకరించారు. దీంతో ఆ జిల్లా దేశానికి కొత్త స్వర్ణ రాజధానిగా మారే అవకాశం ఉంది. జిల్లాలోని ఘటోల్ తెహసీల్ పరిధిలోని కంకారియా గ్రామంలో ఈ నిల్వలను గుర్తించారు. ఇప్పటికే ఇక్కడ ఉన్న భుకియా, జగ్‌పురా గనుల తర్వాత ఇది మూడో అతిపెద్ద బంగారు గనిగా నిలవనుంది. భూగర్భ శాస్త్రవేత్తలు జరిపిన సర్వేల ప్రకారం, కంకారియా ప్రాంతంలో దాదాపు మూడు కిలోమీటర్ల మేర బంగారు ఖనిజం విస్తరించి ఉన్నట్లు బలమైన ఆధారాలు లభించాయి. మొత్తం 940.26 హెక్టార్ల విస్తీర్ణంలో 113.52 మిలియన్ టన్నుల బంగారు ఖనిజం ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ ఖనిజాన్ని శుద్ధి చేసిన తర్వాత సుమారు 222.39 టన్నుల స్వచ్ఛమైన బంగారం లభించవచ్చని నిపుణులు చెబుతున్నారు. కంకారియాగారా ప్రాంతంలో బంగారంతో పాటు రాగి, నికెల్, కోబాల్ట్ వంటి ఇతర విలువైన ఖనిజాలు కూడా లభించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

## ఇంటర్మీడియట్ పరీక్షలు

(మొదటి పేజీ తరువాయి)

సంవత్సరం, ల్యాబ్స్, ప్రాక్టికల్స్ పరీక్షలు, అన్నిసబ్జెక్టులలో 20 శాతం ఇంటర్నల్ మార్కులు ఉంటాయన్నారు. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమెస్ట్రీ, బోటనీ, జువాలజీ, సిలబస్ మారబోతుందని, ఎన్‌సిఈఆర్‌టి నిబంధనలకు అనుగుణంగా కొత్త సిలబస్ రూపకల్పన చేస్తున్నామని, ఇందులో జూనియర్, డిగ్రీ కాలేజీ లెక్చరర్లు భాగస్వాములను చేశామని కృష్ణ ఆదిత్య తెలిపారు. 45 రోజుల్లో సిలబస్ ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. ఇంటర్ బోర్డ్ నిర్దేశించిన ప్రకారం డిసెంబర్ 15 నాటికి సిలబస్‌ను తెలుగు అకాడమీకి అందజేస్తామని, నూతన సిలబస్‌తో పాటు క్యూ ఆర్ కోడ్ ముద్రణ ఉంటుందని, డిజిటల్ కంటెంట్ లోకి ప్రతి చాప్టర్‌ను మారుస్తున్నామని, వచ్చే ఏడాది కోసం ఏప్రిల్ నెలాఖరులోపు కొత్త పుస్తకాలను మార్కెట్ లోకి తీసుకొస్తామని ఆయన వివరించారు. ల్యాబ్ ప్రాక్టికల్స్ ఇంగ్లీష్‌తో పాటు ఇతర భాషల్లో కూడా ఉంటాయని, 2026 నుంచి ఎసిఇగ్రూప్ ప్రారంభమవుతుందని, అకౌంటెన్సీ గ్రూప్ రూపకల్పన, తదితర అంశాలపై ప్రత్యేక కమిటీలను నియమిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 9 లక్షల 50 వేల మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాయనున్నారన్నారు. ఇంటర్ సిలబస్‌లో ఆరు మార్పులు తీసుకొచ్చామని, ప్రతి సబ్జెక్టును 80:20 నిష్పత్తిలో విభజిస్తున్నామన్నారు.ల్యాబ్ ప్రాక్టికల్స్ ఇంగ్లీష్ తో పాటు ఇతర భాషల్లో కూడా ఉంటాయి. ల్యాబ్ ప్రాక్టికల్స్ ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు కూడా ఉంటాయి. కామర్స్ విద్యార్థుల కోసం స్పెషల్ కోర్సు రూపొందించినట్లు తెలిపారు. విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు పెంచేలా కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను ప్రభుత్వ కాలేజీల్లోనే నిర్వహించేలా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని అన్నారు.

## హైకోర్టు తీర్పు రిజర్వ్డ్

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగింపును నిలిపివేస్తూ మధ్యంతర స్టే ఆదేశాలను జారీ చేసేందుకు నిరాకరించారు. లిక్కర్ దుకాణాల అప్లికేషన్లను డ్రా తీయవచ్చని, లైసెన్స్ కేటాయింపు మాత్రం తీర్పు మేరకే ఉంటుందన్నారు.లిక్కర్ షాపుల కోసం అప్లికేషన్ల సమర్పణ గడువును ఈ నెల 18 నుంచి 23వ తేదీకి పొడిగింపు ప్రొసీడింగ్‌ను హైదరాబాద్ సోమాజీగూడకు చెందన డి.వెంకటేశ్వరరావు ఇతరులు హైకోర్టులో సవాలు చేశారు. గడువు పెంచుతూ ఎక్సైజ్ శాఖ జారీ చేసిన మెమోను కొట్టివేయాలని సీనియర్ అడ్వకేట్ దేశాయ్ అవినాష్ వాదించారు. రూల్స్ ప్రకారం గడువు పెంపు చెల్లదన్నారు. ఇదే తరహా తీర్పు ఎపి హైకోర్టు ఇచ్చిందన్నారు. ఎపిలో బార్ కోసం నిర్ణయించిన తేదీని పొడించడాన్ని ఎపి హైకోర్టు రద్దు చేసిందన్నారు. ప్రొసీడింగ్స్ అమలును నిలిపివేస్తూ స్టే ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలోని 2025–27 సంవత్సరాలకు సంబంధించి 2,620 మద్యం దుకాణాల నిర్వహణ కోసం ప్రభుత్వం టెండర్ నోటిఫికేషన్‌ను గత ఆగస్టు 20న జారీ చేసిందన్నారు. తొలుత దరఖాస్తుల గడువు ఈ నెల 18 వరకు ప్రభుత్వం నిర్ణయించిందని, దీనిని ఈ నెల 23 వరకు గడువు పెంచడం చెల్లదన్నారు. అంతేకాకుండా ఈ నెల 23న జరగాలిసిన షాపుల ఎంపిక డ్రాను 27వ తేదీకి వాయిదా వేసిందని వివరించారు. ఈ నెల 18వ తేదీ తర్వాత పోటీ పెరిగడంతో మద్యం దుకాణాలు పొందే అవకాశాలు తగ్గాయన్నారు. గడువు గురువారంతో ముగిసిందని, మద్యం దుకాణాల లైసెన్సుల కోసం దాదాపు 90 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. గతంలో దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలుగా ఉండేదని, ఈ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూ.3 లక్షలకు పెంచిందన్నారు. దరఖాస్తుల గడువు పెంపు నిర్ణయం రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ చట్టంలోని నిబంధన 12(5)లకు విరుద్ధమన్నారు. ఆదాయం పెంపు కోసం ప్రభుత్వం నిబంధనలకు వ్యతిరేకంగా దరఖాస్తు చేసే గడువు పెంపు చేయరాదన్నారు. గడువు పెంపు చట్టవిరుద్ధమని ప్రకటించాలని కోరారు. దుకాణాల కోసం గడువు పొడిగిస్తూ 18న తెలంగాణ ప్రభుత్వ కమిషనర్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జారీ చేసిన మెమోను కొట్టివేయాలని కూడా కోరారు. రాష్ట్రం తరపున అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్ వాదిస్తూ, స్టే ఇవ్వొద్దని కోరారు. లిక్కర్ షాపుల కోసం ఆహ్వానించిన దరఖాస్తుల గడువును పెంచే అధికారం ఎక్సైజ్ శాఖకు ఉందన్నారు. నోటిఫికేషన్ రూల్స్ ప్రకారం ప్రభుత్వ నిర్ణయం చట్టబద్ధమేనని చెప్పారు. ఈ నెల 18న బంద్ జరగడం, టెక్నికల్ సమస్యలు రావడం వల్ల అదే తేదీతో ముగియాల్సిన గడువును 23 వరకు పొడిగించాల్సి వచ్చిందన్నారు. సర్కార్ విధాన నిర్ణయంలో జోక్యం వద్దని, స్టే ఇవ్వొద్దని కోరారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపార్ట్మెంట్ మెమోను సవాల్ చేశారని చెప్పారు దీనికి సంబంధించి జిల్లాల్లో ప్రచురించిన గెజిట్ను సవాల్ చేయలేదన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో మద్యం దుకాణాల కోసం గెజిట్ నోటిఫికేషన్ జారీ అయ్యిందని, గడువు పెంపును మాత్రమే సవాలు చేశారని, గెజిట్ను కాదని, కాబట్టి స్టే ఉత్తర్వులు జారీ చేయాల్సిన అవసరం లేదన్నారు. ఈ నెల 18 వరకు మద్యం దుకాణాల కోసం మొత్తం 89,343 దరఖాస్తులు వచ్చాయని, గడువు పెంపు తర్వాత వచ్చినవి 5,793 మాత్రమేనని వివరించారు. గడువు పెంచే అధికారం ప్రభుత్వానికి ఉంటుందన్నారు.దుకాణాల కేటాయింపు ప్రక్రియపై స్టే జారీ చేయవద్దని కోరారు. ఒకవేళ ఏమైనా మధ్యంతర ఉత్తర్వులను జారీ చేస్తే గడువు పెంచాక స్వీకరించిన 5,793 దరఖాస్తుదారులకే పరిమితం చేయాలన్నారు. కొంతమంది ఈనెల 18న రాష్ట్ర స్థాయిలో రాజకీయ బంద్కు పిలుపు ఇవ్వడం వల్ల గడువు పెంచాల్సివచ్చిందని అన్నారు. ఇది ప్రభుత్వ విధాన నిర్ణయమని, కోర్టుల జోక్యానికి ఆస్కారం తక్కువని చెప్పారు. తెలిపారు. వాదనల తర్వాత గడువు పెంపుపై స్టే ఇవ్వడానికి న్యాయమూర్తి నిరాకరించారు. లిక్కర్ షాపుల కేటాయింపు ప్రక్రియను నిలిపివేసేందుకు కూడా నిరాకరించారు. ఇరుపక్షాల వాదనల అనంతరం న్యాయమూర్తి తీర్పును వాయిదా వేశారు.


















Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president Palla Venkat Reddy, Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, Editor : Makkena Subbarao, E-mail : editorprajapaksham@gmail.com